thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 24 | కరీంనగర్ శుక్రవారం, 4 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## వాయుసేనలో ప్రైవేటు భాగస్వామ్యం తప్పనిసరి

న్యూఢిల్లీ : భారత వాయుసేన సామర్థ్యం పెంపునకు ప్రైవేటు భాగస్వామ్యాన్ని తీసుకోక తప్పదని ఉన్నత స్థాయి కమిటీ అభిప్రాయపడింది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యల్లో భాగంగా ప్రైవేటు సంస్థల సహకారం తీసుకొని లోటుపాట్లను సరిదిద్దుకో వాల్సి ఉందని తెలిపింది. సకాలంలో యుద్ధ విమానాలు అందక ఇబ్బం దులు ఎదురవుతున్నట్టు సాక్షాత్తూ వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ బహిరంగంగా చెప్పిన నేపథ్యంలో కమిటీ చేసిన ఈ సూచనకు ప్రాధాన్యం ఏర్పడింది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలోని సాధికారిక కమిటీ రక్షణ మంత్రికి అందజేసిన నివేదికలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రస్తావించింది. యుద్ధ విమానాల తయారీ, ఇతర అంశాల్లో ప్రైవేటు భాగస్వామ్యం తీసుకోవాలని ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసింది.

# బీసీ మంత్రంతో...

## మంత్రివర్గ విస్తరణలో మరో ట్విస్ట్...



## సోనియాతో ఆ నేతల భేటీ

ఢిల్లీ: పార్లమెంట్‌లో ఇవాళ(గురువారం) కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీని తెలంగాణ కాంగ్రెస్ నేతల బృందం కలిశారు. జంతర్ మంతర్‌లో బీసీ రిజర్వేషన్ల ధర్నా వివరాలను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వివరించారు. మంత్రులు, ఎంపీలను సోనియా గాంధీ ఆప్యాయంగా పలకరించారు. ఢిల్లీ పర్యటనలో తెలంగాణ కాంగ్రెస్ నేతల బృందం బిజీగా ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీని కలిశారు. మర్యాదపూర్వకంగా అధిష్టానం పెద్దలను కలిశారు.

**నేతలు మరింత కష్టపడాలి.. సోనియాగాంధీ దిశానిర్దేశం..** అధిష్టానం పెద్దలతో తెలంగాణ రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై నేతలు చర్చించారు. 2008లో సోనియా గాంధీని కలిశానని పాత జ్ఞాపకాలను ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై జంతర్ మంతర్‌లో పాల్గొన్నట్లు సోనియాకు విప్ ఆదిశ్రీనివాస్ వివరించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని ఈ సందర్భంగా నేతలకు సోనియా గాంధీ దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ప్రజలు ఎప్పుడూ కాంగ్రెస్‌కు వెన్నంటే ఉన్నారని వారికి చేసే మేలు ప్రజలు మరవరని అన్నారు. బీసీ రిజర్వేషన్లు బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు లు తెస్తాయని ఉద్ఘాటించారు. నేతలు మరింత కష్టపడాలని.. అందరికి సంక్షేమ పథకాలు అందించాలని సోనియా గాంధీ సూచించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై పార్లమెంట్‌లో మోదీ ప్రభుత్వంతో బలంగా కొట్లాడుతామని రాహుల్ గాంధీ అన్నారు. కేంద్ర వైఖరిని మీరు ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ గాంధీ తెలిపారు. సోనియా , రాహుల్ గాంధీలతో భేటీ అనంతరం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు.

**బీసీలకు మంత్రి పదవులపై చర్చ...** బీసీలకు మరో రెండు మంత్రిపదవులు ఇవ్వాలని కోరామని.. ఇద్దరికీ ఇచ్చే అవకాశం ఉందని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బీసీలకు మంచి చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని చెప్పారు. ఇవాళ సోషల్ జస్టిస్ మంత్రిని కలవనున్నామని, ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసే అవకాశం లేదని చెప్పారు. బీజేపీ నేతలు అపాయింట్‌మెంట్ తీసుకుంటే తాము భేషజాలు లేకుండా వారితో కలిసి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మతపరమైన రిజర్వేషన్లు ఎవరికి ఇవ్వడం లేదన్నారు. ముస్లింలు ఈ దేశంలో భాగం కాదా అని ప్రశ్నించారు. ముస్లింలు బీసీల్లో ఉన్నారని.. దానిలో భాగంగానే రిజర్వేషన్లు కల్పిస్తున్నామని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు బిల్లు తీసుకువచ్చామని గుర్తుచేశారు. ఉగాదికి మంత్రివర్గ విస్తరణ చేస్తామని తాము ఎక్కడ చెప్పలేదని అన్నారు. ఏఐసీసీ పరిధిలో ఉన్న అంశం వారే నిర్ణయం తీసుకుంటారని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

**మంత్రివర్గ విస్తరణపై సుదీర్ఘ చర్చ..** తమ అభిప్రాయాలను సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు తీసుకున్నారని.. తగిన సమయంలో మంత్రి వర్గ విస్తరణపై ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుందని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ముస్లింలను అడ్డంపెట్టుకుని బీసీలకు మోదీ ప్రభుత్వం అన్యాయం చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. గుజరాత్‌లో కూడా ముస్లింలకు రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయని.. మోదీ సీఎంగా ఉన్నప్పుడు కూడా అమల్లో ఉన్నాయని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లతో పాటు రాజకీయ, విద్య, ఉద్యోగాలు రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించామని తెలిపారు. బీసీ కుల సంఘాల నేతృత్వంలో జంతర్ మంతర్‌లో ధర్నా చేశామని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

**రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో ఉన్నాం..** కాంగ్రెస్ చిత్తశుద్ధితో 42 శాతం రిజర్వేషన్లు అమలుకు ఆమోదం తెలిపిందని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఓబీసీలు తెలంగాణలో 56 శాతం ఉన్నారని లెక్క తేలిందని అన్నారు. అన్ని కుల సంఘాలు చేసిన ధర్నాకు 18 పార్టీల నేతలు మద్దతు తెలిపారని చెప్పారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీని ఇవాళ కలిశామని రాష్ట అంశాలను వివరించామని అన్నారు. బీజేపీ నేతలు జంతర్ మంతర్ ధర్నాకు రాకుండా మొఖం చాటేశారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలిపామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. 9వ షెడ్యూల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా ప్రధాని మోదీని తెలంగాణ బీజేపీ నేతలు ఒప్పించాలని మహేష్ కుమార్ గౌడ్ కోరారు.




## సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు...

దిల్లీ: కంచ గచ్చిబౌలిలోని భూముల వ్యవహారంలో ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు.. కీలక ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు చర్యలు నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరిగింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఇవాళ మధ్యాహ్నం తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ మధ్యంతర నివేదికను పంపారు. హైకోర్టు నివేదికను పరిశీలించిన జస్టిస్ గవాయ్ ధర్మాసనం.. చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని పేర్కొంది. ఈ వ్యవహారానికి సంబంధించి వార్తా కథనాలను అమికస్ క్యూరీ.. జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు మెన్షన్ చేసింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని అత్యున్నత న్యాయస్థానం ప్రతివాదిగా చేర్చింది. అత్యవసరంగా కార్యకలాపాలు చేపట్టాల్సిన అవసరమేంటని ప్రశ్నించింది. ఒకవేళ ఇది అటవీ ప్రాంతం కాకపోయినా, చెట్లు కొట్టే ముందు సీఈసీ అనుమతి తీసుకున్నారా అని నిలదీసింది. ఒక్క రోజులో వంద ఎకరాల్లో చెట్లు కొట్టేయడం మామూలు విషయం కాదని తెలిపింది. తమ ప్రశ్నలకు సీఎస్ సమాధానం చెప్పాలని సుప్రీం ఆదేశించింది. అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీం కోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది. ఇదే అంశంపై ఇవాళ ఉదయం అత్యున్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. మధ్యాహ్నం 3.30 గంటల్లోగా నివేదిక అందించాలని ఆదేశించింది. 30 ఏళ్లుగా ఆ భూమి వివాదంలో ఉందని ప్రభుత్వ తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అటవీ భూమి అని ఆధారాలు లేవని కోర్టుకు తెలిపారు. తాజాగా మరోసారి ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వ చర్యలు అన్నీ నిలుపుదల చేయాలని ఆదేశించింది.




హైదరాబాద్ లో చినుకు పడితే చాలు చిత్తడి చిత్తడే.. రోడ్డుపై వరద నీరు ప్రవహించడం .. మ్యాన్ హోల్స్ ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి.. ఇక ట్రాఫిక్ కష్టాలు చెప్పనక్కరలేదు. ఈ రోజు మధ్యాహ్నం అరగంట పాటు గాలి వానతో కూడిన భారీ వర్షానికి ఖైరతాబాద్ నుండి పంజాగుట్ట వైపు వెళ్లే రహదారిపై ఓ భారీ వృక్షం కూలి కారుపై పడింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు .. కాని.. ఖైరతాబాద్.. పంజాగుట్ట రహదారి పై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సంఘటన స్థలానికి ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ జోయల్ డేవిడ్ చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. వృక్షాన్ని తొలగించే పనులు డిఆర్ఎస్ బృందం వేగవంతంగా చెట్టును కట్ చేసి ట్రాఫిక్ ని క్లియర్ చేశారు. హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో భారీ వర్షం పడింది. భారీగా కురిసిన వానతో నగర వాసులు తడిసి ముద్దయ్యారు. వర్షానికి వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్ బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్ నగర్, నారా యణ గూడ, లక్డీకాపుల్ ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరుతో వాహనదారులు, బాట సారులు ఇబ్బందులు పడ్డారు. ఎక్కడికక్కడ వాహనాలు స్థంభించాయి. పలు చోట్ల ఈదురు గాలు లకు చెట్లు నెలకొరిగాయి. దీంతో ట్రాఫిక్?కు అంతరా యం ఏర్పడింది. మరో నాలుగు రోజుల పాటు ( ఏప్రిల్? 3 నుంచి ) వర్షం పడుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.ఒక్కసారిగా కురిసిన వర్షానికి రహదారులన్ని జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపోవడంతో పాటు ట్రాఫిక్?కు? అంతరాయం ఏర్పడింది.







# మరో సంక్షేమ కార్యక్రమానికి...

# రేవంత్ సర్కార్ శ్రీకారం!

## సన్నబియ్యంతో పాటు రేషన్ కిట్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం

## అభయహస్తం రేషన్ కిట్‌లో పంపిణీ చేసే వస్తువులు ఇవే!

హైదరాబాద్ : పేదలు, సామాన్యుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మరో సంక్షేమ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఇప్పటికే దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా నిరు పేదలకు సన్న బియ్యాన్ని తెలంగాణ సర్కారు అందిస్తోంది. తాజాగా సన్నబియ్యంతోపాటు నిత్యావసర సరుకుల కిట్ను అందించేందుకు సన్నద్ధమైంది. దీంతో త్వరలోనే చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు సన్నబియ్యంతో పాటు నిత్యావసర సరుకుల కిట్ పంపిణీ కానుంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అమ్మ హస్తం పేరుతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తరహాసంక్షేమ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు ప్రతీ నెలా తొమ్మిది నిత్యవసర ఆహార వస్తువులను సబ్సిడీతో రూ.185కు అందించేది. అప్పట్లో ఈ పథకాన్ని 2013 ఏప్రిల్లో ఉగాది రోజు అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్ కుమా ర్ రెడ్డి ప్రారంభించారు. రేషన్ షాపుల్లో అమ్మహస్తం పేరుతో బియ్యం, కేజీ కందిపప్పు, లీటర్ పామాయిల్, కిలో గోధుమపిండి, అరకిలో చక్కెర, అర కిలో చింత పండు, కిలో ఉప్పు, 250 గ్రాముల కారంపొడి, వంద గ్రాముల పసుపు, లీటర్ కిరోసిన్ ఇచ్చేది. ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన పథకం తరహాలోనే మళ్లీ ఇప్పుడు తెలంగాణలో నిత్యావసర రేషన్ కిట్ల పథకాన్ని ప్రారంభించాలని రేవంత్ రెడ్డి సర్కారు కసరత్తు చేస్తోంది. ఈ పథకానికి ఇందిరమ్మ అభయహస్తం అని పేరు పెట్టనున్నట్లు సమాచారం. పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళి కలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. నిత్యావసరాల కిట్లో వంట నూనెతోపాటు కంది పప్పు, పంచదార తదితర సరుకు లు ఉండబోతున్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో వంట నూనెల ధరలు భగ్గుమంటు న్నాయి. కిలో వంటనూనె ధర రూ. 150 దాకా పలుకుతోంది.

కందిపప్పు ధర కూడా కిలో రూ.150దాకా చేరింది. ఇక సప్లయిల్లో ఏ చిన్న తేడా వచ్చినా నూనె లు, పప్పులు, మిరప కారం తదితర కొన్ని నిత్యావ సరాల ధరలు ఆకాశన్నంటు తున్నాయి. ఏటా ఇదే తంతు జరుగుతుండడంతో పేదలు, సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఈ నేపథ్యం లో రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం పేరుతో అందించే నిత్యావసరాల కిట్ తో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేదలు, సామాన్యుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మరో సంక్షేమ కార్య క్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఇప్పటికే దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా నిరు పేదలకు సన్న బియ్యాన్ని తెలంగాణ సర్కారు అందిస్తోంది. తాజాగా సన్నబియ్యంతోపాటు నిత్యావసర సరుకుల కిట్ను అందించేందుకు సన్నద్ధమైంది. దీంతో త్వరలోనే చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు సన్నబియ్యంతో పాటు నిత్యావసర సరుకుల కిట్ పంపిణీ కానుంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అమ్మ హస్తం పేరుతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తరహాసంక్షేమ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

చురకలు





# చల్లని కబురు.. హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షం

హైదరాబాద్: గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న హైదరాబాద్ నగరవాసులను వరుణుడు పలకరించాడు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలో వర్షం కురిసింది. దీంతో నగర వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. హిమయత్‌నగర్, కోఠి, అమీర్‌పేట, బోరబండ, జూబ్లీహిల్స్, ఎల్బీనగర్, హయత్‌నగర్, మేడ్చల్, విద్యానగర్, కోఠి, అబిడ్స్ తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఖైరతాబాద్‌లోని మెర్క్యురీ హెూటల్ వద్ద ఓ కారుపై చెట్టు కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు.

**పలు ప్రాంతాలు జలమయం...** అకాల వర్షంతో హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాష్ట్ర సచివాలయం ముందుభాగం చెరువును తలపిస్తోంది.

ఛార్మినార్‌లోని ఓ మీనార్‌పై నుంచి కొంత మట్టి కిందపడింది. ఈ ఘటనలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. వివిధ చోట్ల రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలక్‌పేట వంతెన వద్ద వరదనీరు నిలిచిపోయింది. రాజ్‌భవన్ రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. తెలుగుతల్లి ఫ్లైఓవర్ కింద భారీగా నీరు చేరింది.

# నామినేషన్లకు నేడే లాస్ట్ డేట్.. హైదరాబాద్ ఎమ్మెల్సీ పోటీపై పార్టీల డైలామా!

రాష్ట్ర రాజకీయాల్లో హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక ఆసక్తిగా మారింది. రేపటితో నామినేషన్ల గడువు ముగియనుండగా పోటీ విషయంలో ఇప్పటి వరకు ప్రధాన పార్టీలు ఎలాంటి నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించకపోవడం పొలిటికల్ హీట్ పెంచుతోంది. బలాబలాల దృష్ట్యా అంతిమంగా పోటీలో ఎవరెవరు ఉండబోతున్నారు? మద్దతు విషయంలో ఏ పార్టీ ఎలాంటి వ్యూహంతో ముందుకు రాబోతున్నది అనేది చర్చగా మారింది. హైదరాబాద్ స్థానిక కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో 81 మంది కార్పొరేటర్లు, 29 మంది ఎక్స్ అఫిషియోలతో కలిపి మొత్తం 110 మంది ఓటర్లు ఉన్నారు. ఎంఐఎంకు 49 ఓట్లు, బీఆర్ఎస్ కు 25, బీజేపీకి 22, కాంగ్రెస్ కు 14 ఓట్లు ఉన్నాయి. దీంతో బలాబలాలను బట్టి ఏ పార్టీ ఎలాంటి వ్యూహంతో రాజకీయం నడిపించబోతున్నది అనేది మరికొన్ని గంటల్లో తేలనుంది.

**కాంగ్రెస్ వ్యూహం:** హైదరాబాద్ ఎమ్మెల్సీ విషయంలో అధికార కాంగ్రెస్, ఎంఐఎం మధ్య చర్చలు తుదిదశకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

ఇది సిట్టింగ్ స్థానం కావడంతో తమకు మద్దతు ఇవ్వాలని అలా చేస్తే జీహెచ్ఎంసీ మేయర్ ఎన్నికల్లో సహకరిస్తామి కాంగ్రెస్ కు ఎంఐఎం ఆఫర్ ఇస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ ఎన్నికలో తమకే మద్దతు ఇవ్వాలని హైదరాబాద్ మేయర్ పీఠం ఇచ్చేలా ఎంఐఎంను కాంగ్రెస్ కోరుతున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు పార్టీలో ఎవరు డ్రాఫ్ అవుతారు ఎవరు పోటీలో నిలుస్తారనే ది ఉత్కంఠగా మారింది.

**బీజేపీ పోటీపై ఉత్కంఠ:** హైదరాబాద్ స్థానిక కోటా ఎమ్మెల్సీ





ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేసి మజ్లీస్ ను అడ్డుకుంటామని ఇటీవల బీజేపీ నేతలు చెప్పారు. ఈ ఎన్నిక విషయంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఇటీవల పార్టీ నేతలతో చర్చలు సైతం జరిపారు. ఈ క్రమంలో నామినేషన్ల గడువు ముంచుకు వస్తున్నా కమలం పార్టీ నుంచి ఎలాంటి నిర్ణయం ఇంకా వెల్లడికాకపోవడం కాషాయపార్టీ రేస్ లో ఉంటుందా లేదా అనేది తేలాల్సి ఉంది.

**బీఆర్ఎస్ సైలెన్స్:** ఇటీవల జరిగిన రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ (%దీ=వా%) పోటీకి దూరంగా ఉంది. ఓటమి పాలయై పరవు పోగొట్టుకోవడం కంటే పోటీకి దూరంగా ఉండటమే మంచిదనే అభిప్రాయంతోనే బీఆర్ఎస్ ఆ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉందనే చర్చ జరిగింది. ఇప్పుడు కూడా అటువంటి ఆలోచనే చేస్తుందా లేక పోటీకి దిగి చూపిస్తుందా ఇంకా తేలాల్సి ఉంది.

# హెచ్‌సీయూ భూములపై సుప్రీంకోర్టు తీర్పు.. ప్రభుత్వానికి చెంపదెబ్బ: రఘునందన్‌రావు

హైదరాబాద్: హెచ్‌సీయూ భూముల విషయంలో విద్యార్థులకు భాజపా అండగా ఉంటుందని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై హెచ్‌సీయూ విద్యార్థుల పోరాట ఫలితంగానే కోర్టు తీర్పు వచ్చిందన్నారు. "యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం మేం కూడా పోరాడతాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నడుచుకోవాలి. ప్రభుత్వ అనుమతి లేకుండా చెట్లు కొట్టవద్దని వాల్టా చట్టం చెబుతోంది. ఒక్క చెట్టు కొట్టడానికే అనుమతి అవసరమైతే.. వందల చెట్లు ఎలా కొట్టారు? మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరని అనుకున్న ప్రభుత్వానికి సుప్రీం తీర్పు చెంపదెబ్బ వంటిది" అని రఘునందన్ పేర్కొన్నారు.



# రేవంత్ ప్రభుత్వానిది రియల్ ఎస్టేట్ ఆలోచన



హైదరాబాద్: హెచ్‌సీయూ భూముల వివాదంలో రేవంత్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ హై కోర్టు చీవాట్లు పెడుతున్నా రేవంత్ ప్రభుత్వం తీరు మారదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇవాళ(గురువారం) తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సీఎం అంటే బాస్ కాదు ప్రజా సేవకుడని అన్నారు. అర్ధరాత్రి బుల్డోజర్లతో హెచ్‌సీయూ యూనివర్సిటీలోకి ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని చెప్పారు. భూముల వివాదంలో విద్యార్థులను మంత్రులు చులకనగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఫ్యూచర్ సిటీకి 14 వేల ఎకరాలు ఉండగా హైదరాబాద్‌లో ఉన్న భూమిని ఎందుకు తీసుకుంటున్నారని నిలదీశారు. హెచ్‌సీయూలో వన్యప్రాణులు లేవని ఎలా చెబుతారని కేటీఆర్ ప్రశ్నించారు. దయచేసి కంచె గచ్చిబౌలి 400 ఎకరాలను ఎవరు కొనవద్దని అన్నారు. ఇప్పుడు కంచె గచ్చిబౌలి భూములను ఎవరు కొన్న ఇబ్బందులు పడాల్సివస్తుందని కేటీఆర్ చెప్పారు. మూడేళ్లలో వచ్చేది తమ ప్రభుత్వమేనని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాలపై ఇదే తమ కమిట్మెంట్ అని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక అతిపెద్ద ఎకో పార్క్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఎవరైనా ఆ భూములు కొంటే మళ్లీ వెనక్కు తీసుకుంటామని తేల్చిచెప్పారు. అద్భుతమైన పార్క్‌గా మార్చి హెచ్‌సీయూకు కానుకగా ఇస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది రియల్ ఎస్టేట్ ఆలోచన అని విమర్శించారు. హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే తాము ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.ప్రభుత్వ భూములంటే ప్రజలవి.. సీఎం ధర్మకర్త మాత్రమేనని అన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిందిపోయి..ప్రభుత్వ పెద్దలు ఇష్టమొచ్చినట్లుగా చేస్తామంటే కుదరదని కేటీఆర్ హెచ్చరించారు.

**దొడ్డి కొమురయ్య స్ఫూర్తి: కేటీఆర్...** తెలంగాణ ధీరుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య స్ఫూర్తి అని కేటీఆర్ తెలిపారు. నిరంకుశత్వానికి ఎదురొడ్డి పోరాడి అమరత్వం పొందిన కొమురయ్య తెలంగాణ సమాజంలోని పోరాటతత్వానికి నిదర్శనమని ఉద్ఘాటించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం తన ప్రాణాలను పణంగా పెట్టారని కేటీఆర్ అన్నారు.

# ఉచిత బియ్యం ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమే..

హైదరాబాద్: ఉగాది నుంచి సన్నబియ్యం అందిస్తామని చెప్పిన రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు ఇచ్చేది కేవలం ఒక్క కిలో మాత్రమేనని మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. బీజేపీనాయకులు మూసాపేట డివిజన్‌లోని రేషన్‌దుకాణాల వద్దకు రేషన్ బియ్యం అందిస్తున్నది కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వమేనని కరోనా కాలం నుంచి నేటి వరకు కుటుంబంలో ఉన్న ప్రతీ ఒక్కరికి 5 కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రేషన్ దుకాణాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రేషన్ దుకాణల వద్ద స్లిప్‌లపై ఏమి రాసి ఉందో లబ్ధిదారులకు చదివి వినిపించారు.

**హెచ్‌సీయూ భూములు కాపాడుకుందాం...** హైదరాబాద్ సెంట్రల్ యూనవర్సిటీ భూములు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కార్పొరేటర్ మహేందర్ అన్నారు. పశుపక్షాదులు, ఎన్నోజీవరాశులకు ఉన్న హెచ్‌సీయూలో రాత్రికి రాత్రే బుల్డోజర్‌లు పెట్టి చెట్లను తొలగించడం దారుణమని మండిపడ్డారు. హిందూ పండుగలకు పర్యావరణంతో ముప్పు అంటూ చెప్పే సెక్యులర్‌లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. హెసీయూ భూములు అమ్ముకుంటే పర్యావరణానికి ఎంతో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ప్రభుత్వం పునరాలోచించుకోవాలన్నారు. వీలైతే మొక్కలు నాటాలని కాంగ్రెస్ పాలకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు ఎర్రాస్వామి, రవిగౌడ్, శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్, ఎలేందర్, శోభరాజన్, జానకి, తదితరులు పాల్గొన్నారు.



# భారాస ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తీర్పు రిజర్వు

దిల్లీ: భారాస ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై సుప్రీంకోర్టు లో విచారణ జరిగింది. పది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ కొనసాగింది. తెలంగాణ స్పీకర్ కార్యదర్శి తరఫున న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించారు. కౌశిక్‌రెడ్డి తరఫున ఆర్యామ సుందరం వాదించారు. అనంతరం ఇరు పక్షాల వాదనలను ముగించిన సుప్రీంకోర్టు తీర్పును రిజర్వులో ఉంచింది. గురువారం జరిగిన విచారణలో తొలుత అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించారు. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించే విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి తీర్పులు లేవని కోర్టు దృష్టికి ఆయన తీసుకెళ్లారు. దీనిపై జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ 'మీ దృష్టిలో రీజనబుల్ టైమ్ అంటే ఏంటి?' అని సింఘ్వీని ప్రశ్నించారు. న్యాయవాదులు ఇలాంటి కేసుల విషయంలో వ్యవహరించే విధానం చాలా ఇబ్బందికరంగా ఉందని.. సుప్రీంకోర్టుకు వచ్చిన తర్వాత వారి తీరు పూర్తిగా మారిపోతోందని వ్యాఖ్యానించారు. ఇటీవల అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను కౌశిక్‌రెడ్డి తరఫు న్యాయవాది ఆర్యామ సుందరం మరోసారి ప్రస్తావించారు. "ఉప ఎన్నికలు రావు.. స్పీకర్ తరఫున కూడా చెబుతున్నా" అంటూ ఆయన వ్యాఖ్యానించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీలో మాట్లాడితే ఏ కోర్టు నుంచి అయినా రక్షణ ఉంటుందని అన్నారని చెప్పారు. దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ "సీఎం కనీసం స్వీయ నియంత్రణ పాటించలేరా? గతంలో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. ఆ తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా?" అని ప్రశ్నించారు. మరోవైపు అభిషేక్ మనుసింఘ్వీ కలుగజేసుకుని ప్రతిపక్షం నుంచి అంతకుమించిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు అవన్నీ అప్రస్తుతమని ధర్మాసనం వాటిని పక్కన పెట్టింది. సీఎం మాటలు కోర్టు ధిక్కారం కింద తీసుకోవాల్సి ఉంటుందని జస్టిస్ గవాయ్ అన్నారు. "మేం సంయమనం పాటిస్తున్నాం.. మిగతా రెండు వ్యవస్థలు అదే గౌరవంతో ఉండాలి"అని వ్యాఖ్యానించారు. స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన తర్వాత కోర్టులో కేసులతో తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని చూశారని సింఘ్వీ పేర్కొనగా.. సింగిల్ జడ్జి ఇచ్చిన సూచనలను సానుకూలంగా తీసుకుని ఉంటే కేసు ఇక్కడి వరకు వచ్చేది కాదని జస్టిస్ గవాయ్ అన్నారు.

# తెలంగాణ సచివాలయం ముట్టడికి వామపక్ష విద్యార్థి సంఘాల యత్నం





హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని భూముల వివాదం నేపథ్యంలో తెలంగాణ సచివాలయం ముట్టడికి వామపక్ష విద్యార్థి సంఘాలు యత్నించాయి. హెచ్‌సీయూ భూములను కాపాడాలంటూ విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పీఎస్‌లకు తరలించారు.

**హెచ్‌సీయూ వద్ద ఏబీవీపీ ఆందోళన.. ఉద్రిక్తత...** మరోవైపు హెచ్‌సీయూ వద్ద నిరసనలు కొనసాగుతున్నాయి. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసనకారులు ఆందోళనకు దిగారు. లోపల జరుగుతున్న పనులను అడ్డుకుంటామన్నారు. హెచ్‌సీయూ ప్రధాన గేటు దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత నెలకొంది. నిరసనల నేపథ్యంలో పెద్ద ఎత్తున పోలీసులు అక్కడ మోహరించారు.

# శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వాహకులకు సీపీ సీవీ ఆనంద్ కీలక సూచనలు..

హైదరాబాద్: శ్రీరామనవమి సందర్భంగా 6వ తేదీన నిర్వహించే శోభాయాత్రను శాంతియుతంగా, సంతోషంగా జరుపుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఇవాళ(గురువారం) శ్రీరామ శోభాయాత్ర కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేషన్ కమిటీకి సీపీ సీవీ ఆనంద్ కీలక సూచనలు జారీ చేశారు. తారాం భాగ్ నుంచి శ్రీరామనవమి శోభాయాత్ర ప్రారంభం అవుతుందని అన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు శోభాయాత్ర ప్రారంభం అయ్యేలా నిర్వహకులు చూడాలని సూచించారు.

**విగ్రహాలు చిన్నగా ఉండాలి..** శోభాయాత్ర దారులు చిన్నగా ఉంటాయని.. భారీ టస్కర్ వాహనాలు వెళ్లే అవకాశం ఉండదని సీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. అందుకే టస్కర్ వాహనంతో ముందు ట్రయల్స్ నిర్వహించాలని సూచించారు. విగ్రహాల ఎత్తు కూడా చిన్నగా ఉండేలా చూసుకోవాలని సలహా ఇచ్చారు.

డ్రోన్స్ ఎగుర వేయాలి అంటే ముందుగా తమకు సమాచారం ఇవ్వాలని అన్నారు. డీజే సౌండ్‌తో అనర్థాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. శోభాయాత్రలో డీజే సౌండ్స్ తక్కువగా ఉండేలా చూడాలని అన్నారు. శోభాయాత్రలో పెద్దపెద్ద డీజే శబ్దాలు లేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సీవీ ఆనంద్ సూచించారు.

**శోభాయాత్రలో పాటలు అలా ఉండొద్దు..** శోభాయాత్రలో పాటలు



వేరే వర్గాలను కించ పరిచేలా ఉండకూడదని సీపీ సీవీ ఆనంద్ చెప్పారు. శోభాయాత్రలో ఇబ్బంది లేకుండా రోడ్డుకు ఇరువైపులా వేదికలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జాయింట్ కంట్రోల్ రూమ్ ఐసీసీసీలో ఏర్పాటు చేసి శోభాయాత్ర తీరును పర్యవేక్షిస్తామని చెప్పారు. 24 గంటలు కరెంట్, బ్యాక్ అప్ కోసం జనరేటర్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆర్టీసీ నుంచి డ్రైవర్లు, కండక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రసాదాల వితరణ కేంద్రాలను శోభాయాత్రకు అడ్డు లేకుండా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.

శోభాయాత్రకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతం చేయడానికి అన్ని ప్రభుత్వ విభాగాలు చర్యలు తీసుకోవాలని సీపీ సీవీ ఆనంద్ సూచించారు.

# భారాస రజతోత్సవ వేళ.. పాట విడుదల చేసిన కేసీఆర్




హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి (భారాస) రజతోత్సవ వేళ ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పాటను విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాట రచించి పాడారు. 'బండెనుక బండి కట్టి... పోదాము రారన్నో..." అంటూ రసమయి బాలకిషన్ రాసి, పాడిన పాటను కేసీఆర్ ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకు భారాస ప్రస్థానంపై పాటలు, కళారూపాలు రూపొందించాలని రసమయి బాలకిషన్‌కు కేసీఆర్ సూచించారు. కార్యక్రమంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో వర్షం.. అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్

హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా వర్షం కురుస్తున్న నేపథ్యంలో అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్లపై నీరు నిలవకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కోరారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే వెంటనే పునరుద్ధరించాలని, ట్రాఫిక్ సమస్యను త్వరగా క్లియర్ చేయాలని అన్నారు. జిల్లాల్లోనూ అధికారులు, కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు.






కేవలం రూ.15వేల జీతం సంపాదిస్తున్న ఓ పారిశుద్ధ్య కార్మికుడు ఆదాయ పన్ను విభాగం అధికారుల నుంచి వచ్చిన నోటీసు చూసి కంగుతిన్నాడు. రూ.34 కోట్ల పన్ను చెల్లించాలంటూ అందులో పేర్కొనడంతో షాక్‌కు గురయ్యాడు. దాంతో అతడు పోలీసులను ఆశ్రయించాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన కరణ్‌కుమార్ పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నారు.

అయితే అతడికి ఆదాయపు పన్ను విభాగం అధికారుల నుంచి నోటీసులు అందాయి. కానీ వాటిలో ఏముందో అతడికి అర్థం కాకపోవడంతో.. తోటివారి సహాయంతో విషయం తెలుసుకున్నారు. వారు చెప్పిన లెక్కలతో తీవ్ర ఆందోళనకు గురైన అతడు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. "2019-2020లో కరణ్ రూ.34 కోట్ల ఆదాయాన్ని పొందారు. ఆ ఏడాదికి ఎలాంటి రిటర్న్ ఫైల్ చేయలేదు" అని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. కానీ కరణ్ కుమార్ మాత్రం ఆగ్రాలోని ఖైర్‌లో ఉన్న ఎస్‌బీఐ బ్రాంచ్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నారు. తన జీతం రూ.15 వేలని వెల్లడించినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

అయితే అతడి పాన్ కార్డ్ వివరాలను ఎవరైనా దుర్వినియోగం చేసి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాను గతంలో పనిచేసిన యజమానికి తన పాన్ వివరాలు, గుర్తింపు పత్రాలు సమర్పించిన విషయాన్ని కరణ్ గుర్తుచేసుకున్నారు. ఇటీవల అలీగఢ్‌కు చెందిన జ్యూస్ సెంటర్ వ్యాపారికి రూ.7.5 కోట్లు చెల్లించాలని నోటీసులు అందిన సంగతి తెలిసిందే.




కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకువచ్చింది. కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బిల్లు ప్రవేశపెట్టిన అనంతరం సభలో ప్రసంగించారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. (%ఔనట ూఎవఅఎవత్ దీఱశ్రీశ్రీ). "బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. అందులోని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. పార్లమెంట్ ఉభయ సభ్యులతో కూడిన జేపీసీకి అభినందనలు. మొత్తం 284 ప్రతినిధులు, 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డులు జేపీసీలో తమ వాదనలు వినిపించాయి. మేం బిల్లులో కొన్ని సానుకూల మార్పులు చేస్తే.. మమ్మల్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఈ బిల్లు తీసుకురాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటారు" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ స్పందనకు గతంలో ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ చేసిన వ్యాఖ్యలు కారణం. దేశ రాజధానిలోని పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి సంబంధించినవని అజ్మల్ అప్పట్లో వాదించారు. "వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజానికి చెందిన మత విశ్వాసాలకు ఎలాంటి ఆటంకం కలిగించదు. ఇది కేవలం ఆస్తుల నిర్వహణకు సంబంధించిన విషయం మాత్రమే. ఈ బిల్లుకు మద్దతు ఇచ్చేవారు, వ్యతిరేకించేవారు ఎప్పటికీ గుర్తుండిపోతారు. పేద ముస్లింలకు వక్ఫ్ ఆస్తులను ఉపయోగించాలి. వారిని అలా వదిలేయకూడదు. వారి ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు..? ముస్లిం ప్రతినిధులు ఆ బిల్లును ఆహ్వానించారు. వీలైనంత త్వరగా దీనికి ఆమోదం లభించాలని ఆ వర్గంలోని పేదలు కోరుకుంటున్నారు. అలాగే రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు వారి హక్కులు దక్కుతాయి. ప్రభుత్వ భూమి విషయంలో వివాదం తలెత్తితే కలెక్టర్ కంటే పైస్థాయి వ్యక్తి తీర్పు ఇవ్వాలంటూ జేపీసీ చేసిన ప్రతిపాదనను మేం అంగీకరించాం" అని రిజిజు స్పష్టత ఇచ్చారు. మరోవైపు విపక్షాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. ఈ బిల్లుకు వ్యతిరేకంగా కోల్‌కతాలో మార్చ్ జరిగింది.




# విదేశీ విద్యార్థులపై అమెరికా ఏఐ నిఘా

క్యాంపస్ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగశాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కేవలం ఆందోళనల్లో పాల్గొన్న వారినే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన వారిని స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలంటూ ఈమెయిల్స్ పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ఓ కీలకమైన విషయం వెలుగులోకి వచ్చింది. హమాస్ అనుకూల ఉగ్రవాద గ్రూపులకు మద్దతిస్తున్న విదేశీ విద్యార్థులను గుర్తించడానికి.. వారిపై నిఘా పెట్టడానికి అమెరికా ప్రభుత్వం ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాద అనుకూల పోస్టులు, స్టోరీలకు ఇన్‌స్టాలో లైక్ కొట్టినా దొరకబుచ్చుకునేలా ట్రంప్ యంత్రాంగం సాంకేతికతను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నాయి. యూఎస్ విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో నాయకత్వంలో అధికారులు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసిన నాటినుంచి ఇప్పటివరకు వారికి మద్దతుగా ఎవరెవరు సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులు చేశారు, ఎవరు వాటిని లైక్, షేర్ చేశారనే విషయాలు తెలుసుకోవడానికి విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను స్కాన్ చేస్తున్నట్లు యాక్సియోస్ (%ూఇఱశీం%) అనే నివేదిక వెల్లడించింది. నివేదికలోని వివరాల ప్రకారం.. విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలపై కొంతకాలంగా ఏఐ నిఘా కొనసాగుతోంది. విద్యార్థులు వారు చేసిన పోస్టులను తొలగించినప్పటికీ ప్రభుత్వ విభాగాల వద్ద వాటి స్క్రీన్‌షాట్‌లు ఉంటాయి. బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో బహిష్కరణ వేటు పడినప్పటికీ యూఎస్‌లోనే ఉంటున్న అక్రమ వలసదారులను(విద్యార్థులు) గుర్తించడానికి కూడా ట్రంప్ యంత్రాంగం వీటిని ఉపయోగిస్తోంది. ఇందులోభాగంగా ఇప్పటివరకు లక్షకు పైగా విదేశీయుల ప్రొఫైల్‌లను ఫెడరల్ అధికారులు స్కాన్ చేశారు. ఓపెన్ డోర్స్ నివేదిక ప్రకారం..2023-24 విద్యా సంవత్సరంలో అమెరికా రికార్డు స్థాయిలో 1.1 మిలియన్ల అంతర్జాతీయ విద్యార్థులకు ఆతిథ్యం ఇచ్చింది. వీరిలో 3 లక్షలకు పైగా భారత్ నుంచి వచ్చారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటినుంచి అమెరికాకు వ్యతిరేకంగా ఉన్న అన్ని విషయాలపై ఉక్కుపాదం మోపారు. ఇందులోభాగంగానే జాతి వ్యతిరేక ప్రచారానికి పాల్పడుతున్న వారి సోషల్ మీడియా ఖాతాలను అమెరికా విదేశాంగశాఖ జల్లెడ పడుతోంది. ఒకవేళ అదే నిజమని తేలితే ఆ విద్యార్థులకు అమెరికాలో చదువుకునే వీల్లేకుండా తక్షణమే స్వదేశానికి పంపించే యోచనలో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈమేరకు అమెరికా విదేశాంగశాఖ, కాన్సులేట్ అధికారుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువరించింది. ఈ మేరకు హెచ్చరిక సందేశాలు అందుకున్నవారు.. తమ స్వదేశాలకు వెళ్లేందుకు సీబీపీ హోమ్ యాప్ ఉపయోగించుకోవచ్చని తెలిపింది.

# అమెరికా ఆతిథ్య రంగాన్ని కుదిపేస్తున్న భారతీయ హోటల్ యజమానులు



నేడు అమెరికాలోని హోటల్ పరిశ్రమ సమావేశాలకు హాజరైతే ఒక స్పష్టమైన దృశ్యం కనిపిస్తుంది: ఎక్కడ చూసినా భారతీయ హోటల్ యజమానులే. సంవత్సరాలుగా వారు ఈ రంగంలో బలమైన స్థానాన్ని సంపాదించారు. ముఖ్యంగా బడ్జెట్ , మధ్య-శ్రేణి హోటళ్లలో వారి యాజమాన్యం ఎక్కువగా ఉంది. అయితే ఈ విస్తరణతో కొంత ఘర్షణ కూడా ఇప్పుడు అమెరికా వర్గాల్లో మొదలైంది. కొంతమంది దీర్ఘకాలిక అమెరికన్ హోటల్ యజమానులు తమ వ్యాపార శైలి కనుమరుగవుతోందని ఆందోళన చెందుతున్నారు. సమస్య కేవలం యజమానుల సంఖ్యలోనే లేదు. చాలా మంది భారతీయ యజమానులు ఖర్చులను తగ్గించడంపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఆస్తులను మెరుగుపరచడానికి పెట్టుబడి పెట్టడానికి వెనుకాడటం.. ధరలను చాలా తక్కువగా ఉంచడం వల్ల మార్కెట్ విలువ పడిపోవడం వంటి ముఖ్యమైన ఫిర్యాదులు అమెరికన్ హోటల్ యజమానులు చేస్తున్నారు.. ఇది పరిశ్రమ ప్రమాణాలను దిగజారుస్తుందని కొందరు వాదిస్తుంటే, మరికొందరు ఇది కేవలం భిన్నమైన పోటీ విధానం మాత్రమే అని అంటున్నారు.పరిశ్రమలోని కొందరు వ్యక్తులు "భారతీయ మనస్తత్వం" అనే పదాన్ని ఉపయోగిస్తున్నారు. ఇది స్థిరమైన వృద్ధి కంటే స్వల్పకాలిక మనుగడపై దృష్టి పెట్టడాన్ని సూచిస్తుంది. భారతీయ కుటుంబాలలోనే వ్యాపారం కొనసాగేలా చేసే ఒక నెట్‌వర్క్ నుండి తాము మినహాయించబడ్డామని కూడా వారు భావిస్తున్నారు. పటేల్ కుటుంబాలు తమ హోటళ్లను ఇతర పటేల్ కుటుంబాలకే విక్రయిస్తాయని తరచుగా చెబుతారు. దీనిని కొందరు దుర్భేద్యమైన వ్యవస్థగా భావిస్తున్నారు. ఈ మార్పుల కారణంగా అమెరికాలో జన్మించిన హోటల్ యజమానులకు , భారతీయ యజమానులకు మధ్య కొంత ఉద్రిక్తత నెలకొంది. అయితే ఈ అసంతృప్తి నిజంగా వ్యాపార వ్యూహాల గురించా లేదా మరేదైనా కారణం ఉందా అనే ప్రశ్న తలెత్తుతోంది. చరిత్రను పరిశీలిస్తే.. వలసదారులు ఎల్లప్పుడూ వివిధ పరిశ్రమలను తమదైన శైలిలో మార్చారు. భారతీయ హోటల్ యజమానులు చాలా కష్టపడి పనిచేశారు. తరచుగా ఖర్చులను సమర్థవంతంగా నిర్వహించారు. తమ కుటుంబ సంబంధాలను వ్యాపారంలో ఉపయోగించారు. కొందరు షార్ట్‌కట్‌లు తీసుకుంటే.. మరికొందరు కేవలం సమర్థవంతంగా పోటీ పడుతున్నారు. నేటి హోటల్ రంగం గతంలో ఉన్నట్లు లేదు. మార్పును అంగీకరించని వారు వెనుకబడిపోయే అవకాశం ఉంది. భారతీయ హోటల్ యజమానుల మధ్య విధేయత.. స్నేహం చాలా లోతుగా ఉంటాయి. వారిలో చాలా మంది నిరాశ్రయులుగా ప్రారంభించి, ఎక్కువ గంటలు పనిచేయడానికి.. అనేక త్యాగాలు చేయడానికి సిద్ధపడ్డారు. వారి విధానం భిన్నంగా ఉండవచ్చు, కానీ వారి విజయం వారి సామర్థ్యానికి నిదర్శనం. చివరిగా హోటళ్లను ఎవరు నిర్వహిస్తున్నారు అనే ప్రశ్న ముఖ్యం కాదు. ప్రతి ఒక్కరికీ లాభం చేకూర్చే విధంగా వ్యాపారం మారుతుందా అనేది అసలు ప్రశ్న. కార్మికులు, సందర్శకులు , కంపెనీలు అందరికీ ప్రయోజనం చేకూర్చే ఒక వ్యవస్థ అవసరం. ఒకవేళ ఏదైనా సమస్యలు ఉంటే వాటిని జాతీయత ఆధారంగా కాకుండా, వ్యాపారం ఎలా నడుస్తుందనే దానిపై దృష్టి సారించి పరిష్కరించాలి. సేవల నాణ్యత, ఉద్యోగులకు మంచి వేతనం.. తిరిగి పెట్టుబడి పెట్టడం వంటి అంశాలు ప్రాధాన్యతలుగా ఉండాలి. ఈ పోరాటం భారతీయ వర్సెస్ అమెరికన్ యాజమాన్యం మధ్య కాదు, ఎవరు ఈ పరిశ్రమకు మంచి భవిష్యత్తును నిర్మిస్తారు అనే దానిపై ఆధారపడి ఉంటుంది.

# ఇది కదా కావాల్సింది.. త్వరలోనే రూ.55వేలకు దిగిరానున్న బంగారం

గత కొన్నాళ్లుగా ఆకాశాన్నంటుతున్న బంగారం ధరలతో సతమతమవుతున్న సామాన్యులకు ఊరటనిచ్చే వార్త ఇది. త్వరలోనే పసిడి ధరలు భారీగా దిగిరానున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.55 వేల స్థాయికి పడిపోయే అవకాశం ఉందని మార్నింగ్ స్టార్ నిపుణుడు జాన్ మిల్స్ జోస్యం చెప్పారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు బంగారం ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ట్రంప్ టారిఫ్‌ల భయాలు, కేంద్ర బ్యాంకుల భారీ కొనుగోళ్లు పసిడికి డిమాండ్‌ను పెంచాయి. అయితే, ఈ పరిస్థితి



తాత్కాలికమని, దీర్ఘకాలంలో ధరలు తగ్గుతాయని మిల్స్ విశ్లేషించారు. ప్రస్తుతం ఔన్స్ బంగారం ధర \$3,000 - \$3,150 మధ్య ఉండగా, రాబోయే ఐదేళ్లలో ఇది 38% వరకు పతనమయ్యే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. ధరలు తగ్గడానికి ఆయన మూడు ప్రధాన కారణాలు వివరించారు. మొదటిది, అధిక ధరల కారణంగా బంగారం తవ్వకాలు (మైనింగ్) పెరగనున్నాయి. ఇది మార్కెట్‌లోకి సరఫరాను పెంచి ధరలను తగ్గిస్తుంది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ కూడా ఇదే విషయాన్ని ధృవీకరించింది. రెండోది, ప్రస్తుతం భారీగా బంగారం కొంటున్న కేంద్ర బ్యాంకులు, ఆర్థిక పరిస్థితులు కుదుటపడ్డాక అమ్మకాలు చేపట్టే అవకాశం ఉంది. అంతేకాకుండా, డిజిటల్ బంగారం, గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెరుగుతుండటంతో భౌతిక బంగారానికి డిమాండ్ తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక చివరిగా, బంగారం ధరల చారిత్రక ధోరణులను పరిశీలిస్తే ప్రస్తుత ధరలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయని మిల్స్ అభిప్రాయపడ్డారు. అయితే, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి ఇతర నిపుణులు మాత్రం రాబోయే రెండేళ్లలో బంగారం ధర ఔన్సుకు \$3,500కు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. గోల్డ్‌మన్ శాక్స్ కూడా ఈ ఏడాది చివరి నాటికి \$3,300కు చేరుకోవచ్చని అంచనా వేసింది. ఇలా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, జాన్ మిల్స్ అంచనా మాత్రం బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఆశాకిరణంలాంటిది.

# ప్రపంచంలోనే ఫస్ట్ ఎయిర్ లైన్స్ సంస్థ ఏదో తెలుసా ? అది ఏ దేశంలో ఉందంటే ?

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజలు తమ విలువైన సమయాన్ని ఆదా చేసుకోవడానికి విమాన ప్రయాణాన్ని ఎంచుకుంటున్నారు. ఎందుకంటే విమానంలో ప్రయాణించడం వల్ల ఎక్కడికైనా త్వరగా, వేగంగా, సులభంగా చేరుకోవచ్చు. మీరు కూడా చాలాసార్లు విమాన ప్రయాణం చేసి ఉంటారు. అయితే, ప్రపంచంలో మొట్టమొదటి ఎయిర్‌లైన్స్ ఎలా ప్రారంభమయ్యాయో ఎప్పుడైనా ఆలోచించారా? ప్రపంచంలో మొట్టమొదటి విమానయాన సంస్థ ఏమిటి, దానిని ఎలా ప్రారంభించారు అనే వివరాలను తెలుసుకుందాం. ప్రపంచంలో మొట్టమొదటి విమానయాన సంస్థ పేరు సెయింట్ పీటర్స్‌బర్గ్-టాంపా ఎయిర్‌బోట్ లైన్. ఈ ఎయిర్‌లైన్ జనవరి 1, 1914న ప్రారంభమైంది. ఈ ఎయిర్‌లైన్ సెయింట్



పీటర్స్‌బర్గ్ నుంచి టాంపాకు తన మొదటి విమానాన్ని నడిపింది. ఈ మొదటి విమానంలో సెయింట్ పీటర్స్‌బర్గ్ మేయర్ అబ్రహం సి. ముఖ్యంగా ప్రయాణించారు. ఆయన సుమారు 400 డాలర్లు బిడ్ వేసి టిక్కెట్‌ను వేలంలో గెలుచుకున్నారు. అయితే, ఈ ఎయిర్‌లైన్ కేవలం మూడు నుంచి నాలుగు నెలలు మాత్రమే నడిచింది. ఈ ఎయిర్‌లైన్ బెనోయిస్ట్ ఎయిర్‌బోట్ అనే విమానాన్ని ఉపయోగించింది. ఇది నీటిపై ఎగరడానికి, ల్యాండ్ అవ్వడానికి కూడా వీలుగా ఉండేది. సెయింట్ పీటర్స్‌బర్గ్-టాంపా ఎయిర్‌బోట్ లైన్‌ను పెర్సివల్ ఇలియట్ ఫాన్స్‌లర్, థామస్ బెనోయిస్ట్, ఆంథోనీ జానస్ కలిసి స్థాపించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్-టాంపా ఎయిర్‌బోట్ లైన్ ప్రపంచంలోనే మొట్టమొదటి ఫిక్స్‌డ్-వింగ్ ఎయిర్‌లైన్, కానీ 1914లో ఈ ఎయిర్‌లైన్‌ను మూసివేశారు. ఈ ఎయిర్‌లైన్ సెయింట్ పీటర్స్‌బర్గ్, టాంపా బే తర్వాత సుమారు 37 కిలోమీటర్ల దూరం ఎగిరింది. సెయింట్ పీటర్స్‌బర్గ్ , టాంపా మధ్య ప్రయాణాన్ని వేగవంతం చేయడం, సులభతరం చేయడం సెయింట్ పీటర్స్‌బర్గ్-టాంపా ఎయిర్‌బోట్ లైన్ ముఖ్య ఉద్దేశం. ఈ ఎయిర్‌లైన్ రవాణా రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. అంతేకాకుండా, ఈ ఎయిర్‌లైన్ గ్లోబల్ ఏవియేషన్ పరిశ్రమకు పునాది వేసింది.

చురకలు

## సంపాదకీయం

### వైసీపీలో మారాల్సింది ఎవరు.. మార్చేది ఎవరు ?

అవును వైసీపీ ఇపుడు విపక్షంలో ఉంది. ఎన్నడూ లేని సంక్షోభంలో ఉంది. కేవలం 11 సీట్లు మాత్రమే వైసీపీకి ఈ దఫా దక్కాయి అంటే దారుణమైన ఫలితమే కదా అని అంటున్నారు. అంతే కాదు అసెంబ్లీకి వైసీపీ కనీసం వెళ్ళలేని ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు. ప్రతిపక్ష హోదా లేకపోవడం వల్ల జగన్ ని పులివెందుల ఎమ్మెల్యే అని ప్రత్యర్థి పార్టీలు పొలిటికల్ ర్యాగింగ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ ఓటమి చెంది పది నెలలు పై దాటుతోంది. మరి పార్టీ పరమైన రిపేర్లు ఉన్నాయా దిద్దుబాట్లు చేసుకుంటున్నారా అన్న చర్చ అయితే ఉంది. జగన్ విషయానికి వస్తే ఆయన ఎక్కువగా బెంగళూరులోనే ఉంటున్నారు అని అంటున్నారు. పార్టీకి అందుబాటులో ఉండాల్సిన వేళ ఆయన ఈ విధంగా చేయడం పట్ల కూడా చర్చ సాగుతోంది. జగన్ మారాలి అని అంటున్న వారూ ఉన్నారు. అయితే ఎట్టకేలకు జగన్ లో కొంత మార్పు అయితే కనిపిస్తోంది అని అంటున్నారు. లోక్ బాడీ ఎన్నికలో అధికార కూటమిని ఎదిరించి ప్రాణాలు ఒడ్డి మరీ పార్టీని గెలిపించిన వారితో జగన్ భేటీ కావడమే ఈ మార్పు అని అంటున్నారు నిజానికి చూస్తే ఇటువంటి సమావేశాలు వైసీపీలో జరిగిన సందర్భాలు అయితే లేవు ఇవన్నీ టీడీపీ లాంటి పార్టీలలో జరుగుతాయి. వైసీపీలో క్యాడర్ లీడర్ ల మధ్య అనుసంధాన ప్రక్రియ కొంచెం కష్టంగానే ఉంటుంది అయితే ఇపుడిపుడే వైసీపీ అధినాయకత్వం వాస్తవాలను తెలుసుకుంటోంది అని అంటున్నారు. అందుకే పార్టీ కోసం కొమ్ము కాసిన వారిని జగన్ తన వద్దకు పిలిపించుకుని అభినందించడం జరుగుతోంది అని అంటున్నారు. అంతే కాదు ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడులో హత్యకు గురి అయిన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు కూడా తాను వస్తాను అని జగన్ చెప్పడం ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిలో ధైర్యం నింపడం వంటివి నిజంగా ఆహ్వానించతగిన పరిణామాలే అని అంటున్నారు. వైసీపీలో జగనే కీలకం. ఆయనతోనే పార్టీ ఉంది. ఆయన చుట్టూనే పార్టీ అల్లుకుంది. అధికారంలో ఉన్నపుడు కూడా వైసీపీ పెద్దలు అదే చెప్పేవారు. తాము ఎవరిని నిలబెడితే వారే గెలుస్తారు అని కూడా గట్టిగా మాట్లాడేవారు. అంతకు ముందు 2014 నుంచి 2019 మధ్యలో కూడా జగన్ ఒక్కరే జనంలోకి వెళ్ళారు. ఆయనే పోరాటాలు చేశారు. ఆయనే పాదయాత్ర చేశారు. అన్ని నిరసన కార్యక్రమాలలో ఆయనే పాలు పంచుకున్నారు. అలా నిత్యం జనంలో జగన్ ఉండడం వల్లనే పార్టీ కూడా బలంగా మారింది. క్యాడర్ కి లీడర్ కి ఉత్తేజం కలిగింది. కానీ ఇపుడు చూస్తే అధినేత కాకుండా పార్టీ నేతలను జనంలోకి వెళ్ళమంటే ఎలా అన్న చర్చ వస్తోంది. ఒకవేళ వెళ్ళినా వారి వల్ల వచ్చేది పెద్దగా ఏమి ఉంటుంది అని కూడా అంటున్నారు. జగన్ కి ప్రజాదరణ ఉంది. ఆయన మాస్ లీడర్. ఆయనే కూటమి ప్రభుత్వానికి ఎదురొడ్డి జనంలో నిలిస్తేనే ఆయన వెంట క్యాడర్ కూడా పరుగులు తీస్తుంది అని అంటున్నారు. వైసీపీ అధినాయకత్వంలో ఈ మార్పు రావాలని అంటున్నారు అయితే జగన్ కూడా జనంలోకి వెళ్ళాలనే అనుకుంటున్నారు అంటున్నారు. ఒక ఏడాది పాటు అయినా ఈ ప్రభుత్వానికి గడువు ఇచ్చి ఆ మీదట జనంలోకి వెళ్తే ఆ ఇంపాక్ట్ వేరేగా ఉంటుందని ఆయన ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. ఆ ఆలోచన బాగానే ఉన్నా ఈలోగా అయినా క్యాడర్ వద్దకు వెళ్తూ పార్టీ కోసం ఇబ్బందులు పడుతున్న వారిని పరామర్శిస్తూ ఉంటే కనుక కొంత ఊపు వస్తుందని అంటున్నారు. మరి వైసీపీ హైకమాండ్ ఈ విషయంలో ఏమి ఆలోచిస్తుందో చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# ఏప్రిల్ 4... అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవం




ప్రతి సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటారు. ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని 2005లో ప్రారంభించింది. యుద్ధాలు, సాయుధ పోరాటాలు ముగిసిన తర్వాత కూడా భూమిలో మిగిలి పోయిన మందు పాతరలు, పేలుడు పదార్థాల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. అంతే కాకుండా, వీటిని నిర్మూలించ డానికి జరుగుతున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడం, బాధితులకు సహాయం అందించడం కూడా ఈ దినోత్సవం లక్ష్యాలలో ముఖ్యమైనవి. యుద్ధాలు ముగిసిన తరువాత కూడా మందుపాతరలు ఒక పెద్ద సమస్యగా మిగిలి పోతాయి. ఇవి పొలాలు, రహదారులు, నివాస ప్రాంతాలు ఇలా ఎక్కడైనా ఉండవచ్చు. వీటి గురించి తెలియని సామాన్య ప్రజలు, ముఖ్యంగా పిల్లలు, రైతులు, పేదవారు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. మందు పాతర పేలినప్పుడు ప్రాణనష్టం జరగవచ్చు లేదా శాశ్వత వైకల్యం సంభవించవచ్చు. అంతే కాకుండా, ఇది దేశాల ఆర్థికాభివృద్ధికి కూడా ఆటంకం కలిగిస్తుంది. వ్యవసాయ భూములు నిరుపయోగంగా మారతాయి, రవాణా వ్యవస్థ స్తంభించి పోతుంది, ప్రజలు భయంతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవం ప్రధాన లక్ష్యాలలో...మందు పాతరల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం, మందు పాతరల నిర్మూలనకు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ప్రాజెక్టులకు ఆర్థికంగా, ఇతర విధాలుగా మద్దతు అందించడం, మందు పాతరల బాధితులకు అవసరమైన వైద్య సహాయం, మానసిక మద్దతు, పునరావాస సౌకర్యాలు కల్పించడం, మందు పాతరల సమస్య యొక్క తీవ్రతను తెలియ జేయడం, దీని పరిష్కారానికి అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడం. ఈ దినోత్సవం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజ సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. వీటిలో కొన్ని ముఖ్యమైనవి... మందు పాతరల ప్రమాదాల గురించి అవగాహన కల్పించే ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించడం. మందు పాతరల నిర్మూలనకు సంబంధించిన విషయాలపై చర్చాగోష్ఠులు సెమినార్లు ఏర్పాటు చేయడం. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. మందు పాతరల నిర్మూలనలో పాల్గొనే వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం. మందు పాతరల బాధితులకు మానసిక మరియు వైద్య సహాయం అందించడం, వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం. మందుపాతరల సమస్యపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి మీడియా ప్రచారం నిర్వహించడం. భారత దేశంలో కూడా సరిహద్దు ప్రాంతాలలో మందు పాతరల సమస్య ఉంది. భారత సైన్యం ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడంలో కీలకమైన పాత్ర పోషిస్తోంది. అయితే, ఈ సమస్య తీవ్రతను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. మందు పాతరల గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు, గనుల తవ్వకం కూడా పర్యావరణానికి తీవ్రమైన నష్టం కలిగిస్తుంది. గనుల నుండి వెలువడే వ్యర్థ పదార్థాలు నేల, నీరు, గాలిని కలుషితం చేస్తాయి. దీనివల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. అంతే కాకుండా, గనుల కోసం అడవులను నరకడం వల్ల వన్య ప్రాణులు వాటి ఆవాసాలను కోల్పోతాయి. జీవ వైవిధ్యానికి నష్టం వాటిల్లుతుంది. గనులలో పనిచేసే కార్మికులకు కూడా ఆరోగ్య సమస్యలు మరియు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కాబట్టి, గనుల తవ్వకం విషయంలో పర్యావరణ హిత విధానాలను అనుసరించడం, కార్మికుల భద్రతను నిర్ధారించడం చాలా ముఖ్యం. అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవం కేవలం ఒక రోజుకు మాత్రమే పరిమితం కాకూడదు. మందు పాతరల సమస్య తీవ్రతను గుర్తించి, దీనిని నిర్మూలించ డానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి. బాధితులకు సహాయం అందించడానికి ముందుకు రావాలి. భవిష్యత్ తరాలకు సురక్షితమైన ప్రపంచాన్ని అందించడమే మనందరి లక్ష్యం. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి మందుపాతరల గురించి అవగాహన పెంచుకోవడం, ఈ సమస్యపై పోరాడటానికి కలిసి రావడం చాలా అవసరం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# విటమిన్ సి వినియోగం...పలు విధ ప్రయోజనకరం - ఏప్రిల్ 4...జాతీయ విటమిన్ సి దినోత్సవం

ప్రతీ ఏటా ఏప్రిల్ 4న జాతీయ విటమిన్ సి దినోత్సవం జరుపు కుంటారు. ఈ దినోత్సవం ఆరోగ్యానికి విటమిన్ సి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియ జేయడం, దాని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేయడం లక్ష్యంగా ఏర్పాటైంది. విటమిన్ సి అనేది శరీరానికి అత్యవసరమైన పోషక పదార్థం, ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ ఆరోగ్యాన్ని కాపాడటం మరియు కణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. విటమిన్ సి, లేదా ఆస్కార్బిక్ ఆమ్లం, ఒక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ మరియు అనేక శారీరక ప్రక్రియలకు అవసరమైన పోషకం. శరీరం దీనిని స్వంతంగా ఉత్పత్తి చేయలేదు కాబట్టి, మనం తీసుకునే ఆహారం ద్వారా లేదా సప్లిమెంట్ల ద్వారా దీనిని పొందాలి. విటమిన్ సి యొక్క విస్తృత ప్రయోజనాలలో... రోగనిరోధక శక్తిని పెంచడం ద్వారా విటమిన్ సి తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, వాటి పనితీరును కూడా మెరుగు పరుస్తుంది. ఇవి శరీరంలోకి ప్రవేశించే హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడటానికి సహాయ పడతాయి. అంతే కాకుండా, విటమిన్ సి యాంటీబాడీల ఉత్పత్తికి కూడా తోడ్పడుతుంది, ఇవి ఇన్ఫెక్షన్లను గుర్తించి నాశనం చేస్తాయి. కాలాజెన్ ఉత్పత్తిలో విటమిన్ సి కీలక పాత్ర పోషిస్తుంది. కాలాజెన్ అనేది చర్మం, ఎముకలు, కండరాలు, రక్త నాళాలు, ఇతర కణ జాలాలను కలిపి ఉంచే ఒక ప్రోటీన్. గాయాలు త్వరగా మానడానికి మరియు కొత్త కణజాలం ఏర్పడటానికి ఇది చాలా అవసరం. విటమిన్ సి రక్తపోటును తగ్గించడంలో సహాయ పడుతుంది. రక్త నాళాల పనితీరును మెరుగు పరుస్తుంది. ఇది శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో కూడా కొంత పాత్ర పోషిస్తుంది, తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. విటమిన్ సి ఒక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ కావడం వల్ల, ఇది శరీరంలోని కణాలను ఫ్రీ రాడికల్స్





వల్ల కలిగే నష్టం నుండి రక్షిస్తుంది. ఈ ఫ్రీ రాడికల్స్ క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు కారణ మవుతాయి. కొన్ని అధ్యయనాలు విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని సూచిస్తున్నాయి. విటమిన్ సి మెదడు పనితీరుకు కూడా అవసరం. ఇది న్యూరో ట్రాన్స్‌మిటర్ల ఉత్పత్తిలో పాల్గొంటుంది, ఇవి మానసిక స్థితి, అభిజ్ఞా పనితీరును ప్రభావితం చేస్తాయి. కొన్ని పరిశోధనలు విటమిన్ సి మానసిక ఒత్తిడిని తగ్గించడంలో, మానసిక స్థితిని మెరుగు పరచడంలో సహాయ పడుతుందని సూచిస్తున్నాయి. వయస్సు పెరిగే కొద్దీ వచ్చే కంటి సమస్యల్లో మచ్చల క్షీణత ఒకటి. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లతో కలిసి, ఈ సమస్యను నివారించడంలో లేదా ఆలస్యం చేయడంలో సహాయ పడుతుంది. కొన్ని అధ్యయనాలు విటమిన్ సి ఆస్తమా లక్షణాలను తగ్గించడంలో సహాయ పడుతుందని సూచిస్తున్నాయి, ముఖ్యంగా పిల్లలలో. ఇది శ్వాస నాళాల్లోని వాపును తగ్గించడంలో సహాయ పడుతుంది. విటమిన్ సి లోపం వల్ల స్కర్వీ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. అయితే, స్వల్పకాలిక లోపం కూడా అలసట, బలహీనత, చిగుళ్ళ వాపు మరియు రక్తస్రావం, చర్మంపై దద్దుర్లు వంటి సమస్యలకు దారితీస్తుంది. ఆహారంలో తగినంత విటమిన్ సి లేకపోవడం వల్ల రోగ నిరోధక శక్తి తగ్గుతుంది, దీని వలన తరచుగా ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. విటమిన్ సి పుష్కలంగా లభించే ఆహారాలు చాలా ఉన్నాయి. నారింజ, నిమ్మ, ద్రాక్షపండు, బత్తాయి, బెర్రీలు: స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్‌బెర్రీలు, బ్రోకలీ, క్యాప్సికం (ముఖ్యంగా ఎరుపు మరియు పసుపు), బంగాళా దుంపలు, టమోటాలు, పాలకూర, క్యాబేజీ, కివి, మామిడి, బొప్పాయి, పుచ్చకాయ. విటమిన్ సి నీటిలో కరిగే విటమిన్ కాబట్టి, వంట చేసేటప్పుడు కొంత మొత్తం కోల్పోయే అవకాశం ఉంది. అందువల్ల, పండ్లను మరియు కూరగాయలను పచ్చిగా తినడం లేదా తక్కువ నీటిలో తక్కువ సమయం ఉడికించడం మంచిది. జాతీయ విటమిన్ సి దినోత్సవం మన ఆరోగ్యానికి ఈ ముఖ్యమైన పోషకం యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడం నుండి కణజాల మరమ్మత్తు వరకు అనేక కీలకమైన విధులను నిర్వహిస్తుంది. మన ఆహారంలో విటమిన్ సి అధికంగా ఉండే పండ్లు మరియు కూరగాయలను చేర్చుకోవడం ద్వారా మనం ఆరోగ్యకరమైన మరియు శక్తివంతమైన జీవితాన్ని గడపవచ్చు. ఈ రోజున, విటమిన్ సి ప్రయోజనాలను గుర్తించి, మన రోజువారీ ఆహారంలో దానిని చేర్చుకోవడానికి ప్రయత్నిద్దాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# డబుల్ సమ్మర్

## నైరుతి సీజన్‌లో ఎల్‌నినో రాదు: ఐఎండీ
## నేడు రాయలసీమ, కోస్తాకు వర్షసూచన

విశాఖపట్నం: పసిఫిక్ మహాసముద్రంలో లానినా ముగిసింది. ప్రస్తుతం తటస్థ పరిస్థితులు ప్రారంభం కావడంతో భూమధ్యరేఖకు ఆనుకుని తూర్పు, పశ్చిమ పసిఫిక్ మహా సముద్రంలో సాధారణం కంటే తక్కువగా ఉండే ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులు వచ్చాయి. దీంతో 4నెలలపాటు కొనసాగిన లానినా ముగిసి, తటస్థ పరిస్థితులు ఏర్పడ్డాయని అంతర్జాతీయ వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితులు సెప్టెంబరు, నవంబరు వరకు కొనసాగే అవకాశాలున్నాయని అంచనా వేశారు. రానున్న నైరుతి రుతుపవనాల సీజన్‌లో తటస్థ పరిస్థితులు పోయి, ఎల్‌నినో వచ్చే అవకాశం లేదని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తేల్చిచెప్పింది. అయితే పసిఫిక్ మహాసముద్రంలో తటస్థ పరిస్థితులు కొనసాగుతున్నా.. దేశంలో ప్రస్తుత వేసవి సీజన్‌లో ఎండలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఎక్కువ రోజులు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని, వచ్చే 3నెలల్లో డబుల్ సమ్మర్ ఎఫెక్టు ఉంటుందని చెప్పారు. దేశంలో రానురాను వడగాడ్పులు, అధిక ఉష్ణోగ్రతల నమోదుతోపాటు సుదీర్ఘమైన వేసవి కాలం కొనసాగుతుందని తాజా పరిశోధనల్లో వెల్లడైంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు వేసవిగా పరిగణిస్తుంటారు. అయితే, ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే వేసవి తీవ్రత మొదలైంది. వేసవికాలం సుదీర్ఘంగా కొనసాగడం, పగలు, రాత్రి వేడి వాతావరణం నెలకొనడం ప్రజల ఆరోగ్యాలు, జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. దిగుబడులు తగ్గడం, కొన్ని పంటలు బాగా దెబ్బతినడంతో వ్యవసాయ రంగం నుంచి వచ్చే ఆదాయం తగ్గుతుందని, తద్వారా దేశ ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపుతుందని ఇప్పటికే పలు ఆర్థిక సంస్థల అధ్యయనంలో వెల్లడైందని గుర్తుచేస్తున్నారు. ఇప్పటివరకూ కొనసాగుతున్న పంటల సాగు విధానాలు, ప్రజల జీవన విధానం ముఖ్యంగా ఇళ్ల నిర్మాణాల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు.




**నేడు, రేపు పిడుగులతో వానలు...** దక్షిణ ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కామెరూన్‌లలో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నాయి. వీటి ప్రభావంతో రెండు సముద్రాల నుంచి తేమగాలులు భూ ఉపరితలంపైకి వీస్తున్నాయి. వాటి ప్రభావంతో బుధవారం రాయలసీమలో అక్కడక్కడ వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాయలసీమలో ఎక్కువచోట్ల, కోస్తాలో పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. గాలులు, ఉరుములు, పిడుగులు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయని పేర్కొంది. కాగా, రానున్న రెండు రోజులు కొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. గురువారం అల్లూరి, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో, శుక్రవారం మన్యం, అల్లూరి, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడతాయన్నారు. పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గురువారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, తూర్పుగోదావరి జిల్లాల్లోని 23 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు.

# భక్తులకు గుడ్ న్యూస్.. నేరుగా ఇంటికే భద్రాద్రి రామయ్య తలంబ్రాల పంపిణీ..

భద్రాచలంలో సీతారాముల కళ్యాణ వేడుకను కనులారా వీక్షించాలి.. వారి పెళ్లి తలంబ్రాలను తీసుకోవాలని కోరుకుంటారు భక్తులు. మనసులో కోరిక ఉన్నా అందరికీ వెళ్లేందుకు వీలుపడదు. అలాంటి భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం. తెలంగాణ దేవాదాయశాఖ సహకారంతో కలిసి భక్తులకు రామయ్య తలంబ్రాలను నేరుగా వారి ఇంటికే చేర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

మరి, రామయ్య పెళ్లి తలాంబ్రాలు నేరుగా హోం డెలివరీ కావాలంటే.. టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ.సజ్జనార్ హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్ ఆవిష్కరించి తలంబ్రాల బుకింగ్ ప్రారంభించారు. భద్రాచలంలో సీతారాముల కళ్యాణోత్సవరం పూర్తయిన తర్వాత బుకింగ్ చేసుకున్న భక్తులకు తలంబ్రాలు హోం డెలివరీ చేస్తారు. రాములోరి తలంబ్రాలు కావాలని కోరుకునే భక్తులు టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాలు లేదా సంస్థ వెబ్‌సైట్ tgsrtclogistics.co.in ఓపెన్ చేసి రూ.151 చెల్లించి మీ పూర్తి వివరాలు నమోదు చేసుకోండి. భక్తులు సంస్థ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను సంప్రదించిన అయినా నేరుగా ఆర్డర్ చేయవచ్చు. భక్తులు తలంబ్రాల సేవ పొందాలనుకుంటే టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ ఫోన్ నెంబర్లు 040-69440000, 040-69440069లను సంప్రదించండి.

# చిన్నతరహా పరిశ్రమలకు విద్యుత్తు విఘాతం

సిరిసిల్ల : జిల్లా వస్త్రోత్పత్తి పరిశ్రమలోని ఎస్ఎస్ఐ(స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్)లను విద్యుత్తు బిల్లులు వెంటాడుతున్నాయి. నాలుగు రోజుల క్రితం సెస్ అధికారులు పెండింగ్ బిల్లులు చెల్లించడంలేదంటూ విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. దీంతో 127 చిన్నతరహా యూనిట్ల పరిధిలో ఎనిమిదివేల మరమగ్గాలపై వస్త్రోత్పత్తులు నిలిచిపోయాయి. వీటిపై పనిచేసే సుమారు 1600 మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. రెండేళ్లుగా విద్యుత్తు సమస్య పరిష్కారం కాకపోవడంతో సర్వీసులపై బిల్లులు పేరుకుపోతూనే ఉన్నాయి. చిన్న, మధ్యతరగతి యజమానులు కాటన్, పాలిస్టర్ వంటి ప్రైవేటు ఆర్డర్లు తెచ్చుకుని నడిపిస్తున్నారు. వాటి పెట్టుబడి కోసం చేసిన అప్పులకు తోడు.. ఇప్పుడు బిల్లుల గుదిబండలా మారిందని వస్త్రోత్పత్తిదారులు వాపోతున్నారు.

**ఎందుకీ పరిస్థితి?**

వస్త్ర పరిశ్రమలోని కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించే ఉద్దేశంతో గత ప్రభుత్వం 2016 నుంచి బతుకమ్మ చీరల ఆర్డర్లు ప్రారంభించింది. వీటికితోడు పాఠశాల విద్యాశాఖ, సంక్షేమశాఖల ఆర్డర్లు అన్నీ కలిపి ఏటా సుమారు తొమ్మిది కోట్ల మీటర్ల వస్త్రం ఉత్పత్తి చేయాలి. దీనికి మ్యాక్స్ సంఘాలతో లక్ష్యం చేరుకోలేని పరిస్థితి. అప్పుడు ఆర్డర్లను ఎస్ఎస్ఐ యూనిట్లకు సైతం ఇచ్చేందుకు టెస్కో, చేనేత జౌళిశాఖ నిర్ణయించింది. అలా 2016-17లో జిల్లాలో ఎస్ఎస్ఐ యూనిట్లు



విస్తరిస్తూ 127కు చేరాయి. వీటికి ఆర్డర్లు ఇవ్వడంతో ఉత్పత్తి లక్ష్యం చేరుకోవడం సులభమైంది. కాగా విద్యుత్తు కేటగిరీ.. రాయితీల విషయంలో చేనేత, జౌళిశాఖ, ఇటు సెస్ అధికారులు ఎస్ఎస్ఐ యూనిట్ల యజమానులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. మ్యాక్స్ సంఘాల మాదిరిగానే నాలుగో కేటగిరీలో 50శాతం రాయితీ ఇచ్చారు. మూడో కేటగిరీకి చెందిన ఎస్ఎస్ఐ యూనిట్లకు నాలుగో కేటగిరీ రాయితీ ఇవ్వడాన్ని సెస్ విద్యుత్తు వినియోగదారుల ఫోరం గుర్తించి న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. 2023 మార్చిలో హైకోర్టు తీర్పుతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

**పెరుగుతున్న బకాయిలు**హైకోర్టు తీర్పుతో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ కమిషనర్ ఎస్ఎస్ఐ యూనిట్లకు 50శాతం రాయితీ వర్తించదని ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో జిల్లాలోని 127 యూనిట్ల పరిధిలోని 744 సర్వీసులకు కేటగిరి-3లో యూనిట్కు రూ.7.70 చొప్పున బిల్లులు వేస్తున్నారు. దీంతో 2023 మార్చి - ఏప్రిల్‌లోనే రూ.2034 కోట్ల బిల్లులు వచ్చాయి. దీంతో ఎస్ఎస్ఐ యూనిట్ల యజమానులు 2023 నుంచి అధికారంలోని పెద్దలను నమ్ముకుంటూ వస్తున్నారు. నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఇటు సెస్ సిబ్బంది బిల్లులు నమోదు చేస్తూనే ఉన్నారు. దీంతో ప్రస్తుతం ఆ బకాయిలు మొత్తం రూ.32 కోట్లుకు చేరుకున్నాయి.

# నైపుణ్య శిక్షణ.. భవితకు నిచ్చెన

గంభీరావుపేట : ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిగ్రీ పట్టా ఉన్నంత మాత్రాన ఉద్యోగం వస్తుందనుకోవడం భ్రమే. చాలా సంస్థలు అభ్యర్థుల్లోని నైపుణ్యాలు చూసే అవకాశాలు కల్పిస్తున్నాయి. ఉద్యోగాలకు విపరీతమైన డిమాండ్ పెరగటంతో చదువుతో పాటు నైపుణ్య శిక్షణ అవసరం ఏర్పడింది. దీనిని గుర్తించి గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత అయిదేళ్లుగా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కోర్సులు అందిస్తున్నారు. ప్రస్తుతం కళాశాలలో 900 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. తెలంగాణ అకాడమీ స్కిల్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యంలో కన్వీనర్ జనగామ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ రకాల వృత్తివిద్యా కోర్సుల్లో తర్ఫీదు ఇస్తున్నారు.

**ఒత్తిడి తట్టుకునేలా**

విద్యార్థులు ఒత్తిడిని తట్టుకుని పనిచేసేలా ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. నిపుణులతో అవగాహన కల్పిస్తున్నారు. ఆప్టిట్యూడ్, రీజనింగ్, గణితం సమస్యలను అతి తక్కువ వ్యవధిలో ఎలా పరిష్కరించాలో గణిత నిపుణుల ఆధ్వర్యంలో నేర్పుతున్నారు. ఈ శిక్షణ ఐసెట్‌తో పాటు వివిధ రకాల పోటీ పరీక్షల్లో సత్తా చాటేందుకు ఉపయోగపడుతుందని అధ్యాపకులు చెబుతున్నారు. పలు సంస్థలు ఉద్యోగాల ఎంపిక ప్రక్రియల్లో నిర్వహించే ముఖాముఖిలో చాలామంది చతికిలపడుతున్నారు. ఇలాంటి వారికి ఉపయోగపడేలా



భావవ్యక్తీకరణ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తున్నారు.

**ఉద్యోగాలకు పలువురి ఎంపిక**

టాస్క్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రైవేటు కంపెనీల ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహించగా విప్రో తదితర కంపెనీలతో పాటు కాల్ సెంటర్ ఉద్యోగాలకు సుమారు 50 మందికి పైగా విద్యార్థులు ఎంపికయ్యారు.

**విద్యార్థులకు ఎంతో అవసరం**

విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్య శిక్షణ ఎంతో అవసరం. డిగ్రీ పూర్తయ్యాక వివిధ రంగాల్లో రాణించాలంటే అందుకు తగిన విధంగా సిద్ధం కావాలి. అందుకోసం టాస్క్ ద్వారా విద్యార్థులకు గత అయిదు సంవత్సరాల నుంచి శిక్షణ అందిస్తున్నాం. కళాశాలలోనే పలు కంపెనీలు ఉద్యోగ మేళాలు నిర్వహించడంతో ఇప్పటివరకు పలువురు ఉద్యోగాలు సాధించారు. విజయలక్ష్మి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

**సద్వినియోగం చేసుకుంటున్నారు**టాస్క్ ద్వారా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ అందిస్తున్నాం. విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. స్పోకెన్ ఇంగ్లీష్, ముఖాముఖి, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, భాషా నైపుణ్యం, వేదికపై భయం లేకుండా మాట్లాడటం తదితర అంశాలను వివరిస్తున్నాం. ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో మెరుగైన ఉపాధి లభిస్తుంది. శ్రవణ్‌కుమార్, టాస్క్ కన్వీనర్

# అవగాహనతోనే ఆటిజం దూరం



కరీంనగర్ : పెద్దపల్లి జిల్లాకు చెందిన దంపతులకు మొదటి కాన్పులో బాబు జన్మించాడు. ఏడాది తర్వాత మాటలు సరిగా రాలేదు. కలివిడిగా ఉండకపోయేవాడు. వైద్యులను సంప్రదించగా ఆటిజంతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. జగిత్యాలకు చెందిన దంపతులకు మూడేళ్ల కూతురు ఉంది. ఆమె తోటి పిల్లలతో ఆడకపోయేది. సరిగామాటలు రాలేదు. పరధ్యానంగా కనిపించేది. ఆమె తల్లిదండ్రులు పలువురు వైద్యులను సంప్రదించగా ఆటిజం అని నిర్ధారణ అయింది. కరీంనగర్ జిల్లా ఆసుపత్రికి వచ్చే 100 మంది పిల్లల్లో ముగ్గురు ఈ సమస్యతో వస్తున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) ప్రకారం మన దేశంలో ప్రతి 68 మంది పిల్లల్లో ఒకరు ఆటిజంతో బాధపడుతున్నారు. తల్లిదండ్రులు మేల్కొని సరైన జాగ్రత్తలు తీసుకుంటే దీని నుంచి పిల్లలు త్వరగా బయటపడతారని తెలిపారు. రేపు ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా కథనం.

**లక్షణాలు..**జన్యుపరమైన కారణాలతోపాటు వయసు మీరిన తర్వాత పెళ్లి చేసుకోవడం, మహిళలు గర్భం దాల్చినప్పుడు ఇన్ఫెక్షన్‌కు గురికావడం, తీవ్ర ఉద్వేగాలకు లోనవడం, నెలలు నిండకుండా శిశువు పుట్టడం, తల్లిదండ్రులు సమయం కేటాయించకపోవడం, మొబైల్ తెర ప్రభావం వంటి కారణాలు ఈ వ్యాధికి దోహదమవుతాయి.

మానసిక పరిపక్వత లేకపోవడం, ఒంటరిగా ఉండటం, నేరుగా కళ్లలోకి చూడకపోవడం, సరిగా మాట్లాడకపోవడం, శబ్దాలను పట్టించుకోకపోవడం తదితర లక్షణాలు ఉంటాయి.

**జాగ్రత్తలు..**

ఆరు నెలలపాటు తల్లి పాలు అందివ్వాలి. పెరుగుతున్నప్పుడు అన్ని విటమిన్లు ఉండే పోషకాహారం ఇవ్వాలి. జింక్, ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారాలు ఇవ్వాలి.

పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ ఉండాలి. సాధారణంగా ప్రవర్తించకపోతే వైద్యులను సంప్రదించాలి.

పిల్లలకు మొబైల్, టీవీ తెరలు దూరంగా ఉండేలా చూసుకుంటే అదుపులో పెట్టవచ్చు.

**నెలకు ఇద్దరు, ముగ్గురు..**

సాధారణంగా 16-24 నెలల్లోపు పిల్లలు మాట్లాడాలి. సాధారణ ప్రవర్తన లేకుంటే తల్లిదండ్రులు మా వద్దకు తీసుకొస్తారు. నెలకు ఇద్దరి, ముగ్గురు ఈ సమస్యతో వస్తుంటారు. 20 ప్రశ్నల పత్రాన్ని ఇచ్చి వివరాలు రాబడతాం. నిర్ధారణ అయితే చికిత్స చేస్తాం. తల్లిదండ్రులు మూడేళ్లలోపు పిల్లలకు తగిన సమయం కేటాయించాలి. చికిత్సతో ఆటిజంను నయం చేయొచ్చు.

డాక్టర్ రాజేందర్, పిల్లల వైద్య నిపుణులు

**నిర్లక్ష్యం పనికిరాదు..**

పిల్లల విషయంలో నిర్లక్ష్యం పనికిరాదు. మూడేళ్లలోపే పిల్లలకు స్పర్శను అభివృద్ధి చేయాలి. కంటికి ఇంపైన రంగులు చూపించాలి. వినసొంపైన ధ్వనులు వినిపించాలి. భోజనం పెట్టినప్పుడు పిల్లలకు మొబైల్ చేతికిచ్చి వదిలేయకూడదు. రకరకాల వాసనలు చూపించాలి. మాటలు ఎక్కువగా మాట్లాడేలా చూడాలి. స్నానం చేయించినప్పుడు చర్మంపై ఆయిల్‌తో మసాజ్ చేస్తే మెదడుకు పదును పెరుగుతుంది.

డాక్టర్ పి.కిషన్, మానసిక వైద్య నిపుణులు

# మట్టి దందా ఆగేదెన్నడో?



పెద్దపల్లి : ఇటుక తయారీకి అవసరమయ్యే మట్టి, బూడిద కేంద్రంగా కొంతకాలంగా వివాదాలు చుట్టుముడుతున్నాయి. ఎన్టీపీసీ సంస్థ ఉచితంగా ఇచ్చిన బూడిదకు డబ్బులు వసూలు చేస్తున్నారనే అంశం చుట్టూ వివాదం కొనసాగుతోంది. గతంలో తరలించిన చెరువు మట్టి పరిమితికి మించి వినియోగించారనే అభియోగంపై తాజాగా గనుల శాఖ దర్యాప్తును ముమ్మరం చేసింది.

**అందరి చూపు మట్టిపైనే..**

ఇటుక బట్టీలతోపాటు స్థిరాస్తి వ్యాపారులు, నిర్మాణ రంగంలో మట్టి అవసరం పెరగడంతో ఎక్కడపడితే అక్కడ మట్టి దోపిడీ జరుగుతోంది. మట్టి తరలింపు ప్రక్రియలో అనుమతి పొందిన బట్టీ నిర్వాహకులు సంబంధిత గ్రామంలోని చెరువు నుంచి మట్టిని తీసుకురావడానికి గ్రామ స్థాయి నాయకులను ప్రసన్నం చేసుకోవడంతోనే రాజకీయాలు మొదలవుతున్నాయి. మట్టి తరలించే ప్రక్రియలో కూడా యాజమాన్యం నిబంధనలను పట్టించుకోవడం లేదు. చెరువులో మీటరు లోతుకు మించి మట్టి తీయొద్దనే నిబంధన పాటించకపోవడం, పరిమితికి మించి మట్టిని తరలించడం కూడా వివాదానికి కారణమవుతోంది.

2023 వేసవిలో కొత్తపల్లి చెరువు నుంచి అనుమతించిన పరిమాణం కంటే ఎక్కువ మట్టిని తీశారనే అభియోగంతో మైనింగ్ అధికారులు విచారణ చేపట్టారు. ఈ పరిస్థితి కేవలం కొత్తపల్లికే పరిమితం కాలేదు కానీ.. అక్కడ వివాదం ఏర్పడడంతోనే అక్రమ దోపిడీ వెలుగులోకి వచ్చింది. పెద్దపల్లితోపాటు మంథని, కమాన్‌పూర్, సుల్తానాబాద్, పాలకుర్తి, అంతర్గాం మండలంలో కూడా నెలకొంది. గతేడాది ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ ప్రాంతం నుంచి భారీగా తరలించారు.

స్థిరాస్తి వ్యాపారులు, నిర్మాణ రంగానికి అవసరమైన వారు గుట్టలు, వాగుల చుట్టూ తిరుగుతున్నారు. వీరి తాకిడికి జిల్లాలోని పలు గుట్టలు బక్కచిక్కిపోతున్నాయి.

హుస్సేన్‌మియా వాగులోని ఇసుకను తస్కరించిన అక్రమార్కులు.. ఇసుక కింది మట్టిని కూడా వదలడం లేదు. ఇటీవల పాలకుర్తి మండలం కన్నాల గుట్ట నుంచి మట్టిని తరలించడం వివాదాస్పదం కావడంతో అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మట్టి దందాపై మైనింగ్ ఏడీ శ్రీనివాస్‌ను సంప్రదించగా.. అనుమతి లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీచోట అవసరమైన నిఘా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

**దృష్టి పెట్టాల్సిన సమయమిదే..**

వేసవి వచ్చిందంటే బట్టీలతోపాటు స్థిరాస్తి వ్యాపారానికి మట్టి అవసరం పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో అనుమతులివ్వడంతోపాటు తరలింపుపై నిఘా పెట్టాల్సి ఉంది. లేదంటే మట్టికుప్పలు, చెరువు గుంతల కొలతలు తీసుకొని జరిమానాల కోసం నిర్వాహకుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. గతేడాది విధించిన జరిమానా కూడా ఇప్పటికీ సదరు అక్రమార్కులు చెల్లించకపోవడంతో ప్రభుత్వం సైతం వారికి వన్‌టైం సెటిల్‌మెంట్ ఆఫర్ ఇచ్చే స్థాయికి వచ్చింది. పరిస్థితిని చక్కదిద్దేందుకు అధికారులు నిబద్ధతతో నిఘా పెంచాల్సి ఉంది.

# అడుగంటుతున్న జలం..అల్లాడుతున్న జనం

ఎల్లారెడ్డిపేట : నడి వేసవికి ముందే పల్లెల్లో తాగునీటి కటకట నెలకొంది. భూగర్భజలాలు అడుగంటి పోతుండటంతో గుక్కెడు నీటి కోసం జనం అల్లాడుతున్నారు. గొంతు తడుపుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. పొద్దంతా పనులు వదిలిపెట్టుకుని బిందెడు నీటి కోసం వ్యవసాయ క్షేత్రాల వెంట పరుగులు పెడుతున్నారు. సహనం కోల్పోయి నిరసనకు దిగుతున్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో తాగునీటి ఎద్దడి గ్రామాల్లో తీవ్రమవుతోంది.

**నిర్వహణ అధ్వానం**

ఎల్లారెడ్డిపేట మండలంలోని 26 గ్రామాల్లో 46270 జనాభా ఉంది. సుమారు 39 ఓహెచ్ఎస్ఆర్, మూడు జీఎల్ఎస్ఆర్ ట్యాంకులు ప్రజల దాహార్తిని తీర్చుతున్నాయి. భూగర్భజల మట్టాలు పాతాళానికి చేరుతుండటంతో బావులు, గొట్టపు బావుల్లో నీరు తగ్గి ట్యాంకులకు నీరందడం లేదు. కొన్ని గ్రామాల్లో మూడునాలుగు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజు 500 నుంచి నాలుగు లీటర్ల శుద్ధజలాన్ని అందించే కేంద్రాలు గ్రామాల్లో ఉన్నా వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మండలంలోని మారుమూల గిరిజన తండాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. గుండారం, తిమ్మాపూర్, రాజన్నపేట, కిష్టునాయక్‌తండా తదితర గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లో అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ఏ మూలకూ సరిపోవడం లేదని గిరిజన తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదు రోజులకోసారి అరకొరగా నీటిని వదులుతున్నారని వాపోతున్నారు. గొంతు తడుపుకోవడంతోపాటు ఇతరత్రా అవసరాలకు నీరు లేక అల్లాడుతున్నామని చెబుతున్నారు.

**అలంకార ప్రాయంగా ట్యాంకులు**

ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో గతంలో ఓహెచ్ఎస్ఆర్, సిస్టర్న్‌లను విరివిగా నిర్మించారు. ఇళ్లకు నేరుగా అందాల్సిన మిషన్ భగీరథ నీటితోపాటు గ్రామాల్లోని బోరుబావుల నుంచి వచ్చే నీటిని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల్లోకి చేర్చుతున్నారు. ప్రస్తుతం మిషన్ భగీరథ నీరు సరిపడా రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకులకు నీరందించే మంచినీటి బావులు, బోర్లు సైతం వట్టిపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో అలంకారప్రాయంగా మారుతున్నాయి. జనాభా ప్రాతిపదికన ఒక్కో వ్యక్తికి రోజుకు 25 లీటర్ల చొప్పున సరఫరా చేయాల్సి ఉంటుంది. గతంలో అమర్చిన చేతిపంపులు ఎక్కడా కనిపించడం లేదు. తాత్కాలికంగా అమర్చిన సింగిల్‌ఫేజ్ మోటార్లు నీరు లేక మొండికేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో అవి పనిచేయక పోవడంతో మరమ్మతుల్లో తీవ్ర జాప్యం నెలకొంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తాగునీటి ఇబ్బందులను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య తలెత్తకుండా ప్రణాళిక

మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుగానే ప్రణాళిక రూపొందించాం. బండలింగంపల్లి, దుమాల, రాచర్ల గొల్లపల్లి, గుండారం, కిష్టునాయక్‌తండాల్లో నీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. ఓపెన్‌వెల్ మోటార్లు, బోరుబావుల తవ్వకం, పైపులైన్ ఏర్పాటు, వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవడం వంటి చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తినా వెంటనే స్పందించి, చర్యలు తీసుకుంటాం. జోగం రాజు, ఎంపీవో, ఎల్లారెడ్డిపేట

# ఉత్పత్తి.. సంతృప్తి.. 'అంతంతే!'

కొత్తగూడెం : బొగ్గు ఉత్పత్తి సంవత్సరం ఏడు గంటలతో 2024-25 పూర్తికానుంది. షిఫ్ట్ కార్మికులు మంగళవారం ఉదయం గనుల నుంచి బయటకు రానున్నారు. రాత్రి షిఫ్టులో ఉత్పత్తి అయిన బొగ్గును నాటి ఉత్పత్తిగానే చూపనున్నారు.

**లక్ష్యాన్ని సాధించిన నాలుగు ఏరియాలు**

సింగరేణిలో మొత్తం నాలుగు ఏరియాలు 2024-25 ఆర్థిక సంవత్సరం లక్ష్యాన్ని సాధించగా అందులో రెండు భద్రాద్రి జిల్లావే కావడం గమనార్హం. ఇల్లెందు ఏరియా 104శాతం, మణుగూరు ఏరియా నూరుశాతం ఉత్పత్తిలో లక్ష్యాన్ని సాధించాయి. కొత్తగూడెం ఏరియాలో సమయానికి ప్రారంభంకాని కొత్తగని (వీకేఓసీ)కారణంగా



96శాతానికి పరిమితమైంది. రామగుండం-3 ఏరియా 104శాతం, రామగుండం-1 ఏరియా నూరుశాతం లక్ష్యాన్ని సాధించగా.. రామగుండం-2 ఏరియా 99శాతం లక్ష్యాన్ని చేరుకుంది. బెల్లంపల్లి ఏరియా 97శాతం, శ్రీరాంపూర్ ఏరియా 92శాతం, అడ్రియాల 79శాతం, మందమర్రి ఏరియా 78శాతం, భూపాలపల్లి ఏరియా 75శాతం లక్ష్యాన్ని సాధించాయి.

**ఈసారి విఫలం..**

వార్షిక లక్ష్యాన్ని సాధించడంలో సింగరేణి ఈసారి విఫలమైంది. నాలుగు గనులు ప్రారంభానికి నోచుకోని కారణంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ 96శాతం ఉత్పత్తితో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. వచ్చే ఏడాది వీకే ఉపరితలగని, రొంపేడు ఓసీ, నైనీ బ్లాకు ప్రారంభం అవుతున్నందున 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంతృప్తికరమైన బొగును ఉత్పత్తి చేస్తామని డైరెక్టర్ (ఆపరేషన్స్) సూర్యనారాయణ తెలిపారు.

# నీరు పారకుండానే.. శిథిలమై

మెదక్ జిల్లా మాసాయిపేట మండలం హకీంపేట పరిధిలో హల్దీ వాగుపై 46 ఏళ్ల క్రితం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారు. ఉమ్మడి వెల్దుర్తి, చిన్నశంకరంపేట మండలాల వాసులకు ఉపయోగపడేలా, రూ.1.50 కోట్ల అంచనాతో పనులు చేపట్టగా, 2,900 ఎకరాలకు సాగునీరు అందిస్తామని అప్పట్లో పాలకులు, అధికారులు ప్రకటించారు. ప్రధాన ఆనకట్టను 1985లో పూర్తిచేయగా, 1987 వరకు ప్రధాన కుడి, ఎడమ కాలువలు, వాటిపై నిర్మాణాలు పూర్తిచేశారు. ఇంతవరకు బాగానే ఉన్న కుడి, ఎడమ కాలువలు ఎత్తుపల్లాలుగా ఉండటం, ఎలుకపల్లి వద్ద కుమ్మరివాగుపై ఎడమ పైకాలువ, సూరారం మత్తడి పైకాలువ నిర్మాణాలు నాసిగా సాగడంతో నీరు సాఫీగా పారలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు కుడి కాలువ ద్వారా ధరిపల్లి, ఎడుమ కాలువ ద్వారా శేరిల గ్రామం దాటి నీరు



చివరి ఆయకట్టుకు చేరకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఈ రెండూ అధ్వానంగా మారాయి. కుడి, ఎడమ కాలువలు, కుమ్మరి వాగుపై ఎడమ పైకాలువ, సూరారం మత్తడి కాలువపై కుడి పైకాలువ పునర్నిర్మాణం, శిథిలమైన కాట్ బ్రిడ్జిలు, తూముల మరమ్మతులు, ప్రధాన ఆనకట్ట మరమ్మతులకు రూ.27 కోట్లు మంజూరు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులు పదేళ్లుగా ప్రతిపాదిస్తున్నా ఇంతవరకు మోక్షం దక్కలేదు. ఇకనైనా నిధులు మంజూరు చేసి హల్దీ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

# 'ట్రామా' ఏర్పాటుతోనే ధీమా

కొత్తగూడెం: రోడ్డు ప్రమాదాలు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అనేక కుటుంబాలకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నాయి. అత్యవసర వైద్యం అందుబాటులో లేక ఏటా వందలాది మంది మృతిచెందుతుండగా.. మరెందరో క్షతగాత్రులవుతున్నారు. ఈనేపథ్యంలో ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించటమే కాకుండా.. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేయవచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రంలో 'ట్రామా' సెంటర్ల ఏర్పాటుకు అడుగులు పడినా వాటిని పూర్తిచేయటంలో జాప్యం నెలకొంటోంది. రాష్ట్రవ్యాప్తంగా 90 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటుచేయాలని వైద్యారోగ్యశాఖ నిర్ణయించటంతో ఉభయ జిల్లాల్లో మరికొన్నిచోట్ల వీటిని నెలకొల్పాలనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

**ఎక్కడెక్కడ అవసరం అంటే..**

ఖమ్మం జిల్లాలో ఇప్పటికే కూసుమంచిలో 'ట్రామా' సెంటర్ ఏర్పాటుకు స్థలం సేకరించారు. వైరా సీహెచ్‌సీని ట్రామా కేర్ సెంటర్‌గా మార్చగలిగితే జిల్లా నలుమూలల నుంచి క్షతగాత్రులను ఇక్కడికి త్వరగా తరలించేందుకు అవకాశముంటుంది. సత్తుపల్లిలో ఉపరితల బొగ్గుగనులు ఉండటంతో వాహనాల రద్దీ వల్ల ప్రమాదాలు అధికమవుతున్నాయి. సత్తుపల్లిలోనూ మరో 'ట్రామా' సెంటర్ ఏర్పాటుచేయాల్సిన అవసరముంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రంలో ట్రామా కేర్ సెంటర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటిని త్వరితగతిన పూర్తిచేయటంతో పాటు ఇల్లెందు, భద్రాచలం, మణుగూరులో 'ట్రామా' సెంటర్లు ఏర్పాటుచేస్తే క్షతగాత్రులకు సత్వర వైద్యసేవలందుతాయి. కొత్తగూడెం-ఇల్లెందు, సారపాక-మణుగూరు మధ్య ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

**ఆవశ్యకత**

ప్రమాదం జరిగిన మొదటి గంట(గోల్డెన్ అవర్)లో సరైన వైద్యమందిస్తే ప్రాణాపాయ స్థితిలోని వ్యక్తి బతికే అవకాశాలు మెరుగుపడతాయి.

రోడ్డు ప్రమాదాలు, పారిశ్రామిక దుర్ఘటనలు, గృహప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మృతులు, క్షతగాత్రుల సంఖ్య అదేస్థాయిలో ఉంటోంది. ఇటువంటి పరిస్థితుల్లో 'ట్రామా' సెంటర్లు లేకపోతే ప్రాణనష్టం, శాశ్వత అంగవైకల్యం కేసులు ఎక్కువవుతాయి.

సాధారణ ఆసుపత్రులు లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తీవ్రమైన గాయాలు, బహుళ అవయవ వైఫల్యం, రక్తస్రావం వంటి అత్యవసర పరిస్థితులను సమర్థంగా నిర్వహించలేవు. 'ట్రామా' సెంటర్లలో అత్యాధునిక పరికరాలు, నైపుణ్యం కలిగిన వైద్యులు ఉంటారు.

తల, వెన్నెముక దెబ్బతినటం, కాలిన శరీరం వంటి ప్రత్యేక సందర్భాల్లో సాధారణ వైద్యం సరిపోదు.

చురకలు



# మణిహారం.. మరింత భారం

హైదరాబాద్: భాగ్యనగరానికి మణిహారమైన బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్) మొత్తం 158 కిలోమీటర్లు విస్తరించి ఉంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఎనిమిది లైన్లతో ఎక్స్‌ప్రెస్‌వేని నిర్మించారు. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఓఆర్ఆర్‌ని రూపొందించారు. ఇటీవల దీన్ని గంటకు 120 కిలోమీటర్లకు పెంచారు. మొత్తం 19 ఎగ్జిట్లు/ఇంటర్‌ఛేంజ్‌లు ఉన్నాయి. హైదరాబాద్ నుంచి అటు విజయవాడకు, ఇటు వరంగల్‌కి సులభతర అనుసంధానంతో నగరవాసులకు ఎంతోగానో సౌలభ్యంగా ఉంటుంది. రోజుకు సుమారు 1.5 లక్షల వాహనాలు ఓఆర్ఆర్‌పై దూసుకెళుతుంటాయి. హెచ్ఎండీఏ పరిధిలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్



లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) నిర్వహణలోని ఓఆర్ఆర్‌ని 30 ఏళ్ల లీజుకు ఐఆర్‌బీ సంస్థ 2023లో తీసుకుంది.

**ఐదేళ్లలో గణనీయ పెరుగుదల..** ప్రయాణం పరంగా చూసుకుంటే అంతా సౌలభ్యంగానే ఉన్నా.. ఏటా పెరిగే టోల్‌ఛార్జీల వల్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయిదేళ్లలో పరిశీలిస్తే టోల్‌ఛార్జీల మోత గణనీయంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. కారుకి ఐదేళ్లలో కిలోమీటర్‌కి 52 పైసలు పెరిగింది. బస్సుకు కిలోమీటర్‌కి రూపాయి యాభై పైసలు పెరిగింది. కిలోమీటర్ల చొప్పున చూస్తే మామూలుగానే అనిపించినా ఎక్కువ దూరం ప్రయాణించే వారిపై అధిక భారం పడుతుంది.

# కొలువుతో దారి చూపి.. భవితకు బాటలు వేసి

హైదరాబాద్: ఇంజినీరింగ్, ఫార్మా, నిర్మాణ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో జేఎన్‌టీయూ, ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారులు.. ప్రాంగణ నియామకాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. 'ప్రీ-క్యాంపస్ ఇంటర్వ్యూ' పేరిట ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే బహుళజాతి సంస్థలు, ఫార్మా కంపెనీలు రెండు విశ్వవిద్యాలయాల్లోని నియామకాల విభాగం అధికారులను సంప్రదిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం ఉస్మానియాలో హెటిరో ల్యాబ్స్, జేఎన్‌టీయూలో వేదాంత లిమిటెడ్ ప్రాంగణ నియామకాలు చేపట్టాయి. మరో రెండు, మూడు నెలల పాటు నియామకాలు కొనసాగే అవకాశాలున్నాయని ఆయా వర్సిటీ వర్గాలు తెలిపాయి.

**విభాగాల వారీగా ఇలా..**



బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందుతున్నవారిలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌తో పాటు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల వారున్నారు. జేఎన్‌టీయూ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల్లో నాలుగో సంవత్సరం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థుల్లో 70 శాతం మందికి ట్రైనీ ఇంజినీర్లు, ఇంటర్న్‌షిప్‌లు లభించాయి ఎలక్ట్రానిక్స్‌లో 50, సివిల్‌లో 38, మెకానికల్‌లో 32, ఎలక్ట్రికల్‌లో 35 శాతం మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందాయి. జేఎన్‌టీయూలో గతేడాది 562 మంది క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 446 మందికి ఉద్యోగాలు లభించాయి.

**రూ.10-25 లక్షల వార్షిక వేతనాలు**

ఉస్మానియా, జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయాల్లో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వార్షిక వేతనాలు లభిస్తున్నాయి. ఈ వేతనాలు విద్యార్థుల ప్రతిభ, బహుళజాతి సంస్థల అవసరాల ఆధారంగా ఉంటున్నాయి. జేఎన్‌టీయూలో ఓ విద్యార్థినికి రూ.52 లక్షల ప్యాకేజీ, ఓయూలో ఇద్దరు విద్యార్థులకు రూ.26 లక్షల వార్షిక వేతనం లభించింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో మరిన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలు, ఏఐ సిటీ ఏర్పాటు అవుతున్నందున భవిష్యత్తులో ఐటీ, నిర్మాణ, ఆటోమొబైల్ సంస్థలు ప్రాంగణ నియామకాలకు ముందుకొస్తాయని ఆయా వర్సిటీల అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మారుతారా.. మార్చమంటారా !

హైదరాబాద్: ప్రముఖుల పర్యటనలు.. ఉన్నతాధికారుల తనిఖీల సమయంలోనే రోడ్లపై దర్శనమిస్తారు. మిగిలిన సమయాల్లో వాహనాలు బారులు తీరినా.. రద్దీ సమస్య తలెత్తినా కొందరు ట్రాఫిక్ పోలీసులు కన్నెత్తిచూడటం లేదు. నగర ట్రాఫిక్ విభాగంలో కొందరు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు రావటంతో దిద్దుబాటు చర్యలకు సిద్ధమయ్యారు. ఈ జాబితాలో నలుగురు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, కొందరు ఎస్సైలు ఉన్నట్టు తెలుస్తోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండాలని నగర కొత్వాల్ సీవీ ఆనంద్ పలుమార్లు ఆదేశించారు. పెడచెవిన పెట్టిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు ఛార్జిమెమోలు జారీచేశారు. మధ్యమండలం పరిధిలో ఓ సీఐపై సస్పెన్షన్ వేటు వేశారు. తూర్పు మండలంలో మరో ఇన్‌స్పెక్టర్ ఫుట్‌పాత్‌లపై ఉన్న టిఫిన్ సెంటర్ల నుంచి స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లను ఇంటికి చేరవేసినట్లు సమాచారం. ట్రాఫిక్ ఠాణాకు బహూకరించిన వంటసామగ్రిని సొంత అవసరాలకు వాడుకోవటం సిబ్బందిలో చర్చనీయాంశంగా మారింది. ఉత్తరమండలంలో ఓ సీఐపై ఆరోపణలున్నాయి. మధ్యమండలంలో ఇన్‌స్పెక్టర్ నెలవారీ వసూళ్లకు ఇద్దరు కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసుకున్నారని సమాచారం.

**అలుసు.. నోటి దురుసు** పశ్చిమమండలం పరిధిలో ఇద్దరు ఎస్సైలు వాహనదారులతో తరచూ గొడవ పడుతున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. నగరంలో ప్రధాన వ్యాపార ప్రాంతం కావటంతో అక్కడ నిలిపిన వాహనదారుల పట్ల ఓ ఎస్సై నోటిదురుసు ప్రదర్శిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. మధ్యమండలం పరిధిలో ఒక ఎస్సై రాత్రిళ్లు వ్యాపారం చేసుకునేందుకు అనుమతులు మంజూరు చేస్తానంటూ వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. మరో ఇన్‌స్పెక్టర్ మహిళా సిబ్బంది పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఇబ్బంది పెట్టినట్లు తెలిసింది.

# పురపాలికల్లో విలీనం.. ఉపాధికి దూరం!



వికారాబాద్ : జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ పురపాలికల్లో సమీప గ్రామాలను విలీనం చేశారు. ఈ క్రమంలో అక్కడ అమలు చేస్తున్న 'ఉపాధి' పథకాన్ని అమలు చేయడం లేదు. వికారాబాద్ పురపాలికలో కొంపల్లి, గిరిగిట్‌పల్లి, ధన్నారం, మద్గుల్‌చిట్టెంపల్లి, బూర్గుపల్లి, గుడుపల్లి పంచాయతీలతో పాటు జాంబాపూర్ తండా, బూర్గుపల్లితండా, ధన్నారం తండా, మద్గుల్ చిట్టెంపల్లి తండాలను విలీనం చేశారు. పరిగి పురపాలికలో రుకుంపల్లి, నస్కల్, సయ్యద్ మల్కాపూర్, నజీరాబాద్ పంచాయతీలను విలీనం చేశారు. తాండూరు మున్సిపాలిటీలో సుమారుగా 10 గ్రామాలను విలీనం చేశారు. ఆయా గ్రామాల్లో జాబ్ కార్డులున్నవారు పథకానికి దూరమయ్యారు. దీంతో వారంతా ఇతర పనులకు వెళ్తున్నారు.

**ప్రత్యామ్నాయం దిశగా:** విలీనమైన పల్లెల్లో ప్రత్యామ్నాయంగా వేరే పథకం అమలు చేసేందుకు ఆలోచిస్తున్నామని ఇటీవల అసెంబ్లీలో మంత్రి సీతక్క వెల్లడించారు. ఇది మంచి పరిణామమని 2019లో కొత్తగా ఏర్పాటైన పురపాలిక సంఘాలు, వాటిలో విలీనమైన గ్రామాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 588 గ్రామాల్లో ఉపాధి పథకం అమలు చేస్తున్నారు. 1,32,578 జాబ్‌కార్డులు, 2,45,421 మంది కూలీలు నమోదయ్యారు. **20 వేల మంది..** నాలుగు పురపాలికల పరిధిలో విలీనమైన 20 గ్రామాల్లో సుమారుగా 20 వేల మంది కూలీలు పథకానికి దూరమయ్యారు. ప్రతి గ్రామంలో సగటున వెయ్యి మందికి పని లభించేది. కూలీకి రోజుకు రూ.300 చెల్లిస్తున్నారు. 100 రోజుల పని చేస్తే సులువుగా ఒక్క కూలీ రూ.30 వేలు సంపాదించేవారు. అంతే కాకుండా 100 రోజులు పని చేసిన కుటుంబాల పిల్లలకు ప్రభుత్వం ఉన్నతి పథకంలో ఉపకార వేతనాలు అందజేస్తారు.

పథకాన్ని అమలు చేయాలి..– గోపాల్, తాజా మాజీ కౌన్సిలర్

వికారాబాద్ పురపాలికలో విలీనం చేసిన మద్గుల్‌చిట్టెంపల్లిలో ఉపాధి పథకాన్ని అమలు చేయాలి. గ్రామ జనాభా నాలుగు వేల వరకు ఉంది. వీరిలో 2 వేల మంది నిరుపేదలే. గతంలో వీరికి పనులు చేసేందుకు అవకాశం ఇచ్చేవారు. పురపాలికలో విలీనంతో ఈ అవకాశం లేకుండా పోయింది. ఎండా కాలం పనులు లేక ఇబ్బంది పడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ ప్రారంభించాలి..– మహిపాల్, సీపీఎం కార్యదర్శిజిల్లా పూర్తిగా గ్రామీణ ప్రాంతం. నిరుపేదలే అధికం. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని పట్టణాల్లో పథకాన్ని అమలు చేయాలి. లేదంటే విలీనమైన గ్రామాల వారికి అవకాశం కల్పించాలి. ఈ సమస్యను గతంలో ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చాం.

# ఇసుక అక్రమ రవాణాకు చెల్లు



కరీంనగర్ : నిర్మాణ రంగంలో ఇసుక కీలకమైంది. దీనిని కొందరు అక్రమంగా రవాణా చేస్తూ లక్షలు గడించడంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది. వీరు అధిక ధరలకు విక్రయించడంతో వినియోగదారుడిపై భారం పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పాలసీలో సంస్కరణలు తేవడంతోపాటు అవసరమైన సరకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. ఇలా చేయడంతో సర్కారు ఖజానాకు నిధులు పెరుగుతాయి. కొత్త పాలసీతో సులభంగా ఇసుక లభించే వీలుంటుంది.

**తప్పనున్న ఇబ్బందులు..**

ప్రస్తుతం పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో శాండ్‌టాక్స్ (మన ఇసుక మన వాహనం) పాలసీ అమలవుతోంది. ఇసుక కావాల్సిన వారు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకొని అందుకు సంబంధించిన డబ్బులు కూడా చెల్లించాల్సి ఉంటుంది. కావాల్సిన చోటకు సరఫరా చేస్తారు. కానీ ఇందులో కేవలం రిజిస్టర్ చేసుకున్న ట్రాక్టర్ల ద్వారా మాత్రమే రవాణాకు అవకాశముంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద నిర్మాణాలు, ప్రాజెక్టులు, ప్రభుత్వ, ప్రైవేట్‌కు సంబంధించిన భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. రీచ్‌లు ప్రారంభం కాకపోవడంతో ఇసుక లభ్యత అనుకున్న స్థాయిలో లేదు. ఎవరైనా ఇంటిని నిర్మించుకోవాలనుకున్నప్పుడే, లేదా మరమ్మతు సమయంలో ఇసుక దొరకడం ఇబ్బందిగా ఉండేది. ఈ విధానంతో ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించి తెచ్చుకోవచ్చు.

శాండ్‌బజార్ అమల్లోకి వస్తే ఇసుక అందుబాటులోకి రావడంతోపాటు బల్క్‌గా టిప్పర్లు, లారీల ద్వారా కూడా తరలించవచ్చు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. రీచ్‌లు, స్టాక్ యార్డుల నుంచి శాండ్‌బజార్‌కు తరలిస్తారు.

**ఉమ్మడి జిల్లాలో..**

ప్రభుత్వ పాలసీలో భాగంగా ఇప్పటికే హైదరాబాద్ పరిధిలో దీనిని అందుబాటులోకి తెచ్చింది. దొడ్డు ఇసుక టన్నుకు రూ.1600, సన్న ఇసుకను రూ.1800కు విక్రయించాలని నిర్ణయించారు. దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అక్కడ వచ్చే ఫలితాలను బట్టి దశల వారీగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరిస్తారు. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రాలతోపాటు ప్రధాన పట్టణాల్లో వీటిని ఏర్పాటు చేసే అవకాశముంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో అధికారిక రీచ్‌లు ఎక్కడ కూడా నడవడం లేదు.

# అందని ద్రాక్షగానే కార్డియాలజీ సేవలు



గోదావరిఖని : ఖనిలోని ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థులతో ఫొటోలు దిగుతుండగా కుప్పకూలారు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గుండెవ్యాధి నిపుణులు లేకపోవడంతో ప్రాథమిక చికిత్స అందిస్తుండగానే కన్నుమూశారు.

విఠల్‌నగర్‌కు చెందిన మహిళ ఇంట్లో పనిచేసుకుంటూ కుప్పకూలారు. కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. మరో యువకుడు సైతం స్థానికంగా చికిత్స అందకపోవడంతో కరీంనగర్ తరలిస్తుండగా మృతి చెందారు.రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గుండెపోటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రత్యేక చికిత్సకు కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృత్యువాత పడుతున్నారు. గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో కార్డియాలజీ, యూరాలజీ, న్యూరాలజీ తదితర విభాగాల్లో సేవలు అందుబాటులో లేవు. ఆయా విభాగాల్లో వైద్య కళాశాలలో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు మంజూరైనా.. విధుల్లో చేరేందుకు వెనకడుగు వేస్తున్నారు. యూరాలజీలో ఒక్కరే చేరగా వారంలో రెండు రోజులు మాత్రమే సేవలందిస్తున్నారు. క్రిటికల్ కేసులకు కూడా జనరల్ ఫిజిషియన్లు, సర్జన్లు సేవలందించాల్సిన పరిస్థితి నెలకొంది. కార్డియాలజీ పరీక్షలు అందుబాటులో లేక గుండెపోటు బాధితులు ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి ఉంది.

**ప్రైవేటు దవాఖానాల్లో కరవే**


వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఖనిలో ప్రభుత్వాస్పత్రిలో క్యాథలాబ్ ఏర్పాటుతోపాటు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతూ లేఖలు రాశారు. ప్రస్తుతం ఆసుపత్రిలో కేవలం ఈసీజీ మాత్రమే అందుబాటులో ఉంది. ఇటీవల ఓ ప్రైవేటు రేడియోగ్రాఫర్‌తో నిర్ణీత రుసుంతో 2డీ ఎకో పరీక్షలు చేయిస్తున్నారు. అయితే కార్డియాలజిస్టు లేకపోవడంతో సరైన చికిత్స అందడం లేదు. ప్రైవేటు దవాఖానాల్లోనూ కార్డియాలజీ వైద్యులు లేకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్తున్నారు.

**క్యాథలాబ్ ఏర్పాటు చేయాలి**

సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. ప్రభుత్వ వైద్య కళాశాలతో పీజీ కోర్సుల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. జాతీయ వైద్య కమిషన్ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి చెందితే అనుమతి లభించే అవకాశముంది. క్యాథలాబ్ ఏర్పాటుతో పాటు కార్డియాలజీ వైద్యుల నియామకంపై శ్రద్ధ వహించాలని స్థానికులు కోరుతున్నారు.

# రూ.2వేల కోట్లు దాటిన ఆస్తిపన్ను

హైదరాబాద్: ఆస్తిపన్ను వసూళ్ల రూపంలో జీహెచ్ఎంసీకి రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. సోమవారంతో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియగా, రాత్రి 6గంటల సమయానికి 2012.36కోట్ల ఆదాయం వచ్చినట్లు కమిషనర్ ఇలంబర్తి ప్రకటించారు. బల్దియా చరిత్రలో మొదటిసారి పన్ను ఆదాయం రూ.2వేల కోట్లు దాటినట్లు తెలిపారు. అదనపు కమిషనర్ అనురాగ్ జయంత్, చీఫ్ వ్యాల్యుయేషన్ అధికారి(సీవీఓ) కులకర్ణి, జోనల్ కమిషనర్లు, ఉపకమిషనర్లు, సిబ్బంది కృషితో అధిక వసూళ్లు అయ్యాయని, ఈ ఏడాది 14లక్షలకుపైగా యజమానులు పన్ను చెల్లించినట్లు పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పాత బకాయిలపై 90శాతం వడ్డీ రాయితీ ఇస్తూ ఓటీఎస్‌ను ప్రకటించడంతో.. ఆ రూపంలో




బల్దియాకు రూ.465కోట్లు సమకూరడం గమనార్హం. చివరి రోజే రూ.115కోట్ల పన్ను వసూలైంది.

**5 శాతం రాయితీ ప్రకటిస్తూ ఉత్తర్వు**

గ్రేటర్‌లో ఆస్తిపన్నుపై 5శాతం రాయితీని ప్రకటిస్తూ సోమవారం జీహెచ్ఎంసీ ఉత్తర్వు జారీ చేసింది. మంగళవారం నుంచి ఇది అమల్లోకి రానుంది. ఏప్రిల్ నెలాఖరుతో ముగుస్తుంది. 2025-26 ఆర్థిక సంవత్సరం పన్నును ఏప్రిల్‌లో చెల్లించే వారికి ఈ రాయితీ వర్తిస్తుందని కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. గతేడాది రూ.1,917 కోట్లు వసూలవ్వగా.. కేవలం ఏర్లీబర్డ్‌లోనే రూ.830 కోట్లు వచ్చింది. ఈసారి రూ.900 కోట్లు వసూలవుతుందని అధికారుల అంచనా.

# ఇలా అయితే ఎలా?

భద్రాచలం : దశరథ మహారాజు, కౌసల్య దంపతుల జ్యేష్ఠ కుమారుడు రామయ్య వరుడు. ఈయన జగాలను ఏలిన జగన్నాథుడు. జనక మహారాజు, సునైన దంపతుల గారాల పుత్రిక సీతమ్మ వధువు. ఈమె యుగయుగాల నుంచి జగన్మాతగా కీర్తిగాంచారు. వీరిద్దరి కల్యాణం లోకకల్యాణం. ఈ మహత్కార్యానికి విశ్వావసు నామ సంవత్సరం చైత్రశుద్ధ నవమి ఆదివారం ఉదయం (6న) 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు అభిజిత్ లగ్నంలో ముహూర్తం ఖరారైంది. భద్రాచలం రామాలయంలో జరిగే ఈ వేడుకకు ముహూర్తం ముందే నిర్ణయించగా అన్నిశాఖలు కలిపి సుమారు రూ.3కోట్లతో ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇవి ఇంకా కొలిక్కి రాలేదు. కల్యాణ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేసినప్పటికీ చలువ పందిళ్ల నిర్మాణ పనులు నత్తను తలపిస్తున్నాయి. గోదావరి వద్ద భక్తులకు నిలువ నీడ లేక ఎండతో ఇబ్బందులు పడుతున్నారు.

ఆగిన 'ప్రసాద్' పనులు

కల్యాణ మండపం గ్యాలరీలో 15వేల మందికి ఉచిత ప్రవేశం ఉంది. ఇదే క్రమంలో టికెట్లు కొనుగోలు చేసిన వారితో పాటు వీవీఐపీలు కలిపి 18వేల మంది 24 సెక్టార్లలో కూర్చుంటారు. సెక్టార్లు గల



ప్రాంగణంలో ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ ఆగ్యుమెంటేషన్ డ్రైవ్) పథకం పనులు పూర్తికాలేదు. అడుగున్నర ఎత్తులో భూమిపైకి సిమెంట్ దిమ్మెలు నిర్మించి వదిలేశారు. సెక్టార్ల రూపకల్పనకు పూనుకున్నందున భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. టికెట్లను కొని వీటికి సమీపంలో కూర్చున్న వారికి కల్యాణ క్రతువు కనిపించకపోతే దిమ్మెలపై ప్రమాదకరంగా కూర్చునే అవకాశం ఉంటుంది.

దృష్టి సారించాల్సిన అంశాలు

ఏప్రిల్ 5న ఎదుర్కోలు, 6న కల్యాణం, 7న మహాపట్టాభిషేకం వేడుకలకు విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చే ఆస్కారముంది. నీరు, మజ్జిగ, నీడ, ట్రాఫిక్, రవాణా, పార్కింగ్, బందోబస్తు, క్యూలైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఇది నడి వేసవిలో జరిగే ఉత్సవం కావటంతో అత్యవసర ఔషధాలు, అంబులెన్స్‌లతో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి. వసతి కోసం లాడ్జీ గదుల అద్దె వివరాలతో పాటు హోటళ్లలో ఆహార పదార్థాల ధరలు వెల్లడించాలి. తూనికలు కొలతల శాఖ అధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు నిర్వహించి భక్తులకు భరోసా కల్పించాలి.రామాలయం ఆధ్వర్యంలోని అన్నదాన సత్రంలో రోజుకు 2వేల మంది భోజనం చేస్తున్నారు. సీట్లలో కూర్చున్నవారు తిని బయటకు వచ్చే వరకు సత్రం ముందు ఫ్యాన్లు లేని షెడ్డులో భక్తులు పడిగాపులు కాస్తుంటారు. ఇలా వేచి ఉండకుండా ఉత్సవాల తరుణంలో బఫే పద్ధతిలో భోజనం వడ్డించవచ్చు. ఇప్పుడు అన్నం వడ్డించే విభాగానికి పక్కన ఉన్న ఖాళీ ప్రదేశాన్ని అన్నదానం కోసం ఉపయోగించవచ్చు. భక్తులకు సరిపడా వసతులు కల్పించేందుకు యత్నిస్తున్నామని ఆలయ వర్గాలు తెలిపాయి.

# వృథా కా'నీరు'

ఖమ్మం : ఖమ్మం నగరం రోటరీనగర్‌లోని ప్రభుత్వరంగ సంస్థ విజయ డెయిరీలో ఉపయోగించిన మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించే ప్రాజెక్టు పూర్తి కావచ్చింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి సీజన్‌లో నిత్యం డెయిరీకి సుమారు 12 వేల లీటర్ల పాలు వస్తుంటాయి. ప్రస్తుతం 8 వేల లీటర్లు వస్తున్నాయి. డెయిరీలో పాలు, పెరుగు, మజ్జిగ తదితర ఉత్పత్తులు తయారు చేసే క్రమంలో వ్యర్థజలాలు మురుగునీరు విడుదలవుతాయి. వీటిని నేరుగా డ్రైనేజీలోకి వదలడంతో దుర్వాసన వ్యాపిస్తుంది. ఇలాంటి వ్యర్థ జలాలను శుద్ధి చేసి డెయిరీ ప్రాంగణంలో పశుగ్రాసం పెంచేందుకు అధికారులు ప్రణాళిక తయారు చేశారు. మిగిలిన నీటిని మొక్కలకు అందిస్తారు. విశాలమైన ప్రాంగణంలో శుద్ధి చేసిన జలం ద్వారా పచ్చదనం పెరిగే అవకాశం ఉంది. ఇది పాడి రైతులకు ఉపయోగం. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. వీటితో శుద్ధజలం ప్రాజెక్టును పూర్తి చేశారు. మురుగు నీటిని మూడు దశల్లో శుద్ధి చేస్తారు. మూడో దశలో స్వచ్ఛమైన నీరు బయటకు వస్తుంది. రెండో దశలో సేంద్రియ ఎరువు తయారవుతుంది. దీన్ని మొక్కలకు ఉపయోగించే అవకాశం ఉంటుంది. విజయ డెయిరీ ఉప సంచాలకుడు పి.మోహనమురళి చొరవతో నిధులు మంజూరయ్యాయి. పనులు చాలా వరకు పూర్తయ్యాయి. ఇక పశుగ్రాసం పెంపకం, మొక్కల పెంపకంపై దృష్టి సారించనున్నారు.

చురకలు



# సరఫరా పెరిగినా.. ట్యాంకర్లకు డిమాండే

హైదరాబాద్: మహానగరంలో జలమండలి సరఫరా చేసే నీటి పరిమాణం అవసరం మేరకు ఉన్నా పలు ప్రాంతాల్లో ట్యాంకర్లకు భారీగా డిమాండ్ పెరగడంపై జలమండలి దృష్టిసారించింది. గతేడాది ఇబ్బందులు ఎదురైన ప్రాంతాల్లో ఈసారి పునరావృతం కాకుండా సరఫరాను పెంచింది. అయినా జనవరి, ఫిబ్రవరి నెలల్లో ట్యాంకర్లకు డిమాండ్ 60 శాతానికి పెరగడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ట్యాంకర్లు ఎక్కువ బుక్కవుతున్న ప్రాంతాల్లో సరఫరా ఎలా, ఎన్ని గంటలు చేస్తున్నారు.. నిర్దేశించిన మేరకే అవుతోందా.. ? ఇలాంటి కీలక అంశాలను పరిశీలిస్తున్నారు. ఇటీవల జరిగిన జనరల్ మేనేజర్ల సమావేశంలో ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. నీటి సరఫరా పెరిగిన తర్వాత కూడా ట్యాంకర్లు ఎందుకు ఎక్కువ బుక్ అవుతున్నాయని ప్రశ్నించారు. సరఫరా సక్రమంగా ఉండేలా చూస్తూ ట్యాంకర్ల డిమాండ్‌ను తగ్గించడంపై జనరల్ మేనేజర్లు దృష్టిసారించాలని ఆదేశించారు.

**గత ఏడాదితో పోలిస్తే..**

గతేడాదితో పోలిస్తే మణికొండలోని డివిజన్–18లో ట్యాంకర్ల డిమాండ్ 161 శాతం పెరిగింది. ఇక్కడ గతేడాది ఫిబ్రవరిలో 2875 ట్యాంకర్లు సరఫరా కాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో 7513 ట్యాంకర్లు సరఫరా అయ్యాయి. ఆసిఫ్‌నగర్ డివిజన్‌లో గతేడాది కంటే ఈ ఫిబ్రవరిలో ఆసిఫ్‌నగర్ డివిజన్‌లో 144 శాతం, నిజాంపేట డివిజన్‌లో 102 శాతం, దుర్గం చెరువు డివిజన్‌లో 94 శాతం. అల్వాల్, నారాయణ గూడ, కూకట్‌పల్లి డివిజన్లలో 55 శాతం పైగా ట్యాంకర్లు పెరిగాయి.





జలమండలి పరిధిలో 22 డివిజన్లు ఉండగా ఈసారి 17 డివిజన్లలో గత ఏడాదికంటే ట్యాంకర్ల డిమాండ్ పెరిగింది. గత ఫిబ్రవరి కంటే ఈసారి 63 శాతం ట్యాంకర్లు పెరిగాయి. గతంలో 58,868 ట్యాంకర్లు సరఫరా కాగా.. ఈసారి 95,783 చేశారు.

అత్యధిక డిమాండ్ మణికొండ, ఎస్సార్ నగర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, నిజాంపేట, ప్రగతినగర్, మాదాపూర్‌లో ఉంది. నగరంలో సరఫరా అయ్యే ట్యాంకర్లలో 80 శాతం ఈ ప్రాంతాల్లోనే ఉన్నట్లు జలమండలి విశ్లేషించింది. డిమాండ్‌కు అనుగుణంగా ట్యాంకర్లను సరఫరా చేస్తున్నా అవసరాలను పరిగణనలోకి తీసుకుని ట్యాంకర్ల సరఫరాలో హేతుబద్ధీకరణ ఉండాలని జలమండలి నిర్ణయించింది.

## వివరాల నమోదుకు 'అపార్' కష్టాలు

హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో కేజీ నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఒకే గుర్తింపు కార్డు ఉండాలన్న లక్ష్యంతో కేంద్రం 'అపార్' కార్డు అందిస్తోంది. ఆన్‌లైన్‌లో సంబంధిత వివరాల నమోదుకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని విద్యాసంస్థలు అష్టకష్టాలు పడుతున్నాయి. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మరికొన్ని రాష్ట్రాల్లో ఈ కార్డులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే విద్యార్థులకు అందించాయి. ఇక్కడ మాత్రం ఆన్‌లైన్ నమోదులో సమస్యలు ఏర్పడుతున్నాయి. ఆధార్, పాఠశాల రికార్డుల్లో ఒకలా ఉంటేనే.. వివరాలు నమోదు చేస్తున్నప్పుడు విద్యార్థుల పేర్లు, చిరునామాలు, తల్లిదండ్రుల పేర్లలో స్వల్ప మార్పులున్నా సాఫ్ట్‌వేర్ తీసుకోవడం లేదు. ఎల్‌కేజీ, ఒకటో తరగతిలో చేర్పించేటప్పుడు ఇంటిపేరు లేకుండా పేరు రాయించడం, ఆధార్‌లో ఇంటిపేరు నమోదు చేయించడంతో పాఠశాల రికార్డుల ప్రకారం ఆధార్‌లో పేరు ఉండకపోవడంతో నమోదు కావడం లేదు. విద్యార్థుల పేర్లను తెలుగులో రాసేప్పుడు ఒక విధంగా... ఆంగ్లంలో రాసేప్పుడు మరోలా ఉండటం, ఆధార్‌లో ఇంకోలా ఉండటంతోనూ సమస్యలు వస్తున్నాయి. శ్రీనివాస్ అన్న పేరును స్కూల్ రికార్డులో 'ఎస్ఆర్ఐ'(శ్రీ) అని రాసుంటే... ఆధార్‌లో ఎస్ఆర్ఈఈ




(శ్రీ)అని ఉంటోంది. ఆధార్ కార్డులో ఉన్నట్టుగానే స్కూల్ రికార్డులో మార్పు చేయాలంటే తల్లిదండ్రుల సమ్మతిపత్రం సమర్పించాలని సూచిస్తున్నారు. మార్పులు, చేర్పులకు వారం, పదిరోజుల సమయం అవసరం కావడంతో నమోదు ఆలస్యమవుతోంది.

స్కూల్ రికార్డులకు అనుగుణంగా ఆధార్ కార్డులో మార్పులు చేయించుకురావాలని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు చెబుతున్నారు.

**భవిష్యత్తులో ప్రయోజనాలు**

అపార్ కార్డుతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. కార్డుపై నంబరును కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖ వెబ్‌సైట్లలో నమోదు చేస్తే చాలు.. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఎక్కడ చదివారన్న వివరాలు తెలిసిపోతాయి. ఎప్పటికప్పుడు విద్యార్థుల వివరాలు నవీకరించేందుకు (అప్‌డేట్) వీలుంటుంది. ఇందులో విద్యాప్రయాణం, సాధించిన విజయాలు అన్నీ ఉంటాయి. అపార్ వివరాలను అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ) అనే ఎడ్యులాకర్‌కు అనుసంధానించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని ఒక్కో పాఠశాలలో 50శాతం కూడా పూర్తికాలేదు.

# వన్యప్రాణుల నిలయాలు పర్యావరణ నేస్తాలు



హైదరాబాద్: మానవులు, ఇతర జంతుజాతులు కలిస్తేనే ప్రకృతి. మనిషి ప్రగతి సాధిస్తే మొదటగా నష్టం వాటిల్లేది వన్యప్రాణులకే. అడగకుండానే అన్నీ ఇచ్చే పర్యావరణానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మనం విఘాతం కలిగిస్తూనే ఉన్నాం. అడవుల నరికివేత, కాలుష్యం జంతుజాతుల మనుగడకు అడ్డంకిగా మారాయి. వన్యప్రాణుల మనుగడకు ఊతమివ్వడం, అరుదైన జీవులను అంతరించిపోకుండా కాపాడుకోవడం, వాటి సంతతి పెరుగుదలకు చేయూత ఇవ్వడం, వాటి ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించడం, జంతువులను రక్షించాల్సిన అవసరాలపై సాధారణ ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏటా మార్చి 3న ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో భాగ్యనగరంలో ఉన్న జంతు ప్రదర్శనశాల, ఇతర పార్కులు అందులో నివసిస్తున్న జంతువులు, వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ప్రత్యేక కథనం.

సంతతి ఉత్పత్తి కేంద్రంగా నెహ్రూ జూ పార్కు

విస్తీర్ణం: 400 ఎకరాలు

సింహాలు: 40

పులులు: 20

చుక్కల జింకలు: 150

రామచిలకలు: 50

వీటితో పాటు మొత్తం 3,000లకు పైగా జంతువులు, పక్షులున్నాయి. భాగ్యనగర సందర్శనకు వచ్చిన వారిలో దాదాపు అందరూ నెహ్రూ జంతు ప్రదర్శనశాలను సందర్శిస్తారు. సుమారు 400 ఎకరాల్లో ఏర్పాటైన ఈ జూపార్కులో జంతువుల సహజ ఆవాస కేంద్రాలుగా ఓపెన్ ఎన్‌క్లోజర్లు నిర్మించారు. దీంతో పాటు 2020 నుంచి వరుసగా అయిదుసార్లు ఐఎస్ఐ గుర్తింపు లభించింది.

జూలోని జంతువులకు నెలకు 18వేల క్వింటాళ్ల మాంసం, 1,700 కిలోల చేపలతో పాటు పౌడర్ ఫీడ్, గడ్డి, ఫలాలు, కూరగాయలు, కోడిగుడ్లు అందిస్తారు. జూలో రాత్రిపూట సంచరించే నిశాచర జంతువుల హౌజ్‌ను 1987లో ఏర్పాటు చేశారు. దేశంలోనే ఇదే మొదటిది కావడం విశేషం. ఇందులో గుడ్లగూబలు, ముళ్లపందులు, గబ్బిలాలు తదితర జంతువులు, పక్షులుంటాయి.

అంతరించి పోతున్న రాబందు ఈ జూలో ఇటీవల ఓ గుడ్డు పెట్టింది. దీంతో ఈ జూ పార్కును రాబందుల సంతానోత్పత్తి కేంద్రంగా సీజడ్ఏ గుర్తించింది. ఇక్కడ 14 ఏళ్ల క్రితం ఆరు మూషిక జింకలతో ప్రారంభమైన సంతానోత్పత్తి కేంద్రంలో సుమారు 500 మూషిక జింకలు జన్మించాయి.

మృగవని పార్కులో

విస్తీర్ణం: 1,200 ఎకరాలు

చుక్కల జింకలు: 450

సాంబారు జింకలు: 40

అడవి దుప్పిలు: 250

నెమళ్లు: 250

పక్షి జాతులు: 150

కుందేళ్లు: 150

బ్లాక్ కోబ్రాలు: 5

ఒక వైపు హిమాయత్‌సాగర్.. మరోవైపు ఉస్మాన్(గండిపేట)సాగర్ జంట జలాశయాల అందాలు.. ఆహ్లాదకరమైన వాతావరణం.. పచ్చని చెట్లు.. పక్షుల కిలకిలారావాలు.. జింక పిల్లల పరుగులు.. పురివిప్పినాట్యం చేస్తూ స్వాగతం పలికే నాట్యమయూరాలతో 'మృగవని జాతీయ జింకలపార్కు' పర్యాటకులకు కనువిందు చేస్తోంది. వివిధ రకాల సీతాకోక చిలుకలు, కోబ్రాలు, పాములు, తాబేళ్లు, అడవి పిల్లులు, ఉడుములు ఉన్నాయి. అడవిలో 650 రకాల మొక్కలు ఉండగా.. ఇందులో 150 రకాల ఔషధ మొక్కలు ఉండటం గమనార్హం. వన్యప్రాణుల దాహాన్ని తీర్చడానికి 14 చెక్‌డ్యాంలు, 15 కుంటలు, రెండు చెరువులను గతంలోనే నిర్మించారు. పదేళ్ల క్రితం నగరంలో నిర్వహించిన జీవవైవిధ్య సదస్సు సమయంలో ప్రభుత్వం చిలుకూరు మృగవని జాతీయ జింకల పార్కులో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి రూ.కోటి నిధులు వెచ్చించింది.

జింకలకు నిలయంగా హరిణ వనస్థలి

ఎల్బీనగర్‌లో ఆటోనగర్‌కు ఆనుకుని హరిణ వనస్థలి నేషనల్ పార్కు ఉంది. 453 హెక్టార్లలో విస్తరించి ఉంది. 1994లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అటవీప్రాంతాన్ని 'మహావీర్ హరిణవనస్థలి నేషనల్ పార్కు'గా ఏర్పాటు చేసి, సందర్శకులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. అరుదైన కృష్ణ జింకలు, మచ్చల జింకలు, కోతులు, పాములు, నెమళ్లు, ఉడుములు, ముంగిసలు కనువిందు చేస్తుంటాయి. ఈ వేసవిలో అవి ఇబ్బందులు పడకుండా ఎక్కడికక్కడ నీటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 600పైగా కృష్ణ జింకలు, మరో 600కు పైగా మచ్చల జింకలు ఉంటాయి. కృష్ణజింకల బ్రీడింగ్ సెంటర్‌గా ఈ పార్కును పరిగణిస్తారు.

# ఎక్కే బస్సు ఎక్కడుందో?




హైదరాబాద్: నిల్చున్న బస్టాపునకు ఎక్కాల్సిన బస్సు ఎంత దూరంలో ఉందో తెలుసుకోవచ్చు. బస్టాపునకు అది ఎప్పుడొస్తుందనే సమాచారమూ తెలిసిపోతుంది. జీహెచ్ఎంసీ కొత్తగా రూపొందించిన 'బస్సుల సమాచార వ్యవస్థ'తో అది సాధ్యం కాబోతుంది.

**హైటెక్ హంగులతో..**

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మొత్తం 10వేల కిలోమీటర్ల రోడ్లుండగా, అందులో ప్రధాన 2వేల కిలోమీటర్లపై సిటీ బస్సులు కనిపిస్తుంటాయి. ఆ రోడ్లపై జీహెచ్ఎంసీ దాదాపు 1,500 బస్టాపులను ఏర్పాటు చేసింది. ఆర్టీసీ ఆ రహదారులపై దాదాపు 3వేల సిటీ బస్సులు నడుపుతోంది. రోజూ సుమారు 20లక్షల మంది ప్రయాణిస్తుంటారు. మెట్రో స్టేషన్ల కింద ఉండే బస్టాపులు అదనం. దాదాపు ఏడేళ్ల క్రితం జీహెచ్ఎంసీ ఆయా బస్టాపులను నిర్మించింది. ఆర్టీసీ, జీహెచ్ఎంసీ మధ్య సమన్వయం లేకపోవడంతో ఇప్పటికే చాలా బస్టాపులు అసౌకర్యాలతో ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. దీంతో ఆధునిక డిజైన్లతో బస్టాపులను పునరుద్ధరించాలని, లండన్ నగరంలో మాదిరి హైటెక్ హంగులతో కూడిన షెల్టర్లను కట్టేందుకు జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం కసరత్తు చేస్తోంది. బస్సుల కోసం బస్టాపుల్లో ఎదురు చూస్తోన్న ప్రయాణికులకు సమయం, దూరం వంటి వివరాలను తెలిపే డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. ఆధునికీకరణలో భాగంగా ఇటీవల ఏర్పాటు చేసిన కొత్త బస్టాపులు: 248

మొత్తం: 1432

సిటీ బస్సులు: 2,800

**పీపీపీ పద్ధతిలో..** నగరంలోని అన్ని బస్టాపుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసి, బస్సుల్లోని జీపీఎస్‌తో అనుసంధానం చేసేందుకు ఆర్టీసీ సంస్థతో చర్చలు పూర్తయినట్లు జీహెచ్ఎంసీ చెబుతోంది. ఈ విధానం పీపీపీ పద్ధతిలో ఉండనుంది. ప్రకటనల ద్వారా ఏజెన్సీకి వచ్చే ఆదాయంతోనే.. డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసి, బస్సులు, బస్టాపులను అనుసంధానం చేసేలా నిబంధన పెడతామని చెబుతోంది. బోర్డుల కొనుగోలు, వాటి నిర్వహణ, సాఫ్ట్‌వేర్ తయారీ ఖర్చులన్నీ ప్రైవేటు సంస్థ భరించాలని అధికారులు చెబుతున్నారు.

# చెత్త శుద్ధీకరణపై ఆశలు

కరీంనగర్ : నగరంలోని డంపింగ్‌యార్డు గుట్టలుగా పేరుకుపోతుంది. నిత్యం టన్నుల కొద్ది వస్తున్న చెత్త ఎక్కడ వేయాలనే ప్రశ్నకు జవాబే లేదు. రెండేళ్ల కిందట ప్రారంభించిన బయోమైనింగ్ పూర్తి స్థాయి పరిష్కారానికి దారి చూపించలేక పోయింది. 'కరీంనగర్ నగర ప్రజల ప్రధాన సమస్య డంపింగ్‌యార్డు అని అర్థమైంది. దీనిని పరిష్కరించేందుకు సాంకేతికతతోపాటు నిధులు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.' అని ఇటీవల నగరానికి వచ్చిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అన్నారు. కేంద్ర మంత్రి హామీతోనైనా సమస్య పరిష్కారం కావాలని నగరవాసులు కోరుకుంటున్నారు. చెత్త నిండిపోవడంతో డంపింగ్‌యార్డు నుంచి మంటలు రావడం, పొగ వ్యాపించడంతో పరిసరాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. కోతిరాంపూర్, అలుగునూర్, రామగుండం బైపాస్‌రోడ్డు, పోచమ్మవాడ, అలకాపురికాలనీ, కమాన్ ప్రాంతం వరకు వాసన వస్తోంది. దీనిని ఇక్కడి నుంచి తరలించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అయితే చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తుండటంతో అధికారులు సైతం ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నారు. స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా 31 నెలల కిందట రూ.16.50 కోట్లతో బయోమైనింగ్ ప్రారంభించారు. ఏడాదిలోగా డంపింగ్‌యార్డు పూర్తిగా శుభ్రం చేసి ఇవ్వాల్సి ఉండగా ప్రక్రియ నిలిచిపోయింది. పలుమార్లు నోటీసులు ఇచ్చినా పనుల పురోగతి మాత్రం కనిపించడంలేదు. శుద్ధి చేసిన చెత్త వేసేందుకు కూడా స్థలం లేకపోవడం, రోజు వారీ వ్యర్థాలను అందులోనే కలిపి వేయడంతో శుద్ధీకరణ ప్రశ్నార్థకంగా మారింది. ఇతర రాష్ట్రాల్లో చెత్తను శుద్ధి చేసి తరలిస్తున్నట్లుగానే ఇక్కడ కూడా సాంకేతికను జోడించి వ్యర్థాలను తరలించే అవకాశముంది. ప్రస్తుతమున్న నిల్వలతోపాటు నగర వీధుల్లోంచి చెత్తను ఎప్పటికప్పుడు



శుద్ధీ చేసేలా ప్రణాళికలు చేయనున్నట్లు సమాచారం. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కూడా ఈ డంపింగ్‌యార్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే లక్ష్యంతోనే కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. తడి, పొడి చెత్తను వేర్వేరు చేయాలి. తడి చెత్తను సేంద్రియ ఎరువు తయారీకి ఉపయోగించవచ్చు. మరోవైపు హుజూరాబాద్‌లో పొడి చెత్తతో విద్యుత్తు తయారు చేసే ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన కూడా చేశారు. ఆ ప్రక్రియ పూర్తయితే డంపింగ్ యార్డులోని చెత్త నిల్వలు తగ్గుముఖం పడతాయని అధికారులు భావిస్తున్నారు. కరీంనగర్‌లోని డంపింగ్‌యార్డు

డివిజన్లు : 60

నగర విస్తీర్ణం : 65.33 చ.కిమీ

ఇళ్ల సంఖ్య : 89 వేలు

చెత్త ఉత్పత్తి : 140 మెట్రిక్ టన్నులు(రోజుకు)

పేరుకుపోయిన వ్యర్థాలు : 3 లక్షల టన్నులు

శుద్ధి చేసింది : 80 వేల మెట్రిక్ టన్నులు

# జమకాని వంట గ్యాస్ రాయితీ

కరీంనగర్ : కరీంనగర్ లోని విద్యానగర్‌కు చెందిన రమేష్‌కు నాలుగు నెలలవుతున్నా వంట గ్యాస్ రాయితీ డబ్బులు తన ఖాతాలో జమకావడంలేదు. ఆదర్శనగర్‌లో నివాసముంటున్న అశోక్‌ది ఇదే పరిస్థితి. ప్రారంభంలో జమకాగా ప్రస్తుతం కావడంలేదు. దీనిపై ఎవరిని సంప్రదించాలనే విషయం తెలియక పలువురు లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు.

**రూ.లక్షకుపైగా లబ్ధిదారులు**

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనికోసం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించగా 2,76,913 మంది దరఖాస్తు చేసుకుంటే.. 1,43,899 మంది అర్హులుగా తేలారు. ఈ పథకం ప్రవేశపెట్టేనాటికి ఒక్కో గ్యాస్ సిలిండర్ ధర రూ.974లుండేది.

**తగ్గించిన చమురు సంస్థలు**

ఈ పథకం ప్రవేశపెట్టిన తరువాత గ్యాస్ సిలిండర్ ధరలను ఆయా చమురు సంస్థలు కొద్దికొద్దిగా తగ్గిస్తూ వచ్చాయి. ప్రస్తుతం రూ.875లకే సిలిండర్‌ను విక్రయిస్తున్నాయి. దీనికి కేంద్ర ప్రభుత్వం రూ.47లను రాయితీగా ప్రతి వినియోగదారునికి జమచేస్తోంది. దీంతో రూ.828లు వినియోగదారుడు చెల్లిస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వ పథకంలో భాగంగా రూ.500లకే సిలిండర్ ఇవ్వాలంటే ఒక్కో సిలిండర్‌కు రూ.328లు ఆయా లబ్ధిదారుని ఖాతాలో జమకావాలి. కాని నాలుగు నెలలుగా జమకావడంలేదు.

**పరిమితిపై సందిగ్ధం?**

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌కు రూ.47ల రాయితీని 12 సిలిండర్ల వరకే వర్తింపజేస్తోంది. ఇదే మాదిరి రాష్ట్ర ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకానికి ఏమైనా పరిమితులు విధించిందా అనే ప్రశ్న లబ్ధిదారుల్లో తలెత్తుతుంది. దీనిపై ఆయా చమురు సంస్థల డీలర్లను సంప్రదిస్తే దీనిపై అవగాహన లేదని సమాధానమిస్తున్నారు. జిల్లా అధికారులకు సైతం అవగాహన లేకపోవడంతో ఎందుకు రాయితీ జమకావడంలేదో సమాధానం ఉండటంలేదు. ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

# పట్టణాల్లో.. పార్కింగ్ కష్టాలు

కరీంనగర్ : జిల్లా కేంద్రాలు, నగరపాలికలు, పురపాలికల్లో పార్కింగ్ కష్టాలు తీరడం లేదు. పట్టణాల్లో కనీసం వాహనాలు నిలిపేందుకు స్థలాలు లేక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పుర, నగరపాలికల అధికారులు ఆ వైపే ఆలోచన చేయడం లేదు. వివిధ పనుల కోసం వచ్చే వాహనాలు వందల్లో ఉంటుండగా వీటిని ఎక్కడ పడితే అక్కడ నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

**స్థలాల ఎంపికలో నిర్లక్ష్యం**

ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో ప్రధాన వ్యాపార, వాణిజ్య ప్రాంతాల్లో రాకపోకలు సాగించడానికి వీల్లేకుండా విపరీతమైన రద్దీ ఉంటుంది. ఈ ప్రాంతాల్లో ఎలాంటి పార్కింగ్ సౌకర్యం లేక వాహనాలను దుకాణాల ముందే నిలపడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కరీంనగర్‌లోని టవర్ సర్కిల్, మార్కెట్ ప్రాంతంలో పార్కింగ్ స్థలం లేదు. అన్నపూర్ణ కాంప్లెక్స్ దుకాణాల సముదాయానికి సంబంధించిన స్థలంలోనే వాహనాలు నిలుపుతున్నారు. అయినా సరిపోక తీవ్ర ఇబ్బందులు తలెతుతున్నాయి. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ఆర్అండ్‌బీ కార్యాలయ ఆవరణలో మల్టీపర్పస్ పార్కింగ్ ఏర్పాటు చేస్తామనే ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది.

**చలానా మాత్రం తప్పదు**

పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్ల పక్కన, దుకాణాల ఎదుట వాహనదారులు వాహనాలు నిలుపుతున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని ట్రాఫిక్ పోలీసులు చలానా విధిస్తున్నారు. పార్కింగ్ వసతి కల్పించకుండా వాహనదారుల జేబులు మాత్రం ఖాళీ చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఇదీ పరిస్థితి..**



కరీంనగర్ ప్రధాన వ్యాపార ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యమే లేదు. రద్దీ సమయాల్లో, పండుగల సమయాల్లో వాహనాలు నిలిపేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కారులో రావడమంటే సాహసం చేయాల్సిందే. కోరుట్లలో కల్లూరు రోడ్డు, ఇందిరా రోడ్డు, టీచర్ క్లబ్ రోడ్డు వైపు రహదారులను ఆక్రమించి వాహనాలు నిలుపుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల వద్దా పార్కింగ్ లేదు. పార్కింగ్ ప్రదేశాలు లేక జాతీయ రహదారి పక్కన ద్విచక్ర వాహనాలు నిలుపుతుంటారు.

జగిత్యాలలో రహదారుల పక్కనే వాహనాలు నిలుపుతున్నారు. పోలీసులు వాటికి జరిమానా విధిస్తున్నారు. మున్సిపాలిటీ తరపున పార్కింగ్ సౌకర్యం కల్పించడం లేదు. జమ్మికుంటలో ఏడు వ్యాపార ప్రాంతాలు ఉండగా పార్కింగ్ సౌకర్యం లేక వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

హుజూరాబాద్‌లో ఎనిమిది వ్యాపార ప్రాంతాలు ఉండగా ఎక్కడా వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక స్థలాలు లేవు.

గోదావరిఖని పట్టణంలో ప్రధాన ప్రాంతాలు మూడు ఉండగా రోడ్డు పక్కన, కొన్నిచోట్ల రోడ్లపైనే వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. పెద్దపల్లిలో నాలుగు ప్రాంతాల్లో రద్దీ ఉంటుండగా వాహనాలు నిలపడానికి ఎక్కడా స్థలం లేదు. గతంలో ఉన్న జెండా కూడలి పార్కింగ్ స్థలాన్ని చిరు వ్యాపారులు ఆక్రమించడంతో ఆ ప్రాంతం ఇరుకుగా మారింది. సిరిసిల్లలో ఎనిమిది ప్రధాన వ్యాపార ప్రాంతాలు ఉండగా పార్కింగ్ స్థలాలు లేక వాహనదారులు రహదారుల పక్కన వాహనాలు నిలుపుతున్నారు.

# నదీ తీరంలో నారసింహుడి కల్యాణం

ధర్మపురి: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణ వేదిక మార్పుకు అధికారులు దేవాదాయశాఖకు ప్రతిపాదనలు పంపారు. ఈ నెల 10న ఉత్సవాలు ప్రారంభం కానుండగా.. స్వామివారి కల్యాణోత్సవం 11న జరగనుంది. ఏటా దేవస్థానంలోని శేషప్ప కళావేదికపై కల్యాణోత్సవం జరుగుతోంది. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు, పోలీసులకు భద్రత పరంగా ఇబ్బందిగా ఉంటోంది. పెద్ద సంఖ్యలో ఉన్నతాధికారులు, వీఐపీలు తరలివస్తారు. స్వామివారు వేదికపైకి చేరే సమయానికే ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో నిండిపోతోంది. దీంతో ఉత్సవమూర్తి దర్శన భాగ్యం కొద్ది మందికే లభించేది. స్థానికులు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకి నిరాశే ఎదురయ్యేది. దీంతో కొన్నేళ్లుగా కల్యాణవేదిక మార్పుపై భక్తులు, స్థానికులు అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నారు.

**30 వేల మంది కూర్చునే అవకాశం**

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, ఇంజినీరింగు అధికారులతో వేదిక మార్పుపై ఆదివారం చర్చించారు. ఆలయ అర్చకులు, వేద పండితుల అభిప్రాయాలను తీసుకుని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలను పంపించారు. అనుమతులు రాగానే బ్రాహ్మణసంఘం భవనం పక్కన శ్రీమఠం ఖాళీ స్థలంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పనులు చేపట్టారు. ఇక్కడ ఉత్సవాన్ని నిర్వహిస్తే తెలుగు కళాశాల ముందు ఖాళీ స్థలంలో వాహనాలను నిలుపుకోవచ్చని.. తెనుగువాడ నుంచి నేరుగా రహదారి గోదావరినది వరకు ఉండటంతో రవాణా పరంగా అనుకూలంగా ఉంటుందని ఆలోచిస్తున్నారు. ప్రస్తుతం శేషప్ప కళావేదికపై నుంచి కేవలం 5 వేల మంది మాత్రమే స్వామివారిని దర్శిస్తుండగా.. నూతన స్థలంలో 30 వేల మంది భక్తులు కూర్చునే అవకాశముంటుంది.

చురకలు



# చిప్పాడ కొండల్లో అక్రమ తవ్వకాలు

భీమిలి : భీమిలి మండలం చిప్పాడ కొండల్లో అక్రమ క్వారీయింగు యథేచ్ఛగా సాగుతోంది. వైకాపా పాలనలో మొదలైన ఈ అక్రమ తవ్వకాలు ప్రభుత్వం మారినా దర్జాగా కొనసాగుతున్నాయి. ఆ పార్టీకి చెందిన కొందరు బడా నేతలు రాత్రి, పగలు తేడా లేకుండా గ్రావెల్‌ను, రాయిని ట్రాక్టర్లతో తరలించుకుపోయి అమ్ముకుంటున్నారు. గత అయిదేళ్లలో తెదేపా నేతలు ఎంత గొంతు చించుకున్నా, ఎన్ని ఫిర్యాదులు చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొద్ది నెలలు వేచిచూసే ధోరణిలో ఉన్న అక్రమార్కులు మళ్లీ ఎప్పటిలాగే తమ అక్రమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. కొండ గ్రావెల్‌ను తవ్వడం, ట్రాక్టర్లతో తరలించి అమ్ముకోవడం చేస్తున్నారు. ఈ విధంగా ఈ అయిదేళ్లలో కొండను పిండి చేశారు. కొన్ని సందర్భాల్లో నాటుబాంబులు అమర్చి రాళ్ల కోసం కొండను పేల్చుతున్నారు. గతంలో మేతకోసం వెళ్లిన ఓ పశువు పొరపాటున నాటుబాంబును తినబోయి నోట్లో పేలడంతో పది రోజులు



మృత్యువుతో పోరాడి ప్రాణాలు విడిచింది. కాగా తెదేపా జడ్పీటీసీ మాజీ సభ్యుడు సరగడ అప్పారావు నాయకత్వంలో ఆ పార్టీ నాయకులు పలుమార్లు రెవెన్యూ, గనులశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా కూడా స్పందించకపోవడం గమనార్హం. ఇప్పటికే కోట్లాది రూపాయల గ్రావెల్, రాళ్లను అమ్ముకున్న వీరి అక్రమ కార్యకలాపాలు కట్టడిచేయాలని తెదేపా నేతలు డిమాండు చేస్తున్నారు. చిప్పాడ కొండల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దారు పి.రామారావు వివరణ కోరగా కొండపై అక్రమంగా గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# విన్నపాలు నేలపాలు

కర్నూలు : మూడు రోజుల కిందట జరిగిన టెలీ కాన్ఫరెన్సులో జిల్లా అధికారులు ఇచ్చిన సమాధానాలపై 'న్యూస్‌టుడే' బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా పరిష్కరించకుండానే పరిష్కరించినట్లు క్షేత్రస్థాయి సిబ్బంది నమోదు చేస్తున్నట్లు తేలింది. భూముల రీ సర్వే పేరుతో వైకాపా ప్రభుత్వం రైతులను ముప్పుతిప్పలు పెట్టింది. సమస్యల పరిష్కారానికి 'కూటమి' ప్రభుత్వం రీ సర్వే గ్రామాల్లో గతేడాది అక్టోబరు నుంచి డిసెంబరు 15వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించారు. కర్నూలు జిల్లాలో 24,660, నంద్యాలలో 17,238 అర్జీలు వచ్చాయి. అన్నీ పరిష్కారమైనట్లు అధికారులు లెక్కలు రాసుకున్నారు. క్షేత్రస్థాయిలో భూ వివాదాలు అలానే ఉన్నాయి.

**బతిమాలి.. భయపెట్టి**

8 రీసర్వే, రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ సిబ్బంది పూర్తిస్థాయిలో పరిశీలించాలి. అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలి. ఇవేవీ పట్టించుకోని వీఆర్వోలు, సర్వేయర్లు బాధితులను కార్యాలయానికి పిలుపించుకొని పరిష్కరించేందుకు మరికొంత గడువు పడుతుంది.. ముందుగా సంతకాలు పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. ఎందుకిలా చేస్తున్నారన బాధితులు ప్రశ్నిస్తే ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నారంటూ చెప్పుకొస్తున్నారు. భవిష్యత్తులో రెవెన్యూ సిబ్బందితో అవసరాలు ఉంటాయని భావించిన అన్నదాతలు సంతకాలు చేశారు.

**రెవెన్యూ తీరుపై అసంతృప్తి**

కూటమి ప్రభుత్వం గతేడాది జూన్ 15వ తేదీ నుంచి అర్జీల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సగటున 200–300కుపైగా అర్జీలు వస్తున్నాయి. ఇందులో 70 శాతానికిపైగా రెవెన్యూ శాఖవే ఉండటం గమనార్హం. పరిష్కారం తీరుపై 60 శాతానికిపైగా బాధితులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు ఐవీఆర్ఎస్ సర్వేలో తేలింది.

**సమాచారం ఇవ్వకుండానే**

రీసర్వే గ్రామ సభల అర్జీలు, రెవెన్యూ గ్రామసభల అర్జీలు, ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే వినతులన్నింటినీ (పీజీఆర్ఎస్) పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. బాధితులకు కనీస సమాచారం ఇవ్వకుండానే పరిష్కరించామంటూ బాధితుల చరవాణులకు సంక్షిప్త సమాచారం పంపి చేతులు దులిపేసుకొంటున్నారు.

వాస్తవానికి పరిష్కార ప్రక్రియ ఏ స్థితిలో ఉందో తరచూ సంక్షిప్త సమాచారాన్ని బాధితులకు పంపాలి. క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యను పరిష్కరించిన తర్వాత బాధితుడితో కలిసి ఫొటో తీసుకుని నిర్దేశిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. కొందరు అధికారులు అర్జీలనే ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. ఇంకొందరు ఏదో ఒక ఉత్తర్వును అప్‌లోడ్ చేసి మభ్యపెడుతున్నారు.

**చిత్రవిచిత్రమైన సమాధానం**

ఓర్వకల్లు మండలం నన్నూరుకు చెందిన రామ మద్దమ్మ తన 2.48 ఎకరాల భూ సమస్య పరిష్కారానికి ఇప్పటికీ కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. కానీ అధికారులు మాత్రం 2023లోనే పరిష్కరించినట్లు ఆమె భర్త మద్దయ్యకు ఎండార్స్‌మెంట్ ప్రతిని అందిస్తున్నట్లు సచివాలయ వీఆర్వో పీజీఆర్ఎస్ పోర్టల్‌లో చిత్రాన్ని అప్‌లోడ్ చేశారు. వాస్తవంగా రామ మద్దమ్మ భర్త వృద్ధుడు.. ఆయన జీన్స్ ఫ్యాంటు, టీషర్టు వేసుకోరు.. తెల్ల అంగీ, పంచె కట్టులో ఉంటారు. మరో వ్యక్తికి ఎండార్సుమెంటు ప్రతి అందించి ఆ చిత్రాన్ని పీజీఆర్ఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం గమనార్హం. "ఆ చిత్రంలో ఉన్న వ్యక్తులు ఎవరో తమకు తెలియదని.. అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ప్రతులు ఇవ్వకుండా దారిలో పోయే ముక్కు మొహం తెలియనివారికి ఎండార్స్‌మెంట్లు ఇచ్చి తమ భూ సమస్య పరిష్కరించినట్లు అధికారుల లెక్కల్లో రాసుకోవడం విచిత్రంగా ఉందని" బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ అంశాలపైనే ఎక్కువగా అర్జీలు వస్తున్నాయి. వాటికి సంబంధించిన పరిష్కారం సరైన రీతిలో జరగడం లేదని సీఎం అసంతృప్తిగా ఉన్నారు. అర్జీలను సీరియస్‌గా తీసుకొని పరిష్కరించేలా చూడాలి.

**ఉన్నతాధికారుల ఆదేశం.!!**

రెవెన్యూ సదస్సులు, రీసర్వే గ్రామసభల్లో వచ్చిన అర్జీలన్నింటిని పరిష్కరించామని.. కేవలం రీఓపెన్ కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిని సైతం త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం.

# పరిశ్రమించేలా.. ప్రగతి పట్టాలెక్కేలా



చిత్తూరు: రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పారిశ్రామిక రంగం చోదక శక్తిగా దోహదపడుతుందని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు అనుగుణంగా తిరుపతి, చిత్తూరు జిల్లాలను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుబీ మంత్రి నారా లోకేశ్ అడుగులు వేస్తున్నారు. పెట్టుబడిదారులను ఆకర్షించి ఉమ్మడి జిల్లాలో 36,970 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శ్రమిస్తున్నారు. 2029 నాటికి ప్రజల తలసరి ఆదాయం, జిల్లా స్థూల విలువ జోడింపు (జీడీవీఏ), స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడీపీపీ) ఎంత ఉండాలి? అని పకడ్బందీగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేరుకోవాల్సిన లక్ష్యాలపై అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఇటీవల జరిగిన సదస్సులో తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్ సవివరంగా పేర్కొన్నారు.

**చిత్తూరులో పట్టా లెక్కించాలని**

చిత్తూరు జిల్లా పారిశ్రామికంగా బాగా వెనుక పడింది. 70 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. జీడీవీఏలో పారిశ్రామిక రంగం వాటా 18.50 శాతమే. ఈ నేపథ్యంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన యూనిట్లను ప్రోత్సహించాలని నిర్ణయించారు. తయారీ, పారిశ్రామిక రంగాన్ని క్రమంగా పట్టాలెక్కించేందుకు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తోన్న కుప్పాన్ని పరిశ్రమలకు హబ్‌గా మార్చనున్నారు.

**రూ.406.05 కోట్లు.. 5,970 మందికి ఉపాధి**

జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.406.05 కోట్ల పెట్టుబడులు రావడంతోపాటు ఆ పరిశ్రమల్లో 5,970 మందికి ఉపాధి లభిస్తుందని భావిస్తున్నారు. పుంగనూరులో గతంలో శంకుస్థాపన చేసిన ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ సంస్థ ఆరు నెలలు– ఏడాదిలోపు కార్యకలాపాలు మొదలుపెడుతుందని అంచనా. రూ.77 కోట్లతో ఇది ఏర్పాటవుతోంది. 120 మందికి ఉపాధి కల్పిస్తుంది. నింద్ర కేంద్రంగా వస్తోన్న అమ్మయప్పర్ టెక్స్‌టైల్స్ సంస్థ దాదాపు వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇస్తుంది. కోవై క్లాస్టిక్ ఇండస్ట్రీస్, తైవాన్‌కు చెందిన పాదరక్షలు తయారుచేసే సంస్థలు ఏడాది నుంచి మూడేళ్లలోపు కార్యకలాపాలు ప్రారంభిస్తాయి. 2025– 26లో స్థూల విలువ జోడింపు (జీడీవీఏ)లో.. పారిశ్రామిక, తయారీ రంగం రాష్ట్ర సగటు: 23.45 శాతం జిల్లా లక్ష్యం: 18.50 శాతం వచ్చే పెట్టుబడులు: రూ. 406.05 కోట్లులభించే ఉపాధి: 5,970 మందికి

# పత్రాల భూచి!!



విశాఖపట్నం : విలువైన ప్రభుత్వ భూముల్లో గుట్టు చప్పుడు కాకుండా కొందరు పాగా వేస్తున్నారు. ప్రశ్నిస్తే 'ఆ స్థలాలకు పత్రాలున్నాయంటూ' భూమి చదును చేస్తున్నారు. మరికొన్ని చోట్ల నిర్మాణాలు సాగిస్తున్నారు. కబ్జాలను తేల్చాల్సిన రెవెన్యూ అధికారులు ఫిర్యాదులొస్తే తప్ప స్పందించని పరిస్థితి నెలకొంది.

**ముచ్చటగా మూడోసారి:** మారికవలస డంపింగ్‌యార్డు సమీపంలోని పాత పరదేశిపాలెంలో రెవెన్యూ సర్వే సంఖ్య 64లో దాదాపు 60 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. 2015లో ఇక్కడ కొందరు బోరు వేసేందుకు యత్నించగా అధికారులు అడ్డుకున్నారు. మళ్లీ 2021లో ఈ భూమి చుట్టూ రక్షణ గోడ నిర్మించే ప్రయత్నాలు చేశారు. అప్పుడు కూడా రెవెన్యూ అధికారులు అడ్డుకుని ఆక్రమణదారులను హెచ్చరించారు. తాజాగా తిరిగి సోమవారం ఆ భూమిలో జేసీబీతో చెట్లు తొలగించి చదును పనులు ప్రారంభించారు. స్థానికులు ఫొటోలు తీసి ఆర్డీవో సంగీత్‌మాధుర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో ఆదేశాల మేరకు వీఆర్వో సురేష్ అక్కడికి చేరుకుని పనులు నిలుపుదల చేయిం చారు. ఈ భూమిపై తమకు అన్ని పత్రాలతో కూడిన హక్కులు ఉన్నాయని చదును చేస్తున్న వ్యక్తులు తెలిపారు. దీంతో ఆధారాలున్న పత్రాలు తీసుకుని తహసీల్దార్‌ను కలవాలని వీఆర్వో వారికి సూచించారు. అప్పటి వరకు స్థలంలో ఎలాంటి పనులు చేయవద్దని చెప్పడంతో తాత్కాలికంగా నిలిపేశారు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం స్వాధీన పర్చుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. **గ్రామ కంఠంలో అనుమతులపై ఫిర్యాదు** భీమిలి బ్యాంకు కాలనీలో సుమారు 2.32 ఎకరాల గ్రామ కంఠం భూమి రికార్డుల్లో ఉంది. ఓ వ్యక్తి ఈ భూమిలో 1300 గజాలు తాకట్టు పెట్టి ఒకరి వద్ద రుణం తీసుకొని. సొమ్ములు చెల్లించలేదు. ఆ భూమి తనకు అప్పగించాలని రుణదాత కోర్టును ఆశ్రయించారు. అనుకూలంగా ఉత్తర్వుల రాగా... మరికొంత భూమి కలిపి 2600 గజాలు రిజిష్టర్ చేసుకున్నట్లు సమాచారం. ఈ భూమిని ఓ వ్యక్తికి అమ్మగా అతను డెవలెప్‌మెంట్‌కు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అక్కడున్న స్థానికులను ఖాళీ చేయించి నిర్మాణాలు సాగించారు. తాజాగా ఈ భూమిలో భారీ నిర్మాణాలు చేపట్టగా అనుమతులు ఎలా ఇచ్చారంటూ? విచారణ చేయాలని స్థానికులు జిల్లా కలెక్టర్‌కు స్పందనలో అర్జీ ఇచ్చారు. ఆర్డీవో ఆదేశాలతో మండల సర్వేయర్ రమేష్ నిర్మాణదారులను ఆధారాలతో రమ్మని సూచించారు. తహసీల్దార్ రామారావును వివరణ కోరగా...బిల్డర్‌కు నోటీసులిస్తున్నా మన్నారు. 2016లో గ్రామ కంఠం డీ–నోటిఫై అయిందని, అందులో స్కూలు, కమ్యూనిటీహాల్స్‌కు సంబంధించిన స్థలం ఏమైనా ఉందా? అనేది నిర్మాణదారులు పత్రాలు తెచ్చాక పరిశీలిస్తామన్నారు.

# విచారణలో వింత పోకడ!



అనకాపల్లి: రోలుగుంట మండలం జానకిరామపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో (పీఏసీఎస్) సుమారు రూ. 2 కోట్ల వరకు బినామీల పేరిట రుణాలు తీసుకుని ఆ సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) వాడేసుకున్నారు. తమ ప్రమేయం లేకుండానే రుణాలు తీసుకుని ఆపై జప్తు నోటీసులు పంపిస్తున్నారని రైతులు కలెక్టరేట్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు నర్సీపట్నం సబ్‌డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావును నియమించారు. ఈయన ఆ సహకార సంఘంలో అక్రమాల సంగతి తేల్చకుండా నేరుగా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) సీఈఓకి సమన్లు జారీ చేయడం వివాదాస్పదం అవుతోంది. ఎవరైనా తొలుత ఫిర్యాదుదారులను పిలిచి వారి వివరాలు నమోదు చేసుకుని విచారణ మొదలుపెడతారు. ఈయన మాత్రం రైతులను, తమశాఖ ఆడిటర్లను పక్కనపెట్టి డీసీసీబీ అధికారులకు నోటీసులు పంపారు. దీని వెనుక అక్రమాలు వెలికి తీయడం కంటే తమశాఖ పరిధిలో పనిచేసే బ్యాంకు అధికారులపై ఆధిపత్యం ప్రదర్శించాలనే తపనే కనిపిస్తోంది. జానకిరామపురం సొసైటీలో అడ్డగోలు వ్యవహారాలను నర్సీపట్నం డీసీసీబీ బ్రాంచి అధికారులు గుర్తించి ఆ సంఘానికి నిధులతో పాటు సీఈఓకి జీతాలు నిలిపేశారు. దీంతో ఆక్రోశానికి గురైన సీఈఓ ఆ బ్యాంకునే పెట్రోల్ పోసి తగలబెట్టే ప్రయత్నం చేశారు. దీనిపై బ్యాంకు అధికారులు ఫిర్యాదు చేయగా ఆయనపై కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. దీనికంతటికీ డీసీసీబీ వాళ్లే కారణమని సహకారశాఖ అధికారులు గుర్రుగా ఉన్నారు. ఈ సహకార సంఘం బినామీ రుణాల విషయంలో డీసీసీబీ అధికారులను విచారించాలంటూ తాజాగా నోటీసులు పంపించారు. ఏకంగా గత 20 ఏళ్లలో నర్సీపట్నం డీసీసీబీ బ్రాంచిలో ఎవరెవరు అధికారులు పనిచేశారు? వారి హొదా ఏంటి? వారిలో ఎవరైనా ఉద్యోగ విరమణ చేస్తే ప్రసుత్తం వారు ఎక్కడ నివాసం ఉంటుంది తదితర వివరాలతో పాటు 2005 నుంచి 2025 వరకు బ్యాంకు రికార్డులు తమ ముందుంచాలని ఆదేశించారు. లేకుంటే డీసీసీబీ సీఈఓకి ఆరు నెలల జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొనడంపై బ్యాంకు వర్గాలు మండిపడుతున్నాయి. సహకార సంఘంలో అక్రమాలు జరిగాయని రైతులు ఫిర్యాదు చేస్తే డీసీసీబీ రికార్డులు తనిఖీ చేయాలనడం వెనుక అసలు విచారణను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**విచారణాధికారిపైనే అభియోగాలు ...** పీఏసీఎస్ విచారణాధికారి శ్రీనివాసరావుపై గతంలో ఆరోపణలు, అభియోగాలున్నాయి. నర్సీపట్నంలో సొసైటీకి చెందిన వాణిజ్య దుకాణాల నుంచి అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులున్నాయి. దేవరాపల్లి సహకార సంఘంలో ఒకరి సర్వీస్‌ను నిబంధనలకు విరుద్ధంగా క్రమబద్ధీకరించడంతో శ్రీనివాసరావుపై శాఖాపరమైన చర్యలకు డీసీఓ సిఫార్సు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోకపోగా ఇప్పుడు జానకీరామపురం సొసైటీ విచారణాధికారిగా నియమించడం విశేషం. **నాకు అధికారం ఉంది** ఈ విషయమై ఆయన వద్ద ప్రస్తావించగా తానేమీ నిబంధనలు మీరి వ్యవహరించలేదన్నారు. బినామీ రుణాల విషయంలో సహకార సంఘం రికార్డులపై నమ్మకం లేకనే డీసీసీబీ నుంచి రికార్డులు తేవాలని కోరినట్లు చెప్పారు.

# సమయానికి వస్తే చాలు..!

చిత్తూరు : క్రయవిక్రయదారులకు పారదర్శక సేవలు అందించేందుకు స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ చర్యలు చేపట్టింది. రవాణాశాఖలో ప్రస్తుతం అమలులో ఉన్న స్లాట్ బుకింగ్ విధానం తరహాలో రిజిస్ట్రేషన్ శాఖలోనూ అమలు చేయనుంది. చిత్తూరు ఆర్‌వో, ఎస్ఆర్‌వో కార్యాలయంలో నూతన విధానాన్ని అమలు చేయనున్నారు. కోరుకున్న సమయంలో..
: క్రయవిక్రయదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే ఆ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి. దీంతో గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. ఈ పరిస్థితిని చక్కదిద్దడంతో పాటు ప్రజలు కోరుకున్న సమయాల్లో రిజిస్ట్రేషన్ చేసేందుకు స్లాట్ విధానం అందుబాటులోకి తెస్తున్నారు. త్వరలో అన్ని చోట్లా ఈ విధానాన్ని అమలు చేసేలా కసరత్తు చేస్తున్నారు. గంటకు ఆరుగురికి..: వినియో



గదారులు రిజిస్ట్రేషన్ కోసం తేదీ, సమయాన్ని ముందుగా నిర్ణయించుకుని రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. సదరు రసీదు తీసుకుని నిర్దేశిత సమయానికి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి పని పూర్తిచేసుకోవచ్చు. ఒక గంటలో ఆరుగురికి స్లాట్ కేటాయించనున్నారు. ఫలితంగా వేచిఉండే అవసరం ఉండదు.

ప్రయోజనాలివీ..రిజిస్ట్రేషన్లకు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండదు. ఒత్తిడి లేకుండా క్రయవిక్రయదారులతో పాటు అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించవచ్చు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులకు అవస్థలు తప్పుతాయి.

# కేసీ కాల్వలో స్థిరాస్తి జెండాలు

నంద్యాల : చేనుకు నీరు చేరడంలో పిల్ల కాల్వలది ప్రధాన పాత్ర.. అంత కీలకమైన వాటిని అక్రమార్కులు ఛిద్రం చేసి స్వాధీనం చేసుకొంటున్నారు. జిల్లా కేంద్రమైన నంద్యాల చుట్టు పక్కల ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.. ఇక్కడ స్థిరాస్తి వ్యాపారం ఎక్కువగా జరుగుతుండటం.. భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాల పర్వం పెరిగింది. జాతీయ రహదారి పక్కన చాబోలు గ్రామంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.. అక్కడ ఎకరా రూ.5 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు పలుకుతుండంతో అక్రమార్కుల కన్ను పిల్ల కాల్వల జాగాపై పడింది. సర్వే నంబరు–21లో 2.10 ఎకరాల ఎసైన్డు మిగులు భూమి ఉంది. ఇక్కడ ఎకరం రూ.10 కోట్ల వరకు పలుకుతోంది. మొత్తం రూ.20 కోట్ల విలువైన భూమి ఆక్రమణలో ఉన్నా అధికారులు ఎలాంటి



చర్యలు చేపట్టడంలేదు. పరిరక్షించాల్సిన నీటి వినియోగదారుల సంఘాల సభ్యులు, సంఘ అధ్యక్షుడు, డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఛైర్మన్లు కొందరు ఆక్రమణదారులతో కుమ్మక్కవుతున్నారు.

సర్వే నంబరు–28లో కేసీ పిల్ల కాల్వ వెళ్తోంది.. ఇక్కడ అర ఎకరం వరకు ప్రైవేటు వ్యక్తులు స్వాధీనం చేసుకొన్నారు. ఆక్రమణ విషయాన్ని రెవెన్యూ అధికారులు తేల్చారు.. కానీ చర్యలు తీసుకోలేదు.. సదరు వ్యక్తి వైకాపా గ్రామస్థాయి ముఖ్యనాయకుడు కావడం గమనార్హం. పిల్ల కాల్వను ఆనుకొని సర్వే నంబరు–28లో నాలుగెకరాల ప్రభుత్వ స్థలం నిరుపయోగంగా ఉంది. ఓ స్థిరాస్తి వెంచర్ యజమాని తన లేఅవుట్‌లోకి వెళ్లడానికి వీలుగా రోడ్డు నిర్మించడంతోపాటు రెండున్నర ఎకరాలు ఆక్రమించుకొన్నారు. దీని విలువ రూ.25 కోట్ల వరకు ఉంటుంది. సదరు వ్యక్తి నంద్యాల మాజీ ఎమ్మెల్యేకు అనుచరుడున్న గుర్తింపు ఉంది. జాతీయ రహదారి నుంచి చాబోలు వెళ్లే మార్గంలో పిల్ల కాల్వ కట్టను తొలగించి ప్రహరీ నిర్మించారు. ఓ స్థిరాస్తి సంస్థ నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లేకుండానే కల్వర్టు నిర్మించారు.

# విస్తరణ దారి.. మృత్యుస్వారీ

డోన్ : కర్నూలు– బెంగళూరు.. కర్నూలు– కడప ప్రధాన రహదారులను అనుసంధానం చేసేలా డోన్ పట్టణం మీదుగా నిర్మిస్తున్న జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. డోన్ నుంచి సోమయాజులపల్లి వరకు 53 కి.మీ. మేర రూ.450 కోట్లతో జాతీయ రహదారి (340బి) నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా డోన్ పట్టణ సమీపంలో యు.కొత్తపల్లె మలుపు వద్ద నుంచి ప్రభుత్వ ఆసుపత్రి సమీపం వరకు రహదారి పక్కన గుంతలు తవ్వేశారు. రహదారి వన్‌వేలోనే నడుస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ సరైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవటం, గతంలో వేసిన రహదారిని తొలగించి మరోవైపు దారి వేస్తుండటంతో ప్రయాణికులకు కష్టాలు తప్పటంలేదు.

**మృత్యుమార్గం**

డోన్ ప్రభుత్వ ఆసుపత్రి, పక్కనే ఉన్న బాలికల గురుకుల పాఠశాల వద్ద గత రెండు నెలల కిందట యు.కొత్తపల్లెకు చెందిన ఓ యువకుడు డోన్‌కు వస్తూ పక్కనే ఉన్న గుంతలో ద్విచక్రవాహనంతో పడి ప్రాణాలు కోల్పోయారు. అక్కడ సరైన సూచిక, పక్కన గుంత ఉందనే విషయం తెలియకపోవటంతోనే ఇలా ప్రమాదం జరిగిందనే స్థానికులు పేర్కొంటున్నారు.

రెండు వారాల క్రితం రెండు ట్రాక్టర్లు ఢీకొనటంతో మల్లెంపల్లెకు వీరాంజనేయులు అనే వ్యక్తి ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. నెలరోజుల క్రితం ఇదే ప్రాంతంలో ద్విచక్రవాహన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. గత వారంలో దొరపల్లెకు చెందిన ఓ యువకుడు, డోన్‌కు చెందిన మరో యువకుడు ద్విచక్రవాహనాలపై వెళ్తూ ఢీకొనటంతో ఇద్దరికీ గాయాలయ్యాయి.

# రోజుకు రూ. 307

అర్ధవీడు : వలసలకు అడ్డుకట్ట వేసేలా గ్రామాల్లోనే పనులు చూపేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని 2005లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ప్రారంభంలో దినసరి కూలి రూ.87.50. పదేళ్ల కిందటి వరకు ఆ మొత్తం రూ.193 వరకే ఉండేది. అనంతరం కూలిని ఏటా రూ.10 నుంచి రూ.30 వరకు అదనంగా పెంచుతూ వచ్చింది. 2022లో రూ.12 పెంచగా.. 2023లో రూ.15 అదనంగా చెల్లించింది. 2024లో రూ.28 పెంచింది. ఈ ఏడాది మాత్రం కేవలం రూ.7కే పెంపును పరిమితం చేసింది. ఆ మేరకు దినసరి కూలి రూ. 307గా నిర్ణయించి కేంద్రం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన కూలి ఈ నెల 1 నుంచి



చెల్లించనుంది. తద్వారా జిల్లా వ్యాప్తంగా 8.17 లక్షల జాబ్‌కార్డుల కూలీలకు లబ్ధి కలగనుంది.

**మూడేళ్లుగా లేని వేసవి భత్యం**

గతంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉపాధి కూలీలకు 15 శాతం నుంచి 30 శాతం వరకు వేసవి భత్యం అదనంగా అందుతుండేది. గత మూడేళ్ల నుంచి తొలగించారు. పార, గడ్డపార భత్యాలను కూడా వారానికోసారి చెల్లించేవారు. వాటిని కూడా గత మూడేళ్లుగా నిలిపివేశారు. దీంతో పథకం పనులకు వెళ్లే వారికి రూ.180 నుంచి రూ.230 వరకు మాత్రమే కూలి గిట్టుబాటవుతోంది. వ్యవసాయ, వ్యవసాయేతర పనులకు వెళ్తే రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు చేతికందుతున్నాయి. దీంతో ఉపాధి పనులకు వెళ్లే వారి సంఖ్య జిల్లా వ్యాప్తంగా కొంత తగ్గుముఖం పట్టింది.

జిల్లాలో జాబ్ కార్డులు: 4.43 లక్షలు

మొత్తం కూలీల సంఖ్య: 8.17 లక్షలు

2025-26లో పనిదినాల సంఖ్య: 111.26 లక్షలు

# మొక్కజొన్న... రైతుల్లో ఆందోళన

త్రిపురాంతకం: మార్కెట్‌లో స్థిరమైన ధర లభించి పెట్టుబడులు పోను కొద్దిపాటి లాభాలు పంచే పంటగా మొక్కజొన్నకు పేరు. ఈ పంట పరిస్థితి కూడా ఏటికేడు దయనీయంగా మారుతోంది. కోతల దశ మొదట్లో మంచి ధరకు కొనుగోలు చేసినా.. ఉత్పత్తులు ఇంటికి వచ్చే కొద్దీ వ్యాపారులు ధరలు దిగజారుస్తున్నారు. రైతుల శ్రమను దోచుకుంటున్నారు.

**20,170 ఎకరాల్లో సాగు**

జిల్లాలో త్రిపురాంతకం, దొనకొండ, కురిచేడు, దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు తదితర మండలాలతో పాటు మిగతా మెట్ట ప్రాంతాల్లోనూ 20,170 ఎకరాల్లో రైతులు ఈ ఏడాది మొక్కజొన్న సాగు



చేశారు. ఖరీఫ్‌లో క్వింటా 2,300 ధర పలికింది. రబీలో కోతకు వచ్చాక వారానికే ఆ ధర మారిపోతోంది. ప్రస్తుతం క్వింటా రూ.2,050కు దిగజారింది.

**చేతికొచ్చే వేళ తకరారు**

పంటంతా చేతికి వచ్చే తరుణంలో ధర తగ్గుముఖం పట్టడంతో రైతులు ఒకింత ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు సరాసరి 25 క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదు. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడులు వెచ్చిస్తున్నారు. ఇటీవల మొక్కజొన్న పంట కొనుగోలు ధరలు క్రమేపీ తగ్గిపోతుండటంతో విక్రయించిన పంట ద్వారా ఆర్నెళ్ల పాటు శ్రమించిన కష్టానికి ఫలితం మాత్రమే దక్కుతోంది. కౌలుదారులకైతే ఆ కాస్త కూడా మిగలడం లేదు. ఆరు నెలలపాటు చేసిన శ్రమకు ఫలితం దక్కడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# చెరువు చెప్పదు.. ఆక్రమణ ఆగదు!

గార : గార మండలం శ్రీకూర్మం పంచాయతీ శెగిడిపేట సమీపంలో ప్రధాన రహదారికి ఆనుకుని సర్వే నం.746-1లో 1.26 ఎకరాల్లో విస్తరించి ఉన్న సిద్ధాంతి చెరువు ఆక్రమణకు గురవుతోంది. ఆయకట్టు క్రయ విక్రయాలతో లేఅవుట్‌గా మారింది. ఈ ప్రాంతంలో ఎకరా ధర భారీగా పలుకుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూమి సెంటు ఆక్రమించుకున్నా రూ.లక్షలు పొందొచ్చన్న ఆశతో ఆక్రమణదారులు బరి తెగిస్తున్నారు. ఓ వ్యక్తి స్థలానికి అనుకుని ఉన్న చెరువులో కొంత భాగాన్ని మట్టి కప్పి ఆక్రమించేశాడు. ఈ విషయమై స్థానిక నేతలు



అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. చెరువు ఆక్రమణకు గురవుతోందని రెండు నెలల కిందట అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పుడు చర్యలు తీసుకున్నా ఈ పరిస్థితి తలెత్తేది కాదని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా మరో వ్యక్తి చెరువులో వేరే చోట మట్టి కప్పి ఆక్రమించడానికి యత్నిస్తున్నాడు. ఆక్రమణలు తొలగించి చెరువు గర్భాన్ని కాపాడాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై వీఆర్వో అప్పలనాయుడిని సంప్రదించగా పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సర్వే చేసి ఆక్రమించినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# సక్షం అమలులో మాయాజాలం



అనంతపురం : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సక్షం పథకం మార్గదర్శకాలకు భిన్నంగా శ్రీసత్యసాయి జిల్లా ఐసీడీఎస్ యంత్రాంగం వ్యవహరిస్తోంది. ఈ పథకం కింద ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట వస్తువుల సరఫరాలో చేతివాటం ప్రదర్శించారు. సామగ్రి బిల్లు చెల్లింపు అనంత జిల్లాలో ఒకలా.. శ్రీసత్యసాయి జిల్లాలో మరొకలా అనుసరించడం గమనార్హం. ఆట వస్తువులు సరఫరా చేయకుండానే శ్రీసత్యసాయి జిల్లాలో ఏకంగా రూ.25.41లక్షలు గుత్తేదారుకు ధారాదత్తం చేశారు. మొన్నటి దాకా ఈ జిల్లా ఐసీడీఎస్.. సదరు గుత్తేదారు గుప్పెట్లో కొనసాగుతూ వచ్చింది. ఇక్కడి మాజీ అధికారి, ఓ గుత్తేదారు కుమ్మక్కై ఇష్టారీతిన వ్యవహరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తుంగలో తొక్కేసి.. నిధులు ఖర్చు పెట్టేశారు. మొదటికే మోసం వస్తుందన్న భయంతో హడావుడిగా కొన్ని కేంద్రాలకు మాత్రమే ఆట వస్తువులను సరఫరా చేసి చేతులు దులుపుకొన్నట్లు విశ్వసనీయ సమాచారం.

**ఒక్కో కేంద్రానికి రూ.45,800**

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమగ్ర పోషణ.. ఆరోగ్యంపై అవగాహన.. ఆటలతో ఆనందం కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్రం 'సక్షం' కింద ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.45,800 చొప్పున మంజూరు చేసింది. ఇందులో పెరటి తోట పెంపకానికి రూ.10వేలు, ఇంకుడు గుంతలకు రూ.16వేలు, ఆట వస్తువులకు రూ.19,800 చొప్పున వెచ్చించాలి. ఉమ్మడి అనంత జిల్లాకు గతేడాది సెప్టెంబరులోనే నిధులు వచ్చాయి. ఇరు జిల్లాల్లో వేర్వేరుగా ఆట వస్తువుల కొనుగోలుకు టెండర్లను ఆహ్వానించారు. అనంత జిల్లాలో తొలుత టెండర్ బాగోతంపై వివాదం సాగింది. శ్రీసత్యసాయి జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా టెండర్ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఇదంతా నవంబరులోనే జరిగింది. అనంతలో జనవరిలో ఆట వస్తువులను సరఫరా చేసి.. మార్చి మొదటి వారంలో బిల్లు చెల్లించారు.

**ఇష్టారాజ్యంగా...**

ఆట వస్తువుల కిట్(పది వస్తువులు) ధర రూ.19,800గా ప్రభుత్వం నిర్ణయించింది. సదరు గుత్తేదారు అదే కిట్ రూ.16,500తో టెండర్ దక్కించుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 154 కేంద్రాలకు సరఫరా చేయకుండానే రూ.25.41లక్షలు కట్టబెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. సరఫరా చేసిన తర్వాత సీడీపీఓలతో నిరభ్యంతర ధ్రువీకరణ(ఎన్‌ఓసీ) ఇవ్వాలి. తర్వాతే బిల్లు పెట్టాలి. మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకోకుండా అడ్డదిడ్డంగా రెండు మాసాల క్రితమే బిల్లు చెల్లించినట్లు తెలుస్తోంది. రెండు నెలలైనా ఆట వస్తువులను సరఫరా చేయలేదు. కొత్త పీడీ బాధ్యతలు తీసుకున్న తర్వాత హడావుడిగా నాలుగు రోజుల క్రితం కొన్ని కేంద్రాలకు తూతూమంత్రంగా వస్తువులు ఇచ్చినట్లు సమాచారం.

విచారించి తగిన చర్యలు తీసుకుంటాం..తోట శ్రీదేవి, పీడీ, ఐసీడీఎస్, శ్రీసత్యసాయి జిల్లా

సక్షం పథకం అమలులో ఏమి జరిగిందో విచారిస్తా. ఎందుకు సరఫరా చేయలేదని గుత్తేదారును పిలిపించి అడిగాం. మొన్నటి నుంచే సరఫరా చేస్తున్నారు. బిల్లు చెల్లింపు వ్యవహారం తనకు తెలియదు. దీనిపై సమగ్రంగా విచారించి తగిన చర్యలు తీసుకుంటాం.

# వైకాపా అడ్డుకుంది.. కూటమి తెచ్చింది!



హిందూపురం : పట్టణాల అభివృద్ధికి ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్, కేంద్ర ప్రభుత్వం 2012 సంవత్సరం నుంచి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నాయి. మరో వైపున పంచాయితీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో అధిక జనాభా ఉన్న పట్టణాలు ఉంటే సమగ్ర అభివృద్ధి కష్టం. దీంతో 20 నుంచి 30 వేల జనాభా ఉండి, పంచాయతీలుగా ఉన్న నియోజకవర్గ, మండల కేంద్రాలను పురపాలకశాఖ పరిధిలోకి తీసుకొచ్చి వాటిని నగర పంచాయతీలుగా ఉమ్మడి రాష్ట్రంలో గుర్తించారు. వీటిలో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు ప్రభుత్వం పలు ప్రణాళికలు సిద్ధం చేసింది. లక్ష జనాభా దాటిన పట్టణాలకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద నిధులు ఇచ్చింది. దీంతో లక్ష లోపు జనాభా ఉన్న పట్టణాలను నాన్-అమృత్ పథకం పట్టణాలుగా గుర్తించి, వాటిలో మౌలిక సదుపాయాల కల్పనకు అసియా అభివృద్ధి బ్యాంక్ 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 30 శాతంగా కలిపి 2018లో నిధులు మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లాలో పుట్టపర్తి, మడకశిర, కళ్యాణదుర్గం, గుత్తి పురపాలిక/నగర పంచాయతీల్లో నీటి సరఫరా వ్యవస్థను, మడకశిరలో మురుగునీటి వ్యవస్థను అభివృద్ధి చేయడానికి నిధులు వచ్చాయి. టెండర్లు పిలిచి, పనులు చేపట్టారు. ఈ పనులను 2024 మార్చి ఆఖరు నాటికి పూర్తి చేయాలని ఆసియా బ్యాంక్ నిర్దేశించింది. తరువాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

**గత ప్రభుత్వం వాటా ఇవ్వక..**

ఆసియా బ్యాంక్ నిధులు ఇస్తామని చెప్పినా, అప్పటి వైకాపా ప్రభుత్వం రాష్ట్రవాటా 30 శాతం కేటాయించక అభివృద్ధి పనులను అటకెక్కించింది. కాల పరిమితి ముగియడంతో ఆసియా బ్యాంక్ ఈ పథకం నుంచి తప్పుకొంది. దీంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయా యి. వైకాపా చేతకాక, పట్టణాల్లో సమగ్ర తాగునీటి పథకాల ఏర్పాటుకు వచ్చిన అవకాశాలను వదులుకొంది.

**బ్యాంకును ఒప్పించి.. కాలపరిమితి పెంచి**

అర్ధాంతరంగా ఆగిన పనులను కూటమి ప్రభుత్వం గుర్తించి, కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆసియా అభివృద్ధి బ్యాంక్‌తో చర్చలు జరిపి, మళ్లీ నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వం కృషి ఫలించింది. గతంలో ముగిసిన కాలపరిమితిని 2028 జులై ఆఖరు వరకు పొడిగిస్తూ, ఆసియా బ్యాంక్ అంగీకరించింది. దీంతో తాగునీటి పథకాలకు రూ.551 కోట్లు, మడకశిరలో మురుగు నీటి వ్యవస్థకు 28.90 కోట్లు మంజూరయ్యాయి.

పురపాలిక/ నగర పంచాయతీ- నిధులు (రూ.కోట్లలో)

పుట్టపర్తి : 115.00

మడకశిర : 72.83

గుత్తి : 211.78

కళ్యాణదుర్గం : 151.70

**టెండర్ ప్రక్రియ నిర్వహించి, పనులు ప్రారంభిస్తాం**

**రామ్మోహన్‌రెడ్డి, ఎస్‌ఈ పబ్లిక్ హెల్త్**

ఉమ్మడి జిల్లాలో అర్ధాంతరంగా ఆగిపోయిన తాగునీటి పథకాల పనులకు త్వరలో టెండర్ ప్రక్రియ నిర్వహించి పనులు ప్రారంభిస్తాం. గతంలో పనులు చేసి గుత్తేదారులకు బిల్లులు చెల్లించి, ఆగిన పనులను తిరిగి పునఃప్రారంభిస్తాం. ఉమ్మడి జిల్లాలోని నాలుగు నగరపంచాయతీలకు రూ.551 కోట్లు కేటాయించింది.

# ఆదివాసీలపై వైకాపా నేత జులుం



అనకాపల్లి : అధికారంలో లేకపోయినా వైకాపా నేతల ఆగడాలకు అడ్డులేకుండా పోతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు కిరాయి మనుషులను వెంటపెట్టుకుని తోటి గిరిజనులపైనే దాడులకు తెగబడ్డారు. సుమారు పది ఎకరాల్లో ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పంటలన్నింటినీ ధ్వంసం చేశారు. పంట భూమిలోకి సాగుదారులు రాకుండా మారణాయుధాలతో భయపెట్టిన ఘటన అనకాపల్లి జిల్లాలో కలకలం రేపింది. రోలుగుంట మండలం ఛటర్జీపురం సర్వే నంబర్ 139లోని మెట్ట భూముల్లో కొంతమంది ఆదివాసీలు ఎన్నో ఏళ్లగా అరటి, జామ, కొబ్బరి తోటలు వేసుకుని జీవనాధారం పొందుతున్నారు. 2021లో ఆ భూములు తమవంటూ తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన మల్లిడి రామిరెడ్డి వచ్చి సాగులో ఉన్నవారిని ఆ భూముల నుంచి వెళ్లగొట్టాలని ప్రయత్నించారు. దీనిపై గిరిజనులు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు నడుస్తుండగానే వైకాపాకు చెందిన కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు నూకరాజు 2023లో ఛటర్జీపురం భూములపైకి తన మనుషులతో వచ్చారు. రామిరెడ్డి నుంచి ఈ భూములు తాను కొన్నానని... ఖాళీ చేయాలంటూ గిరిజనులకు హుకుం జారీచేశాడు. ఇరువర్గాలు బాహాబాహీకి దిగడంతో అప్పట్లో బైండోవర్ కేసులు పెట్టారు. వాటి సాగులో గిరిజనులు ఉన్నట్లు అధికారిక దస్త్రాల్లో నమోదై ఉంది, కోర్టులో కేసు నడుస్తోంది. ఏడాది తర్వాత సోమవారం తెల్లవారుజామున నూకరాజు మళ్లీ బరితెగించారు. నర్సీపట్నం నుంచి 50 మందికి పైగా కిరాయి మనుషులను మాట్లాడుకుని ఆటోలు, మోటారు సైకిళ్లపై గిరిజనుల పంట భూములపైకి దాడులకు వెళ్లారు.

**పంటలన్నీ నేలమట్టం**వైకాపా నేత గూండాలతోపాటు కత్తులు, కటార్లతో తోటల్లోకి వెళ్లారు. సుమారు పది ఎకరాల్లో అరటి, జామ, కొబ్బరి, మామిడి తోటలను నరికేశారు. ఫలసాయం చేతికందివచ్చిన సమయంలో తమ కళ్లముందే నరికేశారని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేశారు. 'మరోసారి మీ భూముల్లోకి రారు, బైండోవర్ చేశామని గతంలో పోలీసులు భరోసా ఇచ్చారు. కానీ వైకాపా నాయకులు చట్టాలు లెక్కచేయకుండా.. తోటి ఆదివాసీలన్న సానుభూతి చూపకుండా పంటను ధ్వంసం చేయడంపై' గిరిజన సంఘాల నేతలు మండిపడుతున్నారు. గిరిజనులు ఇచ్చిన ఫిర్యాదుతో జడ్పీటీసీ సభ్యుడు నూకరాజుతో సహా 20 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వచ్చిన ఆటోలు, మోటారుసైకిళ్లను సీజ్ చేసినట్లు రోలుగుంట ఎస్.ఐ. రామకృష్ణారావు తెలిపారు.

# వీరి దారింతే..!

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం పూడిలంక వాసులకు రహదారి సౌకర్యం అందని ద్రాక్షలా మారింది. తుపాన్లు, ప్రకృతి విపత్తులు, అధిక వర్షాల సమయంలో రాకపోకలకు కష్టాలు తప్పడం లేదు. ఉప్పు పరిశ్రమ యాజమాన్యం ప్రయోజనార్థం ఉప్పుటేరు మధ్యలో నిర్మించిన వారధి గట్టే వారికి ఆధారంగా నిలిచింది. ఆ గట్టుకు కొన్నేళ్లుగా పరిశ్రమ నిర్వాహకులు మరమ్మతులు చేయకపోవడంతో పూర్తిగా పాడైనా తప్పని పరిస్థితుల్లో ప్రయాణం సాగిస్తున్నారు.తెదేపా హయాంలో శంకుస్థాపన చేసిన వారధి రహదారి నిర్మాణాన్ని వైకాపా ప్రభుత్వం పూర్తి చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. 2018లో పూడిలంకకు రోడ్డు నిర్మాణానికి రూ.1.30 కోట్లు మంజూరయ్యాయి. గత ఐదేళ్లూ లంక ప్రజల కష్టాలు తీరుస్తున్నామని మాజీ మంత్రి అప్పలరాజు హామీలివ్వడానికే పరిమితమయ్యారు. రోడ్డు



సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో వైద్యం పొందడానికి గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. వర్షాలు పడినప్పుడు వారి ఇబ్బందులు వర్ణనాతీతం. వాహనాలను పల్లివూరు కూడలి వద్ద ఉంచి గ్రామానికి చేరుకునేందుకు నరకయాతన తప్పడం లేదు.

**ప్రతిపాదనలు పంపాం..**

2018లో మంజూరైన నిధులు సరిపోకపోవడంతో పనులు ఆగిపోయాయి. రోడ్డు నిర్మాణం పూర్తి చేయడానికి అవసరమైన మొత్తం మంజూరు చేయాలని వైకాపా హయాంలో ప్రతిపాదనలు పంపాం. తాజా పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. నాగభూషణ్, జేఈ, పంచాయతీరాజ్ శాఖ, పలాస

# చేప పిల్లలను మింగేశారు

నందికొట్కూరు: కృష్ణానదిలో దళారులు తిష్ఠ వేసి మత్స్య సంపదను ఆరగిస్తున్నారు. నందికొట్కూరు నియోజకవర్గం మీదుగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది. ఈ ఏడాది నదిలో 2 లక్షల చేప పిల్లలను ఎంపీ శబరి చేతులమీదుగా వదిలారు. అవి పెరిగిన తర్వాత స్థానిక మత్స్యకారులు పట్టుకోవడానికి అనుమతి ఉంది. ఇందుకు కృష్ణానది పరివాహక ప్రాంతంలో 1,200 మంది లైసెన్సులు ఇచ్చారు. కొందరు దళారుల రాజకీయ అండదండలతో విశాఖ నుంచి జాలర్లను పిలిపించి నిషేధిత అలివి వలలతో గాలం వేస్తున్నారు. చేప పిల్లలు వదిలిన 15 రోజులకే 'ఖాళీ' చేశారు. అక్రమంగా వేటాది దళారులు నెలకు రూ.50 లక్షల వరకు ఆదాయాన్ని గడిస్తున్నారు. నందికొట్కూరు మండలం జంగంపాడు, బిజినవేముల, పగిడ్యాల మండలంలోని



నెహ్రూనగర్, ముచ్చుమర్రి, కొత్తపల్లి మండలంలో జానాలగూడెం, బలపాలతిప్ప, సంగమేశ్వరం ప్రాంతాల్లో విశాఖ జాలర్లు గుడారాలు వేసుకున్నారు. అలివి వలలతో చేపలు వేటాడుతున్నా మత్స్య, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులకు కనిపించకపోవడం శోచనీయం. అలివి వలలకు చిక్కిన పెద్ద చేపలను కర్ణాటక, తెలంగాణ, ఏపీలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చిన్న చేపలను నది ఒడ్డున ఆరబెడుతున్నారు. కిలో రూ.80లకు విక్రయిస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు.

# ఆక్వాకు మంచి రోజులు..!

సంతబొమ్మాళి : కొవిడ్ సమయం నుంచి జిల్లాలో ఆక్వా రంగం తీవ్ర ఒడిదొడుకులకు లోనై సంక్షోభం వైపు పయనించింది. వైకాపా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే ప్రధాన కారణంగా నిలిచాయి. దీనికితోడు పెరిగిన మేతలు, మందుల ధరలు, లీజు వ్యవహారాలు మరింత ఇబ్బంది పెట్టాయి. ఆక్వా జోన్ల సమస్య, విద్యుత్తు ధరలతో ఏకంగా కుదేలైన స్థితికి తీసుకొచ్చాయి. తాజాగా కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులకు అండగా నిలిచేందుకు విద్యుత్తు రాయితీకి వెసులుబాటు కల్పించనుంది.గత ప్రభుత్వ హయాంలో విద్యుత్తు యూనిట్ ధర రూ.1.50కే ఇస్తామని చెప్పినా అమలు కాలేదు. ఈ-ఫిష్ విధానంలో పలు నిబంధనలు విధించారు. వంద రొయ్యల ధర తెదేపా పాలనలో రూ. 250 నుంచి రూ.260 ఉండేది. వైకాపా వచ్చాక రూ.180 పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. ఉప్పు, మంచినీటి ఆక్వా జోన్లుగా విభజించారు. పదెకరాల వరకు సాగు చేసిన రైతులకే యూనిట్ విద్యుత్తు ధర రూ.1.50కే వర్తింపజేస్తామన్నారు. పది హార్స్ పవర్ మోటార్ వినియోగించే రైతులకు రాయితీ వర్తించదని, ఈ-ఫిష్ విధానంలో చెరువుల లీజు ఒప్పందం, లైసెన్స్, విద్యుత్తు మీటరు, భూమి, ఆన్‌లైన్ పత్రాలు ఇవ్వాలని మెలిక పెట్టారు. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా యూనిట్ ధర రూ.6 చెల్లించాల్సి వచ్చేది. జిల్లాల్లో ఎక్కువశాతం మంది ఆక్వా జోన్ పరిధిలో లేకపోవడం, రాయితీ వర్తించకపోవడంతో రూ.లక్షల్లో విద్యుత్తు బిల్లులు రావడంతో సాగు చేయడానికి గతంలో మొగ్గు చూపలేదు.

గతంలో కుదేలు25 ఏళ్లుగా ఆక్వాపై ఆధారపడిన రైతులు గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఈ రంగంపై మక్కువ చూపలేదు. దీంతో జిల్లాల్లో వేలాది ఎకరాలు నిరుపయోగంగా మారాయి. జిల్లాలో 451 మంది రైతులకు రాయితీ విద్యుత్తు కనెక్షన్లు ఉండగా, వాటిలో 220 మందికి మాత్రమే రాయితీ వర్తించేది. 10 ఎకరాల లోపు ఉన్న చెరువులకే విద్యుత్తు రాయితీ పరిమితం చేయడంతో 70 శాతం రైతులపై విద్యుత్తు బిల్లుల భారం పడి ఈ రంగం కుదేలైంది.

ఆదుకుంది చంద్రబాబే

రాష్ట్ర తలసరి ఆదాయానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న ఆక్వా రంగానికి 2014-19లో తెదేపా ప్రభుత్వం బాసటగా నిలిచింది. రూ.2కే యూనిట్ విద్యుత్తు అందరికీ అందించింది. దీంతో రైతులు ఆయిల్ ఇంజిన్లు వదిలి విద్యుత్తు ఏర్పాటు చేసుకుని లాభాల బాట పట్టారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం యూనిట్ ధర రూ.1.50 ప్రకటించడంతో హర్షం వ్యక్తమవుతోంది.

వెసులుబాటు.. విద్యుత్తు బిల్లుల కష్టాల నుంచి విముక్తి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకేసింది. రూ.1.50కే యూనిట్ విద్యుత్తు అందించాలని కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు నిర్ణయించారు. నిబంధనలు లేకుండా రాయితీ అందించనున్నారు. అర్హులైన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుని రాయితీ పొందడానికి వెసులుబాటు కల్పించారు.

జిల్లాలో ఆక్వా సాగు విస్తీర్ణం: సుమారు 4 వేల హెక్టార్లు..

నిర్వాహకుల సంఖ్య : 1,500 మంది

పనిచేస్తున్న కార్మికులు: సుమారు 10వేల మంది

ఏడాది అంచనా వ్యాపారం: రూ.200కోట్లు

సాగవుతున్న మండలాలు: సంతబొమ్మాళి, గార, సోంపేట, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, ఎచ్చెర్ల, పోలాకి

మార్గదర్శకాలు వచ్చిన వెంటనే అమలు: జిల్లాలో 220 కనెక్షన్లకు మాత్రమే రాయితీ వర్తిస్తోంది. మిగతా రైతులు నాన్-ఆక్వా జోన్ పరిధిలో ఉండటం, 1బీ, అడంగల్ లేకపోవడంతో అవకాశం రాలేదు. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్‌తో సంబంధం లేకుండా రాయితీ అందిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది.

# పెద్దమంత్రిపై ఎనలేని ప్రేమ

చిత్తూరు : ఆయన ఇప్పుడు మంత్రి కాదు.. ప్రతిపక్ష పార్టీలో ఓ నాయకుడు మాత్రమే.. గతంలో పలు కీలక శాఖలు పర్యవేక్షించిన సమయాన ఎస్పీడీసీఎల్ పరిధిలో భారీగా అక్రమాలకు తెరలేచింది.. ఆయన అండతో కొందరు అవినీతి అధికారులు ఇష్టారాజ్యంగా చెలరేగిపోయారు.. దొడ్డిదారిన ఇచ్చిన సిఫార్సులు గుడ్డిగా ఆమోదించి తమ అనుచరులను నియమించారు.. ఈ అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించి నెలలు గడుస్తున్నా అడుగు ముందుకు పడకపోవడం ఇప్పటికీ ఆ'పెద్ద' మంత్రిపై ఉన్న ప్రేమను తెలియజేస్తోందని కొందరు ఎస్పీడీసీఎల్ అధికారులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో విద్యుత్తు శాఖ అవినీతిలో కూరుకుపోయింది. నియంత్రికలు, అనుబంధ పరికరాల కొనుగోళ్లలో, కాలిపోయిన, తుప్పు పట్టిన కమ్మీల నుంచి రూ.వేల కోట్లు దండుకున్నారు. అవినీతి అధికారులను అందలం ఎక్కించారు. మాట వినని వారిని దూరంగా పంపేశారు. ఈ కోవలోనే షిఫ్ట్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల నియామకాలు ఇష్టానుసారంగా చేపట్టారు.



విద్యార్హత లేకున్నా నాటి మంత్రి సిఫార్సు లేఖలకు 'జీ హుజూర్' అన్నారు. ఆయన, ఆయన అనుచరులు చెప్పిన వారిని నియమించారు. ఎస్పీడీసీఎల్ పరిధిలోని ఉపకేంద్రాల్లో ఒప్పంద పద్ధతిలో 2,100 మందిని నియమించారు. ఇందులో అగ్రభాగం తిరుపతి సర్కిల్‌లోనే 1,300–1,500 మందిని నియమించినట్లు సమాచారం. విద్యార్హత లేకున్నా అప్పట్లో మంత్రి సూచించిన వైకాపాకు అంటకాగిన అభ్యర్థులను నియమించారనే ఆరోపణలున్నాయి. పుంగనూరు నియోజకవర్గంలోనే వీరి సంఖ్య అధికం.

**యాంటీ పవర్ తెఫ్ట్ స్క్వాడ్ ఎక్కడా..!**

గతేడాది నవంబరులో ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు స్పందించి దర్యాప్తు బాధ్యతను యాంటీ పవర్ తెఫ్ట్ స్క్వాడ్(ఏపీటీఎస్) విభాగానికి అప్పగించారు. ప్రస్తుత దర్యాప్తు తీరు ప్రభుత్వ ఆదేశాలకు అడుగడుగునా తూట్లు పొడుస్తోంది. ఐదు నెలలైనా కనీస పురోగతి లేదు. ఉద్యోగంలో చేరినవారి విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను ఈఈల నుంచి సేకరించడానికే నాలుగు నెలలు పడితే ఇక విచారణ ఎప్పుడు.. వాస్తవాలు తేలేది ఎప్పుడు.. అక్రమార్కులపై చర్యలు ఎప్పుడనేది ప్రశ్నార్థకంగా మారింది. 'పెద్ద' మంత్రితో ఉన్న పరిచయాలే దర్యాప్తును ముందుకు సాగనీయడం లేదనే అంతర్గత విమర్శలు, ఆరోపణలున్న నేపథ్యంలో రాష్ట్రస్థాయి అధికారులు దృష్టిసారిస్తే తప్ప పరిస్థితిలో మార్పు కనిపించేలా లేదు.

# లాభాలంటూ ఊరించి.. ఉన్నదంతా ఊడ్చేసి

తిరుపతి : ట్రేడింగ్ మోసాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. తక్కువ సొమ్ముతో ఎక్కువ లాభాలు పొందొచ్చని ఊరిస్తూ పంపే వీడియోలు, సందేశాలను నమ్మి మోసపోతున్నారు. పక్కవారికే కాదు.. ఇంట్లో ఇల్లాలికి సైతం చెప్పకుండా పెట్టుబడులుగా పెట్టి ఉన్నది కాస్త పోగొట్టుకుంటున్నారు.

**ఇటీవల ఘటనలు పరిశీలిస్తే..**

తిరుపతికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ వాట్సప్‌నకు వచ్చిన నకిలీ ట్రేడింగ్ యాప్ లింకులు నమ్మి ట్రేడింగ్ చేశారు. రూ.7.20 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. లాభంతో కలిపి చూపిన రూ.11.42 లక్షలు విత్‌డ్రా చేయడానికి వీలుకాక పోలీసులను ఆశ్రయించారు.



అవిలాలకు చెందిన లాజిస్టిక్ మేనేజర్ వాట్సప్‌నకు ఆన్‌లైన్ లింకులు పంపి రూ.9 లక్షల వరకు పెట్టుబడి పెట్టించారు. వాలెట్లో ఆదాయంతో కలిపి రూ.19 లక్షలు చూపి మోసగించారు. ఎస్వీయూ ఆచార్యుడి ఫోన్ నంబరును వాట్సప్ గ్రూప్‌లోకి చేర్చిన మోసగాళ్లు నకిలీ ట్రేడింగ్ యాప్‌లు పంపి వివిధ ఖాతాల నుంచి రూ.24.66 లక్షలు పెట్టుబడిగా పెట్టించి పోర్ట్‌ఫోలియో విలువ ఏకంగా రూ.2.14 కోట్లు చూపి దగా చేయడంతో ఆయన ఇటీవల పోలీసులను ఆశ్రయించారు. తిరుపతికి చెందిన ఓ వైద్యుడికి మ్యాట్రిమోనీ వేదికగా మహిళ పరిచయమైంది. సంపాదన రెట్టింపు కావడానికి షేర్ మార్కెట్ ఒక్కటే మార్గమని నమ్మించింది. మొదట కొంత పెట్టుబడి పెట్టించి రూ.7 లక్షలు డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించింది. నమ్మకం పెరిగి రూ.84 లక్షలు పెట్టుబడి పెట్టగా రూ.కోట్లలో లాభం చూపారు. దానిని డ్రా చేసుకునేందుకు యత్నించగా అసలురంగు బయటపడి పోలీసులను ఆశ్రయించారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో విద్యావంతులే ఎక్కువగా చిక్కుకుంటున్నారు. ఊరికే డబ్బులు వస్తాయని నమ్మే అమాయకులం కాదు.. అందుకే ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టి సంపాదిస్తామనే వీరు.. చివరకు ట్రేడింగ్ ఖాతాలు నకిలీవా? కాదా? అని తెలుసుకునే సామర్థ్యం లేక.. నష్టపోయామని తెలుసుకున్నా ఎక్కడ పరువుపోతుందోనని పోలీసులను సంప్రదించలేక సతమతమవుతున్నారు.

**వెంటనే పోలీసులను సంప్రదించండి**

తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే సందేశాలు, సమాచారాలపై అప్రమత్తంగా ఉండాలి. రిజిస్టర్ కాని సంస్థలు క్షేమం కాదు. బాధితులు 1930 నెంబరుకు ఫోన్ చేయాలి. సమీప పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలి. వినోద్‌కుమార్, సైబర్ క్రైమ్ సీఐ

జిల్లాలో 2024లో 248 సైబర్ కేసులు నమోదు కాగా.. ఏకంగా రూ.12.89 కోట్లను సైబర్ మోసగాళ్లు కాజేశారు. అంతకుముందు ఏడాదితో పోల్చితే 430 శాతం దోపిడీ పెరిగింది.

# వైకాపా హయాంలో పడక.. కూటమి పాలనలో చకచకా!



ఎలమంచిలి : జగన్ పాలనలో పడకేసిన పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు, కూటమి రాకతో పునఃప్రారంభమయ్యాయి. గత అయిదేళ్లలో కాలువలో ఒక్క తట్ట మట్టి కూడా తీయలేదు. కూటమి ప్రభుత్వ హయాంలో పోలవరం కాలువ పనులకు కొత్తగా టెండర్లు పిలవడంతోపాటు బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేయడంతో పూడికతీత పనులు చేపట్టారు. ఎలమంచిలి మండలంలో పనులు ఊపందుకున్నాయి. పోలవరం కాలువ ద్వారా 108 టీఎంసీల నీరు ఉమ్మడి విశాఖ జిల్లాకు వస్తుంది. ఇందులో 24 టీఎంసీల నీరు పరిశ్రమలకు కేటాయించి మిగిలిన 84 టీఎంసీల నీరు సాగునీరుగా అందించాలన్న ఆశయంతో దీన్ని రూపకల్పన చేశారు. మిగులు జలాలను ఉత్తరాంధ్రాకు తరలించాలన్నది ప్రణాళిక. గత ప్రభుత్వం పోలవరం పనులను గాలికి వదిలేసింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో పరిశ్రమలతో పాటు రైతులకు సాగునీరు అందించడానికి రూ. 677 కోట్ల అంచనాతో 84 కిలోమీటర్ల పొడవైన పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులకు 2005లో భూమి పూజ చేశారు. భూసేకరణ పూర్తి చేసి ప్రధాన కాలువను 6, 7, 8 ప్యాకేజీల కింద అప్పగించారు. ఎలమంచిలి కేంద్రంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

**6 వ ప్యాకేజీ**

పాయకరావుపేట నుంచి దార్లపూడి వరకూ ఆరో ప్యాకేజీ కింద రూ.196 కోట్ల వ్యయంతో 25 కిలోమీటర్ల పొడవునా ఎడమ ప్రధాన కాలువను తవ్వారు. ఇప్పుడు దీన్ని 6, 6ఎగా విభజించారు. మట్టి పనులు పూర్తయ్యాయి. మధ్యలో వంతెనలు, కాంక్రీట్ లైనింగ్ పనులు చాలా చోట్ల నిలిచిపోయాయి. తాండవ నదిపై నిర్మిస్తున్న కాలువ పనులు పూర్తికాలేదు. కొన్ని చోట్ల కాలువ ఎగువ గ్రామాలకు వంతెనలు నిర్మించినా అప్రోచ్ రోడ్లు వేయలేదు. కొండలపై నుంచి కొట్టుకువచ్చిన మట్టి కాలువలో మేటలు వేసింది. ఇప్పుడు పొక్లెయిన్ల సాయంతో ఈ పూడికలు తొలగిస్తున్నారు.

**7 వ ప్యాకేజీ**

దార్లపూడి నుంచి తాళ్లపాలెం వరకూ 7వ ప్యాకేజీ కింద రూ. 330 కోట్లతో 26 కిలోమీటర్ల పొడవున కాలువ పనులు ప్రారంభించారు. గత తెదేపా హయాంలోనే కాలువ తవ్వకం పనులు 90 శాతం పూర్తయ్యాయి. వరాహనదిపై సిమెంట్ కాలువ పనులు పూర్తి కాలేదు. పోలవరం కాలువకు అడ్డంగా ప్రవహిస్తున్న కొండగెడ్డల నుంచి నీరు నేరుగా కిందికి పోవడానికి నిర్మించిన కాలువల పనులు మధ్యలో నిలిచిపోయాయి. కాలువల చుట్టూ వేసిన కాంక్రీట్ లైనింగ్ దెబ్బతింది. ఈ పగుళ్లలోంచి తుప్పలు మొలిచాయి. ఇవన్నీ తొలగించి సరి చేస్తున్నారు.

**8వ ప్యాకేజీ**

తాళ్లపాలెం నుంచి కణితి రిజర్వాయర్ వరకూ 8వ ప్యాకేజీ కింద రూ. 171 కోట్ల వ్యయంతో 33 కిలోమీటర్ల పొడవునా కాలువను వెడల్పు చేసి పోలవరం కాలువకు అనుసంధానం చేశారు. దీన్ని ఇప్పుడు 8, 8ఎగా విభజించి నిధులు విడుదల చేశారు. ఏలేరు కాలువకు రెండు వైపులా మట్టి తొలగించి కాలువను వెడల్పు చేశారు. తవ్విన మట్టి తిరిగి కాలువలోకి చేరింది. ఈ కారణంగా కాలువ రూపే మారిపోయింది. ఈ పనులు ఎలా చేయాలి అన్నదానిపై అధికారులు ప్రణాళిక తయారు చేస్తున్నారు.

**బడ్జెట్‌లో రూ. 1741 కోట్లు**

పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం రూ.1741 కోట్లు కేటాయించింది. ఇప్పటికే అసంపూర్తి పనులకు రూ.398 కోట్లతో టెండర్లు పిలిచారు. బడ్జెట్‌లో భారీ కేటాయింపుల వల్ల చేసిన పనులకు వెంటనే చెల్లింపులు జరుగుతాయి. ఫలితంగా పనుల్లో జాప్యం ఉండదని ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

# ఆలోచనలు అంకురిస్తున్నాయ్..




విశాఖపట్నం: పోటీ ప్రపంచంలో ఉద్యోగాల కంటే సొంతంగా కంపెనీలు స్థాపించడంపైనే యువత దృష్టి సారిస్తున్నారు. ఇదే సమయంలో అంకుర సంస్థల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత అందిస్తున్నాయి. ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ, విశాఖలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మెడ్‌టెక్ జోన్ తదితర సంస్థలు ఇందుకు సహకరిస్తున్నాయి. వైద్య రంగంలో ఆవిష్కరణలకు..అత్యాధునిక సాంకేతికతను వినియోగించి మెడ్‌టెక్ జోన్‌లో వైద్య రంగంలో అవసరమైన వినూత్న ఆవిష్కరణలు చేపడుతున్నారు. అక్కడి బయోవ్యాలీ ఇంక్యుబేషన్ కౌన్సిల్ ద్వారా ప్రయోగశాల నుంచి ఉత్పత్తులు మార్కెట్‌లోకి తీసుకెళ్లే వరకు సహకరిస్తున్నారు. బయోటెక్నాలజీ, మెడికల్ టెక్నాలజీకి సంబంధించిన హబ్ ఇది. క్రమం తప్పకుండా హ్యాకథాన్స్ నిర్వహిస్తూ.. వినూత్న ఆలోచనలున్న వారిని ఆహ్వానిస్తున్నారు. వాటిపై మరింత పరిశోధన, పరికరాల ఉత్పత్తి ఇక్కడే చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఆ ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మెడ్‌టెక్ జోన్ భరిస్తుంది. ఇక్కడ త్రీడీ బయో ప్రింటింగ్, రీజెనరేటివ్ మెడికల్ ఫెసిలిటీ, స్టెమ్ సెల్ కల్చర్ ఫెసిలిటీ, అత్యాధునిక పరికరాలతో కూడిన ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు %www.biovalleyamtz.in% వెబ్‌సైట్‌లో సంప్రదించొచ్చు.

**ఐవోటీ, ఏఐ డొమైన్లపై..**

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, నాస్కామ్ సంయుక్తంగా ఏయూ ప్రాంగణంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేశారు. ఐవోటీ, ఏఐ ఆధారిత డొమైన్లపై పనిచేస్తున్న అంకుర సంస్థలను అభివృద్ధి చేస్తున్నారు. ఆయా సంస్థలకు మార్గనిర్దేశం చేయడంతోపాటు పెట్టుబడులు ఆకర్షించేందుకు సహకరిస్తున్నారు. ఐవోటీ ప్రయోగశాల, పని ప్రదేశం, అన్ని రకాల సహకారం అందిస్తుంటారు. విపణిలోకి వచ్చేందుకు సిద్ధమైన సంస్థలను పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలతో అనుసంధానం చేస్తున్నారు. 2021 నుంచి ఇప్పటివరకు 182 అంకురాలు నమోదుకాగా 1800 మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. వాటి ద్వారా రాష్ట్ర ప్రభుత్వంలో వైద్యారోగ్యం, పాఠశాల విద్య, మార్క్‌ఫెడ్, ఏపీఎస్ఆర్టీసీలో వివిధ సమస్యలకు పరిష్కారాలు చూపించారు. వినూత్న ఆలోచనలున్నవారు %andhrapradesh.coeiot.com% వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చు.

**ఐఐఎంలో..**ఐఐఎం విశాఖలోని వాణిరావు మెమోరియల్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో 2018 నుంచి వ్యాపార వ్యూహాలు, నిర్వహణ, మార్కెటింగ్, ఆర్థిక వ్యవహారాలు.. ఇలా అన్ని అంశాల్లోనూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు 180కు పైగా సంస్థలకు మార్గనిర్దేశం చేశారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వినూత్న ఆలోచనలతో వచ్చిన అభ్యర్థులను ఎంపిక చేసి, శిక్షణ అందిస్తున్నారు. పనితీరు ఆధారంగా తర్వాతి దశకు ఎంపిక చేస్తారు. అంకురాలు ఏర్పాటైన మొదట్లో సంస్థల కార్యకలాపాలకు 6 నెలల నుంచి ఏడాది వరకు ఆ ప్రాంగణాన్ని వినియోగించుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన టైడ్, నిధి ఏక్సలరేటర్, ఎంఎస్ఎంఈ, స్టార్టప్ ఇండియా తదితర కార్యక్రమాలను ఇక్కడ అమలు చేస్తున్నారు. సహకారం అవసరమైన అభ్యర్థులు iimvfield.com% వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

# ఐటీ ఉద్యోగులా.. సదుపాయాలు కావాలా

కర్నూలు : 'వర్క్ ఫ్రం హోం' చేస్తున్నారా.. మీకున్న సమస్యలేంటి.. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కోరుకుంటున్నారు.. తదితర అంశాలపై సచివాలయ ఉద్యోగులు సర్వే చేయనున్నారు. ఇప్పటికే నంద్యాల జిల్లాలో ప్రారంభించగా కర్నూలులో నుంచి ఇంటింటి సర్వే చేయనున్నారు. ఐటీ, ఇతర ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ (డబ్ల్యూఎఫ్‌హెచ్) అవకాశాలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వేకు శ్రీకారం చుట్టింది. 'వర్క్ ఫ్రం హోం' విధానాన్ని విస్తృతపరచడానికి 'కూటమి' ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా యువతకు స్వగ్రామంలోనే అన్ని సదుపాయాలు కల్పించాలని భావిస్తోంది.

**ఈనెల 10వ తేదీలోగా పూర్తి**

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల లాగిన్‌లో వర్క్ ఫ్రం హోమ్ సర్వేను జీఎస్‌డబ్ల్యూఎస్ ఎంప్లాయిస్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశాలొచ్చాయి. ఉద్యోగుల లాగిన్ ఐడీ ఎంటర్ చేసి బయోమెట్రిక్ లేదా ముఖ ఆధారితంగా లాగిన్ అవ్వాలి. వర్క్ ఫ్రం హోమ్ సర్వే అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అందులో పలు అంశాలు నమోదు చేయనున్నారు. విద్యార్హతలు కలిగిన వారు ఐటీ, ఐటీఈఎస్/ఇతర అనుబంధ సంస్థల్లో పనిచేయడానికి ఆసక్తితో ఉన్నారా ?, లేదా..? అని తెలుసుకోనున్నారు. వర్క్ ఫ్రం హోం సదుపాయానికి ప్రైవేటు భవనాలు అందుబాటులో ఉంటే..వాటి వివరాలను సేకరిస్తున్నారు. ఈనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో ఇప్పటివరకు 53,915 కుటుంబాలను సర్వే చేయగా, ఇంటి నుంచి 1,492 మంది పనిచేస్తున్నట్లు గుర్తించారు.

# అల్లికల పాఠాలు.. ఉపాధికి బాటలు

ఆదోని : బాలికల్లో ఆత్మస్థైర్యం నింపుతున్నారు.. భవిష్యత్తులో తమ కాళ్లపై తాము నిలబడేలా స్వయం ఉపాధి కోర్సులు నేర్పుతున్నారు. ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో రాణించేలా అల్లికలు, ఎంబ్రాయిడింగ్.. కుట్టు.. తదితర అంశాల్లో ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తున్నారు. ఈ కోర్సులో శిక్షణ పూర్తయిన తర్వాత బాలికలకు ప్రత్యేక ఒకేషనల్ పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులకు ధ్రువపత్రాలు ప్రదానం చేస్తున్నారు.

**విద్యార్థి దశ నుంచే..** ఆదోని పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(మైనార్టీ)లో సుమారు 240 మంది విద్యార్థినులు 6 నుంచి ఇంటర్మీడియేట్ వరకు చదువుతున్నారు. విద్యార్థినులకు పుస్తకాల్లోని పాఠాలే కాదు.. బతుకు బాటలు వేసేలా తీర్చిదిద్దుతున్నారు. స్వయం ఉపాధికి అవసరమైన ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ అంజనీ ఆధ్వర్యంలో ఒకేషనల్ కోర్సు ఉపాధ్యాయినీ బాలరాజేశ్వరి విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. టైలరింగ్, కుట్టు, బుట్టలు అల్లడం, రంగురంగు డిజైన్ల ఫ్లవర్‌వాజ్‌లు తయారు చేయడం, డోర్ కర్టెన్, దుస్తులపై ఎంబ్రాయిడింగ్ వంటి వాటిల్లో విద్యార్థినులను నిష్ణాతులను చేస్తున్నారు. బాలికలు తయారు చేసిన పలు డిజైన్లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

**సొంత కాళ్లపై నిలబడేలా..** ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన గౌస్, హుసేన్‌బీ రైతు దంపతుల కుమార్తె నస్రీన్ తొమ్మిదో తరగతి చదువుతోంది.



కష్టపడి చదువుతూనే గత రెండేళ్లుగా స్వయం ఉపాధి కోర్సులో రాణిస్తోంది. బుట్టలు అల్లడం.. డోర్ కర్టెన్ తయారు చేయడం.. కొత్త కొత్త డిజైనింగ్ వస్తువులు చేయడం నేర్చుకుంటున్నా. బాగా చదివి భవిష్యత్తులో మంచి ఉద్యోగం రాకపోయినా బాధపడకుండ ఇప్పుడు నేర్చుకున్న స్వయం ఉపాధి కోర్సుల ద్వారా తన కాళ్లపై తాను నిలబడగలననే నమ్మకం ఉంది. ఈ కోర్సులు బాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతోంది నస్రీన్.

**దుస్తుల కటింగే ప్రధానం**

పెద్దకడబూరు మండలం మేకడోణ గ్రామానికి చెందిన ముల్లా, ఖాజాబాను దంపతుల కుమార్తె ఎం.తరుణ్ తొమ్మిదో తరగతి చదువుతోంది. ఓ వైపు చదువుతూనే మరోవైపు స్వయం ఉపాధి కోర్సులో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటుంది. ముఖ్యంగా ఫ్యాషన్ డిజైన్ కింద ప్రస్తుత అధునికరంగంలో యువతులు మెచ్చే డ్రస్సులు కటింగ్ చేస్తూ.. మోడ్రన్ డ్రస్సులు కుట్టడంలో శిక్షణ తీసుకుంటున్నా. ఒకటికి రెండు మూడు సార్లు కటింగ్ చేస్తూ నూతన డిజైనింగ్ నేర్చుకుంటున్నా. ఈ కోర్సు చేయడం భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని ధీమా వ్యక్తం చేస్తోంది తరుణ్.

**ఎంబ్రాయిడింగ్‌తో ఉపయోగకరం**

ఆదోని పట్టణానికి చెందిన హుసేన్, రహెమత్‌బీ దంపతుల కుమార్తె షాహీన్ కష్టపడి చదవి ఉన్నత స్థాయికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఓ వైపు చదువుతో పాటు విద్యాలయంలో నేర్పిస్తున్న స్వయం ఉపాధి శిక్షణలో రాణిస్తోంది. ఎంబ్రాయిడింగ్ కోర్సులో సాధన చేస్తూ.. రాణిస్తోంది. మార్కెట్‌లో ఎంబ్రాయిడింగ్ చేసే రవికలు, చీరలకు ప్రత్యేకమైన డిమాండు ఉంది. ఈ కోర్సు పూర్తిచేయడం ఎంతో ఉపయోగం. చదువు ముగిసిన తర్వాత ఉద్యోగం రాకపోయినా ఈ కోర్సుతో స్వయం ఉపాధి పొందగలనన్న నమ్మకం కలుగుతోందని చెబుతోంది షాహీన్.

# వీధుల్లో చెత్త గుట్టలు

ఆదోని : గత ప్రభుత్వం తీసుకొచ్చిన చెత్తపన్ను విధానాన్ని 'కూటమి' ప్రభుత్వం రద్దు చేసింది. పుర సిబ్బందే ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మున్సిపాలిటీ ప్రజారోగ్య విభాగం అధికారులు 'చెత్త'శుద్ధి చూపడం లేదు.. ఇంటింటి చెత్త సేకరణపై దృష్టి సారించడం లేదు. వీధుల్లో చెత్త కుప్పలు గుట్టలా పేరుకుపోయాయి. దుర్వాసన వెదజల్లుతోంది.. జిల్లాలో పలు మున్సిపాలిటీల్లో బృందం పరిశీలించగా పలు అంశాలు వెలుగులోకొచ్చాయి. కర్నూలు నగరపాలక సంస్థలో 51 ఆటోలు మినహా ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల పురపాలికల్లో చెత్త సేకరణ ఆటోలు నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయంగా తోపుడు బండ్ల ద్వారా చెత్త సేకరణ చేయాలని నిర్ణయించినా.. ఆ దిశగా పుర అధికారులు అడుగులేయడం లేదు. నంద్యాలలో 36 ఆటోలను



గుత్తేదారు వెనక్కి తీసుకెళ్లారు. ఆదోని 28, ఎమ్మిగనూరు 16 చెత్త సేకరణ ఆటోలు పురపాలికల్లోనే నిలిపివేశారు. ఆత్మకూరులో ఇంతవరకు సొంతంగా డంపింగ్ యార్డు లేకపోవడం వల్ల, శివారు ప్రాంతాల్లో వేస్తున్నారు. నందికొట్కూరులోని స్థలం నిండిపోయి, ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఏ మున్సిపాలిటీనూ తడి, పొడిచెత్త సెగ్రిగేషన్ పనులు జరగడం లేదు. వీధుల్లో చెత్తబండ్లు రాకపోవంతో కాలనీవాసులు రోడ్లపై పడేస్తున్నారు. ప్రజారోగ్య విభాగంలో కార్మికుల కొరత అధికంగా ఉంది.

పుర జనవాణిచెత్త సేకరణ అంశంపై బృందం పలు మున్సిపాలిటీల్లో వివిధ కాలనీలకు వెళ్లి 300 మందిని సర్వే చేయగా

# ప్రైవేటు దందాకు అడ్డేది..?

విశాఖపట్నం : విశాఖ నగరంలోని ద్వారకా బస్‌స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులను పిలిచి మరీ ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లోకి ఎక్కించుకుంటున్నా... ఆర్టీసీ అధికారులు స్పందించడం లేదు. నిబంధనల మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్, బస్ స్టేషన్, బస్‌స్టాపునకు 250 మీటర్లలోపు ప్రైవేటు వాహనాలు నిలపరాదు. అయినా సరే రోజూ రాత్రి 7 గంటల నుంచి ప్రైవేటు బస్సులను ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం సమీపంలోనే నిలిపి ప్రయాణికులను తమ వైపునకు తిప్పుకొంటున్నారు. ఆయా బస్సుల యాజమాన్యాలు ఏకమై.. ఆర్టీసీ అధికారుల ప్రణాళికలకు దీటుగా పథక రచన చేస్తున్నారు. రాజమహేంద్రవరం, విజయవాడ, హైదరాబాద్, కర్నూలు, కడప... ఇలా అన్ని ప్రాంతాలకు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు.

**పట్టించుకోని పోలీసులు**

శిరస్త్రాణం లేకుండా ద్విచక్ర వాహనాలపై వెళ్లే సామాన్యుల వెంటపడి మరీ ఫొటోలు తీస్తున్న ట్రాఫిక్ పోలీసులు... ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద గంటల తరబడి ప్రైవేటు వాహనాలు నిలుపుతున్నా, పట్టించుకోకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నెలవారీ మామూళ్లు స్టేషన్లకు అందుతుండడంతోనే పోలీసులు ఆయా బస్సుల



జోలికి వెళ్లడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

**పగలూ అంతే..!**

రోజూ రాత్రి పూట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా బస్సులు నిలుపుతుండగా, ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీకాకుళం, టెక్కలి, పలాస, చాపర, రాయగడ ఇలా అన్ని ప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు బస్సుల్ని 222 తగరపువలస బస్‌స్టాపునకు సమీపంలోనే నిలిపి ప్రయాణికులను తీసుకెళ్తున్నారు. ప్రతి బస్సుకు బోర్డు పెట్టి మరీ ప్రయాణికులను ఎక్కించుకుంటున్నా... అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి.. ప్రైవేటు దందాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

# పురాలకు జలధారలు

నంద్యాల : పట్టణీకరణ పెరుగుతోంది.. వివిధ అవసరాల నిమిత్తం పల్లె జనం పట్టణాల్లో నివాసం ఉంటోంది.. ఒక మనిషికి నిత్యం 135 లీటర్ల మేరకు ఇవ్వాలి.. వంద లీటర్లు కూడా ఇవ్వడం లేదు.. అది కూడా 60 శాతం మందికే అందుతోంది. ప్రస్తుత కొరత, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఇంటికి మంచినీళు ఇచ్చేలా 'కూటమి' ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం పల్లెల్లో కొనసాగుతున్న జల్ జీవన్ పథకాన్ని పట్టణాల్లో చేపట్టాలని నిర్ణయించింది. జలాశయాల నుంచి తీసుకొచ్చే అవకాశాలు పరిశీలిస్తోంది. ప్రైవేటు సంస్థలతో డీపీఆర్‌లు తయారు చేయించింది.

**గాజులదిన్నె.. అలగనూరు**

ఎమ్మిగనూరు మున్సిపాల్టీకి గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా నీటిని తీసుకునేందుకు సమాలోచనలు చేస్తున్నారు.

నందికొట్కూరు పురపాలక సంఘానికి అలగనూరు జలాశయం నుంచి నీటిని అందించనున్నారు. ఇప్పటికే అలగనూరు ప్రాజెక్టు మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనికి సమాంతరంగా పైపులైన్లు వేసి నందికొట్కూరుకు మంచినీటిని అందించనున్నారు.

ఆత్మకూరు మున్సిపాల్టీలో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొంది. ఇక్కడ ఏళ్లుగా ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఇక్కడి ప్రజలకు వెలుగోడు జలాశయం ద్వారా 0.453 టీఎంసీల నీటిని



వినియోగించనున్నారు. ఆరు లక్షల మందికి పైగా జనాభా ఉన్న కర్నూలు నగరపాలకకు ప్రస్తుతం అందిస్తున్న జలాలకంటే మరో 40 ఎంఎల్ నీటిని అదనంగా ఇవ్వాల్సి ఉంది. కర్నూలు నగరానికి 44 కి.మీల దూరంలో ఉన్న గోరుకల్లు ప్రాజెక్టు ద్వారా 0.675 టీఎంసీలు తీసుకోవడానికి వీలుందని ప్రతిపాదించారు.

**గోరుకల్లు జలఆశయం**

రెండు జిల్లాల్లోని పలు మున్సిపాల్టీలకు గోరుకల్లు జలాశయం నుంచి నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే బేతంచెర్ల, డోన్ పురపాలక సంఘాలకు ఇక్కడి నుంచి నీటిని తరలించే పనులు కొనసాగుతున్నాయి. కర్నూలు నగరపాలక, నంద్యాల, ఆళ్లగడ్డ పురపాలక సంఘాలకు జలాశయం ద్వారా మంచినీటిని అందించేలా డీపీఆర్ రూపొందించారు. జిల్లా కేంద్రం నంద్యాలకు ప్రస్తుతం పూటకు 32 ఎంఎల్ నీటిని ఇవ్వాల్సి ఉండగా 25 ఎంఎల్ సరఫరా చేస్తున్నారు. అమృత్ స్కీం ద్వారా వెలుగోడు రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకుని పట్టణ అవసరాలు తీర్చేందుకు పనులు చేపట్టారు. అదనంగా గోరుకల్లు నుంచి కూడా నీటిని అందించేలా ప్రతిపాదనలు చేస్తున్నారు.

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆళ్లగడ్డ మున్సిపాల్టీకి గోరుకల్లు ద్వారా నీటిని తీసుకెళ్లేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

**ఆదోనికి పులికనుమ అండ**

ఆదోని పురపాలక ప్రజలకు పులికనుమ ప్రాజెక్టు నుంచి రోజుకు అవసరమైన 25 ఎంఎల్ నీటిని అందించేందుకు నిర్ణయించారు. ప్రస్తుతం ఇక్కడ రూ.50 కోట్లతో చేపట్టిన అమృత్ పనులు ఇంకా 30 శాతం వరకు చేయాల్సి ఉంది. ఈ పనులతో పాటు ప్రతిపాదిత జల్‌జీవన్ పథకం ద్వారా 0.657 టీఎంసీల నీటిని అందిస్తే మరో 70 వేల మంది ప్రజలకు నీటి కష్టాలు తీరనున్నాయి.

పది పట్టణాలకు నిత్యం ఇవ్వాల్సింది : 400420 (మిలియన్ లీటర్లు)
ప్రస్తుతం సరఫరా చేస్తోంది : 300-325
పుర పాలికలు : 10 జనాభా : 1618 లక్షలు

# కారుణ్యంపై కరుణ చూపేరా!




అనంతపురం : ఆర్టీసీలో కారుణ్య నియామకం కోసం ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దయతో ఇచ్చే ఉద్యోగానికి కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి. ఎవరైనా ఉద్యోగి మృతి చెందితే ఖాళీలను బట్టి ఆ ఉద్యోగి భార్య, భర్త, కుమారుడు, కుమార్తెలకు సాధారణ నియామకాలతో సంబంధం లేకుండా ఉద్యోగం ఇవ్వాల్సి ఉంటుంది. ఆర్టీసీలో ఖాళీలు, కోరుకున్న పోస్టులు లేకపోవడం తదితర కారణాలతో ఏళ్లుగా కారుణ్య నియామకాలు పొందలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించింది. అధికారులు ఆ దిశగా అడుగులు వేసినా నియామకాల్లో జాప్యం చేస్తున్నారు. కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్ది గ్రామానికి చెందిన నాగభూషణం డ్రైవర్‌గా పని చేస్తూ 2012 మే 14న మృతిచెందారు. ఆయన కుమారుడికి పక్షపాతం ఉండటంతో కూతురు లావణ్యకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామంటూ ఆర్టీసీ యాజమాన్యం హామీ ఇచ్చింది. 28 మే 2022లో ఉద్యోగం కల్పించాల్సి ఉన్నా.. ఇప్పటి దాకా పలు కారణాలతో జాప్యం చేశారు. ఇలాంటి వారు చాలా మంది ఉన్నారు.

**కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ఇంకొందరికి అవకాశం**

వాస్తవానికి ఆర్టీసీ ఉద్యోగులు 1 జనవరి 2020 నుంచి ప్రజా రవాణాశాఖ ఉద్యోగులుగా విలీనం అయ్యారు. గతంలో 2016 నుంచి 2019 డిసెంబరు వరకు మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు ఇచ్చేందుకు నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015 డిసెంబరు 31 ముందు మృతిచెందిన కుటుంబాలకు వర్తింప చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో 46 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. ఇప్పటికే చాలా మందికి వయస్సు అర్హతకు ప్రతిబంధకంగా ఉండటంతో మినహాయింపు ఇవ్వాలని కొందరు కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వస్తుందని వేచి చూస్తున్నారు.

**ఇతర జిల్లాల్లో చేపట్టినా.. అనంతలో జాప్యం**

ఉమ్మడి జిల్లాలో కారుణ్య నియామకాలకు అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. 41 మంది కండక్టర్లుగా చేరడానికి ఆమోదం తెలిపారు. ఆర్టీసీలో 80 వరకు కండక్టరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొందరు ఎత్తు తక్కువగా ఉండటం, అర్హత లేకపోవడంతో ఎంపిక చేయలేదు. అర్హత ఉండి ఉద్యోగం చేయడానికి అంగీకరించిన వారికి కూడా ఇవ్వడం లేదు. ఉద్యోగాల ఎంపికకు ఇంటర్వ్యూలు, ధ్రువపత్రాలు పరిశీలించి రెండున్నర నెలలు దాటుతున్నా ఇంకా నియామకాలు చేయలేదు. కడప రీజియన్ పరిధిలోని పలు జిల్లాల్లో ఇప్పటికే నియామకాలు చేపట్టారు.

**ఆర్టీసీలో నియామకాలకు తప్పని నిరీక్షణ**

అందనంగా ప్రయోజనం పొందేవారు: 46
వయస్సు ఎక్కువ, తక్కువ, ఇతర కారణాలు: 32
ప్రభుత్వ శాఖల్లో కోరుకున్నది: 25
ఆర్టీసీలో అంగీకరించింది: 41
ఉమ్మడి జిల్లా నుంచి హాజరు: 98 మంది
కారుణ్య నియామకాలకు పరిశీలన: 26-12-2024

# రాయదుర్గం- తుమకూరు రైలు మార్గం పూర్తయ్యేదెన్నడో?



రాయదుర్గం : రాయదుర్గం-తుమకూరు బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ ఎన్‌డీఏ ప్రభుత్వంలోనైనా పూర్తవుతుందా అంటూ ఈ ప్రాంత ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రైల్వే బడ్జెట్‌లో ఈ లైనుకు రూ.434 కోట్లు కేటాయించటంతో స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. 2011 అక్టోబర్ 21వ తేది అప్పటి రైల్వేశాఖా మంత్రి దినేశ్ త్రివేది రాయదుర్గం-తుమకూరు రైలు మార్గానికి భూమి పూజ చేశారు. ఐదేళ్లలో పనులు పూర్తి చేస్తామని అప్పటి రైల్వే అధికారులు పేర్కొన్నారు. అయితే 13 ఏళ్లవుతున్నా 50 శాతం మేర మాత్రమే పనులు పూర్తయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణలు రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న, జీఎం అరవింద్ శ్రీవాత్సవకు విజ్ఞప్తి చేశారు.

**భూసేకరణలో జాప్యం** ఆరంభంలో భూసేకరణలో జాప్యం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వాల వాటాల విడుదలలో జాప్యం, కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించకపోవటం, సర్వే, మార్కింగ్‌లు తదితర పనులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం దొడ్డహళ్ళి నుంచి కర్ణాటకలోని పావగడ పట్టణాల మధ్య మట్టి పనులు, రైల్వే ట్రాక్ పనులు, స్టేషన్ భవనాల నిర్మాణాలు, వంకలపై కాజ్‌వేల పనులు జరుగుతున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 36 ఎకరాలు సేకరించాల్సి ఉంది. 130 మంది రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉంది.

**పూర్తయితే ప్రయోజనాలెన్నో..**

రాయదుర్గం- తుమకూరు రైల్వే మార్గం పూర్తయితే బెంగళూరుకు తక్కువ సమయంలో చేరుకోవచ్చు. రాయదుర్గం- బెంగళూరు మధ్య మొత్తం 411 కిలోమీటర్ల దూరం ఉండగా 140 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ప్రస్తుతం బెంగళూరుకు వెళ్లేందుకు 8 గంటల సమయం పడుతుండగా ఇకపై ఆరు గంటల్లోనే చేరుకోవచ్చు. ఆంధ్రా, కర్ణాటక రాష్ట్రాల్లో దుస్తుల పరిశ్రమ, ఇతర వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. విద్యార్థులు, ఉద్యోగులు, వలస కూలీలు సకాలంలో గమ్యస్థానాలు చేరుకోవచ్చు.

**పెరిగిన నిర్మాణ వ్యయం**

రాయదుర్గం నుంచి తుమకూరు వరకు మొత్తం 206 కిలోమీటర్ల దూరం ఉండగా ఇప్పటి వరకు 103 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. మొదట్లో రూ.1,050 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేయగా, 2012లో రూ.1,714.50 కోట్లకు బడ్జెట్ పెరిగింది. ప్రస్తుతం 50 శాతం పనులకే రూ.2,450 కోట్ల మేర ఖర్చు చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలు 50 శాతం మేర నిధులు కేటాయించాల్సి ఉంది.

**ఏయే పట్టణాల మధ్య** రాయదుర్గం, కళ్యాణదుర్గం, పావగడ, మడకశిర, మధుగిరి, కొరటగెరె, తుమకూరు పట్టణాల మధ్య రైల్వే లైన్ వెళుంది. ఆంధ్రప్రదేశ్‌లో 94 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ వేయాల్సి ఉండగా ఈ నిర్మాణం పూర్తయింది. కర్ణాటకలో 113 కిలోమీటర్లమేర పనులు వేగంగా జరుగుతున్నాయి.

# వ్యూహం.. సిద్ధం!



విశాఖ : మహా విశాఖ నగరపాలక సంస్థ మేయర్ పీఠం దక్కించుకోవడానికి కూటమి నాయకులు వ్యూహాలు సిద్ధం చేసినట్టు సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత వైకాపా చేతిలో ఉన్న కొన్ని మున్సిపాలిటీలను కూటమి నాయకులు చేజిక్కించుకున్నారు. అయితే విశాఖ మేయర్ పీఠంపై ఇన్నాళ్లు ఎలాంటి నిర్ణయం తీసుకోని కూటమి అగ్ర నాయకులు... ఇపుడు మేయర్ మార్పునకు అంగీకరించినట్లు తెలిసింది.

**నాలుగేళ్లు పూర్తవడంతో..:** ఇదే అంశంపై ఇప్పటికే నగర ఎమ్మెల్యేలు ప్రత్యేక సమావేశం నిర్వహించి, వివిధ అంశాలపై చర్చించారు. మార్చి 18 నాటికి జీవీఎంసీ పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో, ఆ తర్వాత మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కూటమి నాయకులు పావులు కదుపుతున్నారు.

ఇప్పటికే లెక్కలు, సమీకరణాలపై దృష్టి సారించిన నాయకులు, వాటిని అమలు చేయడానికి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీవీఎంసీ బడ్జెట్ సమావేశాన్ని నేటి వరకు నిర్వహించలేదు. ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేసి, బడ్జెట్‌ ఆమోదించిన తర్వాత... మరో కౌన్సిల్ సమావేశంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నారు.

**'వైకాపా' ప్రయత్నాలు:** కూటమి తరఫున అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే.. మరో ఎనిమిది మంది కార్పొరేటర్ల మద్దతు అవసరం ఉంటుంది. కలెక్టర్‌కు ఇచ్చే నోటీసులో సంతకాలు పెట్టాల్సి ఉండటంతో, వైకాపా కార్పొరేటర్లు బయటకు వస్తారా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల వైకాపా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసి, పార్టీ మారొద్దని, భవిష్యత్తు బాగుంటుందని హితబోధ చేశారు. అయితే మేయర్‌పై ఉన్న వ్యతిరేకతతో కార్పొరేటర్లు సంతకాలు చేసేందుకు ముందుకొస్తారని కూటమి నాయకులు చెబుతున్నారు.

**సంతకాలపై దృష్టి:** అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే ముందు మెజార్టీ సభ్యుల సంతకాలు సేకరించాల్సి ఉంటుంది. ఆ సంతకాలతో పాటు, అవిశ్వాసం పెట్టడానికి వీలుగా సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం కౌన్సిల్‌లో 97 మంది సభ్యులు ఉండగా, 64 మంది కార్పొరేటర్లు అవిశ్వాసానికి అనుకూలంగా సంతకాలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత బలాబలాలు చూస్తే కూటమికి 56 మంది, వైకాపాకు 39 మంది, సీపీఎంకు ఒకరు, సీపీఐకి ఒకరు ఉన్నారు.

# లెక్క తప్పిన ముక్క

ఆదోని : ఆదోని మండలం మండిగిరి బీసీ వసతి గృహంలో 225 మంది విద్యార్థులు ప్రవేశం తీసుకొన్నారు. ఆదివారం 140 మంది విద్యార్థులే ఉన్నారు.. వారికి అన్నం, పప్పు, రసం వడ్డించారు. సంక్షేమాధికారి అందుబాటులో లేరు. మంచినీటి క్యాన్లలో విద్యార్థులే నీటిని నింపి తాగడానికి సిద్ధం చేసుకొన్నారు. వసతిగృహాల్లో మంగళ, శుక్రవారాలు రాత్రి భోజనంలో చికెన్ కర్రీ ఇవ్వాలి. ఆదివారం మధ్యాహ్నం చికెన్ బిర్యానీ పెట్టాలి. చాలా వసతిగృహాల్లో బిర్యానీకి బదులు చికెన్ కర్రీతో సరిపెట్టారు. ఎక్కడా సంక్షేమాధికారులు లేరు.. అక్కడి సిబ్బందే దగ్గరుండి చూసుకొన్నారు. కొన్నిచోట్ల రైతా ఇవ్వలేదు. గోంగూర చట్నీ మాత్రమే ఇచ్చి పెట్టింది తినమని హెచ్చరించారు." చిన్న పిల్లలకు ఒక్కటి.. పెద్దోళ్లకు రెండు.. దుకాణంలో తీసుకొచ్చింది ఎక్కువ.. విద్యార్థులకు వడ్డించింది తక్కువ.. సంక్షేమ అధికారులు లేరు.. సిబ్బంది పెట్టిందే లెక్క.. ఇది వసతి గృహాల్లో ఆదివారం అమలైన చికెన్ మెనూ. సెలవు రోజు కావడంతో కొందరు విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు.. మరికొందరి విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటి భోజనమే తెచ్చి పెట్టారు.. కానీ వీరంతా వసతి గృహంలో తిన్నట్లే లెక్కలు రాసుకొన్నారు. బృందం జిల్లా వ్యాప్తంగా పలు వసతి గృహాలను పరిశీలన చేయగా లెక్క తప్పిన 'ముక్క' అంశాలు వెలుగులోకి వచ్చాయి."

**బిర్యానీ మాయం**



తొలిదళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గ్రామమైన పెద్దపాడులోని సాంఘిక సంక్షేమ వసతిగృహంలో 245 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. ఆదివారం 220 మంది విద్యార్థులే ఉన్నారు. ఆదివారం చికెన్ బిర్యానీకి బదులుగా చికెన్ కూర, గోంగూర చట్నీ, అన్నం వడ్డించారు. సంక్షేమాధికారి అందుబాటులో లేరు.

**వేసేది ఒకట్రెండు ముక్కలే**

బీసీ, సాంఘిక సంక్షేమ, గిరిజన వసతిగృహాల విద్యార్థులకు వారానికి మూడుసార్లు విధిగా చికెన్ ఇవ్వాలి. ఆదివారం మధ్యాహ్న భోజనంలో, మంగళ, శుక్రవారాల్లో రాత్రివేళల చికెన్ వడ్డించాలి. ప్రతి విద్యార్థికి 100 గ్రాముల చికెన్ కచ్చితంగా ఇవ్వాల్సి ఉంది. కానీ వసతిగృహ నిర్వాహకులు సగటున ఒక్కో విద్యార్థికి 70- 80 గ్రాముల్లోపే అందిస్తున్నారు. కొన్నిచోట్ల మరీ నామమాత్రంగా చిన్న ముక్క ఒకటి వేస్తున్నారంతే. వసతిగృహాల సమీపంలోని మాంసం దుకాణాల నుంచే చికెన్ కొనుగోలు చేస్తున్నారు. ఈ సెంటర్ల నుంచి ఏడాది పొడువునా ఒకే పరిమాణంలో చికెన్ కొనడం లేదు. ఒకరోజు ఒక్కో పరిమాణంలో కొంటున్నారు. విద్యార్థుల సంఖ్య ఒకేలా ఉన్నాసరే చాలా తక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు.

# బిల్లు తగ్గించేద్దాం

కర్నూలు : మార్చి వచ్చేసింది.. సూరీడు సుర్రుమంటున్నాడు.. ఇంట్లో ఉంటేనే 'మాడి'పోతోంది.. జనం ఉక్కపోతకు తాళలేక చల్లదనం కోసం పరుగులు పెడుతున్నారు. ఇళ్లల్లో ఫ్యాన్లు వేగంగా తిరుగుతున్నాయి.. ఏసీలు ఆగడం లేదు.. చల్లని వస్తువుల కోసం ఫ్రిజ్ తలుపులు పదే పదే తెరవాల్సి వస్తోంది.. దీంతో ఇంట్లో విద్యుత్తు మీటరు గిర్రున తిరుగుతోంది..వచ్చే నెల గుండె గు'బిల్లు'మనడం ఖాయం.. ఈ నేపథ్యంలో కొన్ని మెలకువలు పాటిస్తే విద్యుత్తు వినియోగాన్ని తగ్గించొచ్చని విద్యుత్తుశాఖ కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి అంటున్నారు.

**బల్బులు** సాధారణ గుండ్రని ఫిలమెంట్ బల్బు ఎక్కువ విద్యుత్తును వినియోగిస్తుంది. అదే ఎల్ఈడీ బల్బు అయితే తక్కువ విద్యుత్తును తీసుకుంటుంది. 60 వాట్ల ఫిలమెంటు బల్బు ఇచ్చే వెలుగును.. 9 వాట్స్ ఎల్ఈడీ బల్బు ఇస్తుంది.

**ఫ్యాన్లు** బీఎల్‌డీసీ టెక్నాలజీతో తయారు చేసిన ఫ్యాన్ల వాడకంతో విద్యుత్తు వినియోగం కొంత వరకు తగ్గించుకోవచ్చు. రెగ్యులేటర్లు పనిచేయక ఫుల్ స్పీడుతో తిరుగుతుంటాయి. దీని వల్ల బిల్లు అధికంగా వస్తుంది. 1 లేదా 2 వేగంతో తిరిగితే సగం బిల్లు ఆదా అవుతుంది. దెబ్బతిన్న బేరింగ్(శబ్ధం వస్తుంది)లు వెంటనే సరి చేయించాలి లేదంటే మోటారుపై లోడు పడి ఎక్కువ విద్యుత్తు వినియోగమవుతుంది.

**ఏసీ** ఏసీ కెపాసిటీని టన్నుల్లో కొలుస్తారు. సాధారణంగా ఒక టన్ను నుంచి 2 టన్నుల వరకు ఏసీలు ఉంటాయి. 3 స్టార్ ఏసీ కొంత ఎక్కువ విద్యుత్తును వినియోగిస్తే.. 5స్టార్ ఏసీ తక్కువ విద్యుత్తును



వినియోగిస్తుంది. వెయ్యి వాట్ల ఏసీ ఒకగంట సేపు పని చేస్తే ఒక యూనిట్ విద్యుత్తు కాలుతుంది. అదే 1500 వాట్ల ఏసీ గంటసేపు పనిచేస్తే 1.5 యూనిట్లు ఖర్చవుతుంది. ఏసీ సెట్టింగ్‌ను 24 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు పిల్లర్లు శుభ్రంగా ఉంచుకోవాలి. బయట నుంచి వేడి గాలులు రాకుండా కర్టెన్లు వేసి ఉంచాలి. కొంతసేపు వేసుకొని.. తర్వాత ఫ్యాన్ వేసుకుంటే గది చల్లగా ఉంటుంది.

**ఫ్రిజ్** ఫ్రిజ్ తలుపు ఒక్కసారి తెరిస్తే అరగంట కూలింగ్ నష్టపోవాల్సి ఉంటుంది. కాబట్టి సాధ్యమైనంత వరకు తక్కువసార్లు తెరవాలి. వేడి ఉన్న చోట్ల పెడితే ఎక్కువ విద్యుత్తు వినియోగమవుతుంది. వెనుక భాగాన్ని గోడకు ఆనకుండా గాలి తగిలేలా ఉంచాలి.

# పదేళ్ల తర్వాత ఇవేం మాటలు పాయల్...?

ఆర్‌ఎక్స్ 100, RDX లవ్, మంగళవారం వంటి విభిన్న చిత్రాల్లో నటిస్తూ దాదాపు పదేళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను క్రియేట్ చేసుకున్న ముద్దుగుమ్మ పాయల్ రాజ్‌పూత్. హీరోయిన్‌గా ఈమె నటించిన సినిమాల్లో ఎక్కువ శాతం స్కిన్ షో కు పరిమితం అయింది. ఈమధ్య కాలంలో హీరోయిన్స్ ఎక్కువగా స్కిన్ షో కే పరిమితం అవుతున్నారు. అయితే చాలా మంది హీరోయిన్స్ మాదిరిగా కాకుండా ఈమెకు నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు, సినిమాలు బాగానే పడ్డాయి. ముఖ్యంగా ఈమె ఆర్‌ఎక్స్ 100, మంగళవారం సినిమాల్లో నట విశ్వరూపం చూపించే అవకాశం దక్కించుకుంది. ప్రస్తుతం టాలీవుడ్‌లోనే కాకుండా ఇతర భాషల్లోనూ మంచి గుర్తింపు కలిగి ఉన్న పాయల్ సోషల్ మీడియా ద్వారా షేర్ చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్‌లో పాయల్ రాజ్‌పూత్... సినిమా ఇండస్ట్రీలో నటిగా కొనసాగడం అనేది అత్యంత కఠినమైనది. ప్రతి రోజు ఒక అనిశ్చితితో మొదలవుతుంది. నేను ప్రతి సారి ప్రతిభను కప్పిపుచ్చే ప్రపంచంలోకి అడుగు పెడుతూ ఉంటాను. కొందరు కావాలని తొక్కేస్తూ ఉంటే, కొందరు తమ వారి కోసం ప్రతిభను తొక్కేస్తూ ఉంటారు. ప్రముఖ ఇంటి పేరు కలిగి ఉన్న వారు సినిమా ఆఫర్లను దక్కించుకోవడం చూస్తూ ఉంటాను. ఎంతో



కష్టపడి, అంకిత భావంతో పని చేస్తున్నప్పటికీ కొన్ని సార్లు దక్కాల్సిన గుర్తింపు దక్కడం లేదు, రావాల్సిన అవకాశాలు రావడం లేదు. నెపొటిజం ఎక్కువగా ఉన్న ఇండస్ట్రీలో అవకాశాలు దక్కించుకోవడం అనేది చాలా పెద్ద విషయంగా మారిందని ట్వీట్ చేసింది. సాధారణంగా కొత్తగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన హీరోయిన్స్, ఆఫర్లు లేక ఇబ్బందులు పడుతున్న హీరోయిన్స్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ ఉంటారు. నెపొటిజం కారణంగా ఇండస్ట్రీలో ఆఫర్లు రావడం లేదని చాలా మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ పాయల్‌కి ఇన్నాళ్లు చాలానే ఆఫర్లు వచ్చాయి. వచ్చిన అవకాశాలతో సద్వినియోగం చేసుకోకుండా ఇంకా ఆఫర్లు రావడం లేదని వాపోవడం ఏంటో అంటూ కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2017లో చన్నా మెరెయ పంజాబీ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన పాయల్ రాజ్‌పూత్ టాలీవుడ్‌లో ఆర్‌ఎక్స్ 100 సినిమాను చేయడానికి ముందు హిందీలో ఒక సినిమాను చేసింది. ఆ సినిమాలతో దక్కని గుర్తింపు ఆర్‌ఎక్స్ 100 తో దక్కింది. తెలుగులో పలు సినిమాల్లో నటించి హిందీ, తెలుగు, కన్నడ, తమిళ్ భాషల్లో పలు సినిమాల్లో నటించిన పాయల్ రాజ్‌పూత్ ఇప్పుడు ఎందుకు ఇండస్ట్రీలో ఆఫర్లు రావడం లేదని ఎందుకు అంటుంది అనేది చర్చనీయాంశంగా మారింది. ఏప్రిల్ 1న ఈమె ట్వీట్ చేసింది కనుక ఇది ఏమైనా తన ఫాలోవర్స్‌ను ఫూల్స్‌ను చేయడంలో భాగంగా ఏమైనా చేసిందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాలీవుడ్‌లో ఈమె అవకాశాల కోసం ప్రయత్నాలు చేస్తుందని, ఆ ప్రయత్నాలు విఫలం అవుతున్న కారణంగా తాను ఇలా ఆవేదన వ్యక్తం చేస్తూ ఉండవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు ఆ ట్వీట్స్‌ను పాయల్ ఎందుకు చేసింది అనేది ఆమెనే మరింత క్లారిటీగా చెబితే బాగుంటుంది అని కొందరు అంటున్నారు.

# ఆ పెయిన్ రకుల్ కి మరికొన్ని నెలలు తప్పదు!

రకుల్ ప్రీత్ సింగ్ గత ఏడాది అక్టోబర్ లో జిమ్లో వర్కౌట్ చేస్తుండగా బ్యాలెన్స్ తప్పడంతో వెన్నుపూసకు గాయమైన సంగతి తెలిసిందే. 80 కిలోల బరువును డెడ్ లిఫ్ట్ చేసే సమయంలో? గాయపడింది. అయినా ఆ నొప్పిని పట్టించుకోకుండా మొండిగా వ్యాయామం కొనసాగించింది. దీంతో ఆ గాయం తీవ్రమైంది. ప్రతిగా శస్త్ర చికిత్స వరకూ వెళ్లాల్సి వచ్చింది. వారం రోజులు బెడ్ రెస్ట్...కోలుకోవడానికి నెలలు సమయం పడుతుందని డాక్టర్లు చెప్పారు. ఇదే విషయాన్ని అమ్మడు సోషల్ మీడియాలో తెలిపింది. దీంతో రకుల్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా త్వరగా కోలుకోవాలని పోస్టులు కూడా పెట్టారు. తాజాగా ఈ గాయం కొత్త అప్ డేట్ అందించింది.



మునుపటి కంటే ఇప్పుడు కొంచెం కోలుకున్నానని తెలిపింది. కానీ గాయం నుంచి మాత్రం పూర్తిగా ఇంకా కోలుకోలేదని..అందుకు మరింత సమయంపడుతుందని తెలిపంది.

శరీరం ఇచ్చే సంకేతాలు పట్టించుకోకుండా వ్యవహరిస్తే తనలాగే బాధపడాల్సి ఉంటుందని..ఎవరూ అలాంటి పనులు ఎప్పుడు చేయొద్దని సూచించింది. లక్కీగా రకుల్ చేతిలో సినిమాలు లేవు కాబట్టి సరిపోయింది. లేదంటే దర్శక, నిర్మాతలు చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఇండియాన్ 3 లో నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. అలాగే బాలీవుడ్ లో దే దే ప్యార్ దే 2-లోనూ నటిస్తోంది. ఈ సినిమా సెట్స్ లో ఉంది. రకుల్ అవసరం లేకపోవడంతో యూనిట్ కూల్ గా షూటింగ్ చేసుకుంటుంది. డబ్బింగ్ పనులు మొదలైతే మాత్రం రకుల్ స్టూడియోకి వెళ్లాల్సి ఉంటుంది.

అప్పటి వరకూ ఎలాంటి ఇబ్బంది లేదు. ఇంట్లో మాత్రం కొత్త స్క్రిప్టులు వింటోంది. స్క్రిప్ట్ లు ఒకే చేసినా గాయం నుంచి పూర్తిగా కోలుకునే వరకూ అవి పట్టాలెక్కే అవకాశం లేదు.





# తారక్.. క్లాస్ లో హై వోల్టేజ్ మాస్



జూనియర్ ఎన్టీఆర్ దేవర సినిమాతో కమర్షియల్ గా మంచి సక్సెస్ అందుకున్న విషయం తెలిసిందే. టాక్ ఎలా ఉన్నా కూడా తన స్టార్ ఇమేజ్ తో బాక్సాఫీస్ వద్ద మొదటిసారి సోలోగా 500 కోట్ల మార్క్ ను టచ్ చేశాడు. ఇక %===% తో వచ్చిన క్రేజ్ తో దేవర సినిమాను జపాన్ లో రిలీజ్ చేసేందుకు రెడీ అయ్యారు. ఇక తారక్ ప్రమోషన్ కోసం జపాన్ టూర్‌లో ఉన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో అక్కడ వచ్చిన క్రేజ్‌ను కొనసాగించేలా ఈసారి కూడా ఎన్టీఆర్ స్టైల్, ఎనర్జీతో జపనీస్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నారు. మార్చి 28న జపాన్‌లో విడుదలైన దేవర పార్ట్ 1 ఇప్పటికే మంచి స్పందన తెచ్చుకుంటోంది. ఈ హైప్ మధ్య తారక్ స్టైల్‌లో ఇచ్చిన ఓ క్లాసీ ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఫోటోలో ఎన్టీఆర్ బ్లాక్ అవుట్‌ఫిట్‌లో స్టన్నింగ్‌గా కనిపించారు. బ్లాక్ అండ్ వైట్ కాంబినేషన్లో షర్ట్, బాగీ ప్యాంట్, సూటబుల్ మ్యాచింగ్ షూస్‌తో పాటు సన్‌గ్లాస్ ధరించి మోడ్రన్ లుక్‌తో కనిపించిన తారక్.. ఫ్యాషన్‌కి డెఫినిషన్‌ను మార్చేశారు. టోక్యోలో ఓ స్టార్ హోటల్‌లో దిగిన ఈ ఫోటో, అభిమానుల హృదయాలను దోచుకుంటోంది. "స్టైల్ అంటే ఇదే.. తారక్ లుక్ అంతే అదిరిపోయింది" అంటూ కామెంట్ల వర్షం కురుస్తోంది. తారక్ విండో పక్కన నిలబడి ఇచ్చిన ఆ సింపుల్ పోజ్‌కి ఎంత పవర్ ఉందంటే, తక్కువ కష్టంతో ఎక్కువ ఇంపాక్ట్ ఎలా సృష్టించాలో చూపించినట్టు ఉంది. అభిమానులు "క్లాస్ లుక్‌తో మాస్ స్టైల్" అంటూ సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ చేస్తున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత జపాన్‌లో తారక్‌కి ఏర్పడ్డ ఫాలోయింగ్‌ను నిలబెట్టేందుకు తారక్ తీసుకున్న స్టెప్ ఇది. అభిమానుల ప్రేమను నిలబెట్టుకుంటూ తను ఎంత స్టైలిష్‌గా మారాడో నిరూపించేశారు. దేవర సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, అనిరుధ్ మ్యూజిక్ అందించారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, తారక్ మాస్ లుక్ సినిమాకి ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి. ముఖ్యంగా జపాన్‌లో ఈ సినిమా విడుదలకు ముందే ఎన్టీఆర్ చేసిన ఫోటోషూట్లు, మీడియా ఇంటర్వ్యూలు, స్టెప్పింగ్ పబ్లిసిటీ అన్నీ కలిపి అక్కడా ఓ మాస్ హైప్ క్రియేట్ చేశాయి. ప్రస్తుతం ఈ బజ్‌కి తారక్ స్టైలిష్ లుక్ మరింత బూస్ట్ ఇచ్చాయి. ఇక జపాన్‌లోని అభిమానులు ఎన్టీఆర్‌కి స్వాగతం పలికే విధానం చూస్తుంటే, ఆయనకు అక్కడ ఎంత క్రేజ్ ఉందో అర్థమవుతుంది. ఎలాగూ దేవర తొలి భాగం విజయం దిశగా ముందుకు సాగుతుండగా, రెండో భాగానికి కూడా ఇదే ఊపు కొనసాగనుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ దశలో ఉన్న పార్ట్ 2 త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. కాగా, జపాన్ ప్రమోషన్లు పూర్తయిన వెంటనే తారక్ మళ్లీ ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్‌లో బిజీ కానున్నారు.

# 'సర్దార్ 2' అప్డేట్.. కార్తీ నట విశ్వరూపం!




కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ ప్రస్తుతం సర్దార్ 2 మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. బ్లాక్ బస్టర్ హిట్ మూవీ సర్దార్ కు సీక్వెల్ గా వస్తున్న ఆ సినిమాకు పీ ఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మాత ఎస్. లక్ష్మణ్ కుమార్ భారీ బడ్జెట్ తో సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే సర్దార్-2 పై భారీ బజ్ క్రియేట్ అయింది. రీసెంట్ గా మేకర్స్.. సినిమా నుంచి కార్తీ ఫస్ట్ లుక్ తో పాటు ప్రోలాగ్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ అదిరిపోగా.. సీక్రెట్ ఏజెంట్ గా కార్తీ సినిమాలో కనిపించనున్నారని క్లియర్ గా తెలుస్తోంది. ప్రస్తుతం ప్రోలాగ్ వీడియో సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. మూవీ లవర్స్ నుంచి మంచి రెస్పాన్స్ అందుకుం టోంది. అయితే వేరే లెవెల్ ఫైట్ సీక్వెన్స్ తో ప్రోలాగ్ వీడియో స్టార్ట్ అవ్వగా.. సర్దార్ పై దాడి చేసేందుకు కొందరు వస్తారు. అప్పుడు దేశం ప్రమాదంలో ఉందని గ్రహిస్తాడు. ఆ తర్వాత బ్లాక్ డాగ్గర్ ప్రళయం క్రియేట్ చేసేందుకు ట్రై చేస్తున్నాడని చెబుతాడు. పోరాడేందుకు సిద్ధపడతాడు. కోలీవుడ్ స్టార్ నటుడు ఎస్ జే సూర్య నెగిటివ్ రోల్ లో కనిపిస్తారు. అసలు దేశాన్ని నాశనం చేసేందుకు ఎస్ జే సూర్య ఏం చేశాడు? కార్తీ దాన్ని ఎలా ఛేజ్ చేశాడు? అన్నది సినిమాగా తెలుస్తోంది. మొత్తానికి ప్రోలాగ్ వీడియోలోని కార్తీ డైలాగ్స్.. మూవీపై మంచి అంచనాలు నెలకొల్పాయి. ఆయన గెటప్ అండ్ యాక్టింగ్.. అదిరిపోయిందని నెటిజన్లు, మూవీ లవర్స్ కొనియాడుతున్నారు. కార్తీ నట విశ్వరూపం అని కామెంట్లు పెడుతున్నారు. ఇక సినిమా విషయానికొస్తే.. ఆషిక రంగనాథ్, మాళవిక మోహనన్ హీరోయిన్లు గా నటిస్తున్నారు. ఎస్ జే సూర్య విలన్ గా కనిపించనున్నారు. యువన్ శంకర్ రాజా మ్యూజిక్ అందిస్తున్నారు. జార్జ్ సి.విలియమ్స్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే మూవీ షూటింగ్ పూర్తి కాగా.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలోనే రిలీజ్ కానుంది. అయితే 2022లో రిలీజ్ అయిన సర్దార్ భారీ విజయం సొంతం చేసుకుంది. దీంతో ఇప్పుడు అంతకు మించి ఫ్యాన్స్ ఎక్స్పెక్ట్ చేస్తున్నారు. మరి సర్దార్ 2 ఎలా ఉంటుందో.. ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# ఇదేం విడ్డూరం అలియాభట్ తో నాకు పోలిక!

టాలీవుడ్ కి తుఫాన్ లా దూసుకొచ్చిన షాలిని పాండే బాలీవుడ్ లో బిజీ అయిన సంగతి తెలిసిందే. తెలుగు సినిమాల అనంతరం అమ్మడు హిందీ సినిమాల్లో స్థిరపడే ప్రయత్నం చేసింది. మధ్యలో కోలీవుడ్ సినిమాలు కూడా చేసింది. టాలీవుడ్ లో పోటీని తట్టుకోలేక అమ్మడు ఎక్కువ సమయం వృదా చేయకుండా షిఫ్ట్ అయిపోయింది. ప్రస్తుతం హిందీ, తమిళ సినిమాల్లో నటిస్తోంది. అయితే ఈ బ్యూటీని కొందరు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియాభట్ తో పోల్చుతున్నారు. అందంలో..ఆహార్యంలో అలియాభట్ లా ఉంటుందని కంపారిజన్ చేసారు. అయితే ఈ పోలిక షాలిని పాండేకు ఎంత మాత్రం నచ్చలేదు. తాను అలియాభట్ లా ఉండటం ఏంటి? తన కంటూ ఓ సొంత ఐడెంటిటీ ఉండాలి అన్నట్లు వ్యాఖ్యానించింది. ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియాభట్ ఉన్నారు. మరో అలియాభట్ అవసరం లేదు. నన్ను ఆమెతో పోల్చోదు. అది నాకెంత మాత్రం



నచ్చడం లేదు. ఇది అభిమానంతో చేస్తోన్న పని అయినా? ఎందుకనో నచ్చలేదు. అలియాలా మరోకరు ఉండాల్సిన అవసరం లేదు. ఉండాలని కూడా అనుకోరు. అలియా అద్భుతమైన నటి. ఎంతో అందంగా ఉంటుంది. ఈ విషయాల్లో ఆమెను స్ఫూర్తిగా తీసుకుంటాను. ఆమె ను చూసి ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నాను. కానీ ఆమెతో పోల్చితే మాత్రం నచ్చదు. నాకంటూ ఓగుర్తింపు తెచ్చుకో వాలన్నదే నా తాపత్రయం అని నవ్వేసింది. దీంతో ఇప్పుడీ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. సాధారణంగా ఫేమస్ అయిన బ్యూటీలతో పోల్చితే నవతరం భామలు ఎంతో సంతోషిస్తారు. దాన్ని గొప్ప కాంప్లిమెంట్ గా తీసుకుంటారు. ఆమె స్థాయిని చేరుకోవాలని చెబుతుంటారు. కానీ కొందరు మాత్రమే షాలినీలా సొంత ఐడెంటిటీని కోరుకుంటారు. కష్టపడితే సాధించలేనిది ఏదీ ఉండదు...కొత్తగా తానే సాధించి చూపిస్తానని సవాల్ విసురుతారు. అలాంటి మనస్తత్వం గలది షాలినీ పాండే.

# క్రికెటర్‌తో మలైక అరోరా డేటింగ్?

నటి మలైకా అరోరా మాజీ రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ కుమార్ సంగక్కరతో డేటింగ్ చేస్తున్నట్లు ఊహాగానాలు మొదలయ్యాయి. ఆ ఇద్దరూ రాజస్తాన్ రాయల్స్ డగౌట్‌లో ఉన్న ఫోటో ఆన్‌లైన్‌లో వైరల్ అయింది. గౌహతిలోని బరస్పరా క్రికెట్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్ వర్సెస్ చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌ను ఆస్వాధిస్తున్న నటి మలైకా అరోరా, శ్రీలంక మాజీ క్రికెటర్, మాజీ రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్, ప్రస్తుతం క్రికెట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కుమార్ సంగక్కరతో కలిసి ఉన్న ఫోటో ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టించింది. ఆదివారం నాటి మ్యాచ్ లో ఈ జంట అందరి దృష్టిని విశేషంగా ఆకర్షించింది. మలైకా రాయల్స్ జెర్సీలో ఉన్నట్లు చూపించే క్లిప్‌ల నుండి స్క్రీన్‌షాట్‌లు వైరల్ అవుతున్నాయి. %==% డగౌట్‌లో మలైకా ఎందుకు ప్రవేశించింది? అంటూ నెటిజనులు ఆరాలు తీస్తున్నారు. ఈ జంటను చూశాక రెడ్డిటర్లు అస్సలు ఆగలేకపోతున్నారు. వెంటనే ఊహాగానాలు ప్రారంభించారు. అసలు ఆ టీమ్‌తో మలైకా సంబంధం ఏమిటో



తెలుసుకోవాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. అంతేకాదు.. మలైకా-కుమార్ సంగక్కర కలిసి తిరుగుతున్న వీడియో వైరల్ కావడంతో వారిద్దరి మధ్య ఏదో నడుస్తోంది! అంటూ నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. మలైకా అరోరా కుమార్ సంగక్కరతో కలిసి కూర్చున్నారు. ఏదో జరుగుతోంది! ఆర్‌ఆర్ టీమ్ తో మలైకాకు ఎలాటి సంబంధం కనిపించడం లేదు! అని నెటిజనులు వ్యాఖ్యానించారు. అయితే ఇద్దరు వ్యక్తులు ఒకరి పక్కన ఒకరు కూర్చున్నంత మాత్రాన వారు డేటింగ్ చేస్తున్నారని అర్థం చేసుకోవాలా? ఇది సరైనదేనా? మీడియా ఇలాంటి నిరాధారమైన కథలు కల్పించడం మానేయాలి! అని ఆ ఇద్దరికీ చెందిన సోర్స్ ఖండించినట్టు తెలుస్తోంది. నటుడు అర్జున్ కపూర్ సింగిల్ అని ప్రకటించిన తర్వాత అతడు మలైకా నుంచి దూరంగా ఉంటున్నాడని క్లారిటీ వచ్చేసింది. మలైకా- అర్జున్ 2018లో డేటింగ్ ప్రారంభించారు. గత సంవత్సరం అక్టోబర్‌లో సింగం ఎగైన్ చిత్రం ప్రమోషనల్ ఈవెంట్ లో బ్రేకప్ ని అతడు ధృవీకరించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536